

ఆంధ్రపత్రిక
సచిత్ర వార పత్రిక
12-6-'57
ANDHRA PATRIKA
ILLUSTRATED WEEKLY




నర్తకి

ఫొటో వి కేశవశర్మ

పాఠకలోకంపై పన్నీటిజల్లు!

★ వినాయకచవితికి ★

ఆంధ్రపత్రిక సచిత్రవారపత్రిక



హాస్యసంచిక

నవ్వు ఆనందానికీ, ఆరోగ్యానికీ పర్యాయపదం. హాస్యం అనేకవిధాలుగా ఉంటుంది. పల్లెటూరిహాస్యం ఒకతీరు, బస్తీహాస్యం మరొకతీరు. కోర్టుల్లో జడ్జీలు, లాయర్లు, ముద్దాయిలు, ఆస్పత్రుల్లో డాక్టర్లు, రోగులు; పాఠశాలల్లో మేష్టర్లు, విద్యార్థులు, ఒకరిమీదఒకరు ఛలోక్తులు విసురుకుంటారు. ఇంట్లో భార్యాభర్తలు, బావామరదళ్లు, బావామరుదులు, పెళ్లిళ్లలో వియ్యాలవారు వేళాకోళా లాడుకుంటారు. రాజకీయాల్లో, సాహిత్యంలో, నాటక రంగస్థలాలమీద హాస్యప్రియులుగా ప్రసిద్ధికెక్కిన ప్రముఖు లెందరో ఉన్నారు. హాస్యానిది జీవితంలో విశిష్టస్థానం.

హాస్య రచయితకు ప్రజలమీదఉండే పలుకుబడి ఇంకెవరికీ ఉండదు హాస్యరచన పాఠకుల్ని నవ్వించి, కవ్వించి, ఆనందింప జేయడమేగాదు, జీవితంలోని లోపాలెత్తిచూపి, కడిగేసి, తుడిచేసి హృదయాలను నిర్మలంచేస్తుంది.

తెలుగులో హాస్యరచనలను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ ఏడాది ఆంధ్ర వారపత్రిక వినాయకచవితి [28-8-57] సంచికను హాస్యసంచికగా ప్రచురిస్తున్నాము. సంచిక ఆసాంతం హాస్యం ఉట్టిపడేలా చేయాలని మా ఆశయం.

కవరు పేజీకి బహుమతి

వినాయకుడు హాస్యమూర్తి! కనుక హాస్యసంచిక అట్టమీద వినాయకుడే ఉంటాడు వినాయకునికి సంబంధించిన చక్కనిహాస్య సన్నివేశం కల్పించి వర్ణచిత్రం పంపవలసిందిగా చిత్రకారులకు విజ్ఞప్తి ముఖచిత్రానికి అంగీకరించిన చిత్రానికి రూ. 50/- పారితోషిక మిస్తాము [సైజు 8" × 11"]

హాస్యరసప్రధానమైన కథలు, నాటికలు, వ్యాసాలు, గేయాలు, ఛలోక్తులు, వేళాకోళాలు, ఇవికాక దైనికజీవితానికీ, రాజకీయాలకూ సంబంధించిన కార్టూన్ చిత్రాలు ప్రచురిస్తాము వనితాలోకం, బాలసాహితి, సినిమాశీర్షికలలోకూడా అన్నీ హాస్యరచనలే ప్రచురిస్తాము ఆంధ్ర రచయితలు, ముఖ్యంగా హాస్య రచయితలు మా ఆశయం జయప్రదంగా నెరవేరడంలో సహకరిస్తారని విశ్వసిస్తున్నాము వేళాకోళమాడడం తెలుగు ఆడబడుచులకు వెన్నతోపెట్టిన విద్య అందుచేత వనితల సహకారానికి ఇదే మా ప్రత్యేక విజ్ఞప్తి

హాస్యసంచికకు రచనలు పంపేవారు ఆగస్టు 1 వ తేదీకే మాకు అందేలా "సచిత్ర వారపత్రిక హాస్యసంచికకు" అని వ్రాసి పంపించాలి. కథలైనా, నాటికలైనా, వ్యాసాలైనా వారపత్రికలో మూడు పేజీలకు మించకూడదు. కార్టూన్‌చిత్రాలు డ్రాయింగ్ పేపరుమీద ఇండియన్ ఇంక్‌తోనే వేసిపంపాలి

సంవత్సర చందా
రు. 13-0-0
విడిపత్రిక 25న.పై.

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder K. NAGESWARA RAO

సంపుటము 51
సంచిక 41
12-6-57

హేవిళంబి జ్యేష్ఠ శుద్ధ, పూర్ణిమ బుధవారం

★ విషయానుక్రమణిక ★

ధనం పొదుపు, ధరల అదుపు

మే నెల మధ్యనుంచి నెలాఖరుదాకా దేశమంతటా గగ్గోలు లేవదీసిన కొత్త బడ్జెట్ మీద పార్లమెంటులో చర్చలు పూర్తయి పోయాయి. పార్లమెంటులోనూ, బయటా నిశితమైన విమర్శల గాలి దుమారం చెలరేగింది. కొన్నిచోట్ల హర్తాళ్ ప్రదర్శనలు కూడా జరిగాయి. వీటన్నిటినీ ఆర్థిక మంత్రి ధైర్యంగా ఎదుర్కొని బడ్జెట్ ప్రతిపాదనలను సమర్థించుకున్నారు. ప్రధాన మంత్రి కూడా కలగజేసుకుని ఆయనకు సహాయపడ్డారు. కొన్ని కొన్ని హామీలిచ్చారు. వేసిన పన్నులు కొన్ని తీసేశారు. ఈ తతంగమంతా సక్రమంగా ముగిసినప్పటికీ, బడ్జెట్ ఫలితాలు మాత్రం ప్రజల స్థితిగతుల మీద చాలకాలం దాకా తమ ప్రభావం కనబరుస్తూనే ఉంటాయి. సాధారణంగా బడ్జెట్లలాంటి జటిల విషయాలను పట్టించుకోని 'సామాన్యమానవునికి' కూడా ఈ సారితో బడ్జెట్ దెబ్బ చురుకుగా తెలిసివచ్చింది. ఏదో రకంగా ప్రతివాడికీ 'పన్ను నొప్పి' తగిలింది.


ఇలా తగలడమనేది కొత్త బడ్జెట్ తాలూకు మంచి లక్షణాల్లో ఒకటని ప్రధాన మంత్రి పేర్కొన్నారు. పంచవర్ష ప్రణాళిక లంటే "వాటిగొడవ మనకెందుకులెద్దూ" అనుకునే ప్రజలకి ప్రణాళిక తాలూకు ఆర్థిక భారాలను నెత్తిమీదపడేసి 'ఇదా ప్రణాళిక అంటే? దీనికి మనం కూడా ఒక భుజం వెయ్యాలన్నమాట' అని సాధారణ పౌరుడు కూడా అనుకునేలాగ కొత్తబడ్జెట్ చేసిందని, ప్రణాళిక/ఎవరో కొందరి బాధ్యతే కాదనీ, అందరికీ సంబంధించినదనీ ఆయన చెప్పారు. ప్రణాళిక లక్ష్యాలను తగ్గించడానికి, ప్రణాళిక కాలాన్ని పొడిగించడానికి వీల్లేదని ఆయన ఖండితంగా చెప్పారు. సమగ్రమైన పన్నుల విధానానికి ఈ బడ్జెట్ పునాది ఏర్పరుస్తోందని కూడా అన్నారు.

దుబారా మాటేమిటి?

పార్లమెంటు చర్చల సందర్భంలో ప్రతిపక్షసభ్యులు, కాంగ్రెసు సభ్యులూ కూడా ప్రభుత్వ కార్యకలాపాల్లో జరుగు దుర్వ్యయాన్ని, అవినీతిని తీవ్రంగా విమర్శించారు. వీటిని తొలగించడానికి కృషిచేస్తామని ప్రధానమంత్రి, ఆర్థికమంత్రి, హామీ ఇచ్చారు. అయినా కొంతవరకూ ప్రభుత్వవ్యయంలో ఆడంబరం, పటాటోపం తప్పదని సమర్థించారు. గవర్నర్లు భారీ ఎత్తునచేసే విందులను ఆచార్య కృపలానీ విమర్శించగా "మీరు వాటికి హాజరు కావడం మానెయ్యండి" అని ఆర్థికమంత్రి సమాధానం ఇచ్చారు. ఈ సమాధానం తెలివిగానే ఉందిగాని బాధ్యతాయుతంగా లేదు. అఖిలభారత కాంగ్రెసు సంఘ సమావేశంలో ప్రధాని నెహ్రూ మాట్లాడుతూ ఎంతజాగ్రత్తగా పొదుపుగా ఖర్చు పెట్టినప్పటికీ, మిగిలేవి కొన్ని కోట్ల రూపాయలే ననీ, వీటివల్ల ఒరిగేదేమీ లేదని అన్నారు. ఇక్కడే వస్తుంది అసలు చిక్కంతా.

బాధ, బాధ్యత

ప్రణాళిక బాధ్యత ప్రతిపౌరుడికీ తెలిసి వచ్చేట్లు చేయడానికి పన్నులు వేయడమే మార్గం కాదు. పన్నులు కట్టమంటే ఎవడికైనా బాధగానే ఉంటుంది. కాని తను కట్టే పన్నుల ధనం సక్రమంగా వినియోగమవుతోందనీ సమష్టి అభివృద్ధికి సహాయపడుతోందనీ, దుబారా కావడం లేదనీ తెలిస్తే సంతోషంగా పన్నులు చెల్లించడానికి అవకాశం ఉంటుంది. ప్రధానమంత్రి ఆశించినట్లు ప్రణాళిక భారాన్ని వహించేం



ధనంపొదుపు ధరల అదుపు

దుకు అందరూ ఉత్సహించడానికి తగిన మానసిక వాతావరణం ఏర్పడుతుంది. ఈ దృష్ట్యా ప్రజాధనం దుబారా కారాదనే తప్ప, పొదుపుచేసి సంతమాత్రాన పన్నుల అవసరం తప్పిపోయేంతగా కలిసివస్తుందని అర్థంకాదు.

వేసినపన్నుల తీసివేత

పార్లమెంటులో చర్చలకు సమాధానమిస్తూ ఆర్థికమంత్రి కొన్ని ప్రతిపాదనలు ఉపసంహరించుకున్నారు. కిరసనాయిలు మీద, న్యూస్ ప్రింట్ మీద అదివరకే ఉపసంహరించుకున్నారు. ఇప్పుడు కాఫీ, టీల మీద ఎక్కువచేసిన సుంకాన్ని యథాస్థితికి తగ్గించివేశారు. ఈతగ్గింపువల్ల ఖజానాకు 3.25 కోట్ల రాబడి తగ్గుతుంది. పోస్టు కార్డులమీద, పార్సిళ్ళమీద వేసిన అదనపు చార్జీలను తగ్గించారు. కాని కవరుఖరీదు 13 నుంచి 15 నయాపైసలకు పెంచారు. రైలు టిక్కెట్ల చార్జీలలో కూడా కొన్నిమార్పులు చేశారు. మొదటి 15 మైళ్ళ ప్రయాణం మీద మామూలు చార్జీనే ఉంచి, తరవాత 15 మైళ్ళ వరకూ నూటికి 5 వంతుల చొప్పున చార్జీ పెంచారు. ఆతరవాత చార్జీ పెరుగుదల ఇది వరకు ప్రకటించిన రేట్ల ప్రకారమే ఉంటుంది.

కుటుంబం సైజు

ఇక ఆదాయం పన్నులో ఆర్థికమంత్రి చేసిన మార్పులివి: పన్నుపడకుండా మినహాయించే పరిమితిని రూ. 3 వేలకు పైన పెంచడానికి నిరాకరించారు. కాని పిల్లలున్న వారికి కొంచెం సహాయం చేశారు. ఒక్కొక్కరికి మూడేసి వందల చొప్పున ఇద్దరు పిల్లలకు రూ. 600 పన్నునుంచి మినహాయించారు. పెళ్ళయినవారికి ఇదివరకే మినహాయించిన రూ. 2000 కు ఈ పిల్లల భత్యాన్ని కలుపుతారు. అంటే పన్నునుంచి మినహాయించిన మొత్తం రూ. 2600 అవుతుంది. మూడు వేల రూ.ల పైబడి సంపాయిస్తున్న వారికి ఇద్దరు పిల్లలున్నట్లయితే మొదటి రూ. 2600 మీద పన్ను కట్టనక్కర్లేదని దీని అర్థం. దీనివల్ల ఒకరిద్దరు పిల్లలుగలవారికి గుడ్డిలో మెల్లగా సహాయం కలుగుతుంది. ఒక దెబ్బతో రెండు పిట్టలన్నట్లు, దీనితో కుటుంబం సైజును కూడా నియమితం చేయాలని ఆర్థిక మంత్రి భావమేమో తెలియదు. అయితే ఈ మినహాయింపువల్ల ఖజానాకు నిజంగా వచ్చేరాబడి నష్టమేమీ లేదు. ఎందుకంటే రు. 20,000 కంటె పైనరాబడిఉన్నవాళ్లకివివాహభత్యం, పిల్లలభత్యం ఇవ్వరట. ఈ మార్పులవల్ల ఖజానాకు పోయేదానికంటే కలిసివచ్చేదే ఎక్కువ.

ఇక సంపదపన్నులో చేసిన మార్పు: కొత్తగా స్థాపించిన కంపెనీలకు అయిదేళ్ళ వరకూ ఈ పన్నులేకుండా చేశారు. ఇది 'గుడ్డిలో మెల్ల' సహాయమే. కంపెనీ నష్టంతో నడుస్తున్నప్పటికీసంపదపన్ను తప్పక పోవడమే పెద్దచిక్కు. ఖర్చు పన్నులో ఏవో సహాయాలు కలగజేస్తామని ఆర్థిక మంత్రి వాగ్దానం చేశారు. కాని ఈ పన్ను వసూళ్ళలో ప్రజలకు కలిగే ఇబ్బంది ఇబ్బందిగానే ఉంటుంది.

కళ్ళనీళ్ళ తుడుపు

ఈమార్పులన్నిటివలా ప్రభుత్వానికివచ్చే రాబడితగ్గుదలఈఏడాదికిరూ.5కోట్ల 50 లక్షలు మాత్రమే. ప్రజాభిప్రాయాన్ని మన్నించి మార్పులు చేశామని చెప్పుకోవడానికే ఈ మార్పులుచేసినట్లు కనబడుతుంది. అసలిలా తరవాత మార్చే ఉద్దేశంతోనే ముందు కాఫీ, టీ వగైరాలమీద పన్నులు హెచ్చించినట్లుకూడా కనబడుతుంది. అయితే ఈ తాత్కాలికమైన హెచ్చింపువల్ల హోటలు వ్యాపారస్థులకు బాగా లాభించింది. పన్ను హెచ్చించారని తెలియగానే కాఫీ, టీల ఖరీదు పెంచేశారు. ఒక పదిహేను రోజుల పాటు ప్రజలకు అనవసరమైన నష్టం, వ్యాపారస్థులకు అనవసర లాభం కలిగాయి. దీని బాధ్యత ఆర్థికమంత్రిదే.

ఆహార ధరల అదుపు

ప్రణాళిక అమలుకు ఆహారోత్పత్తిని అధికంచేసి, ధరలను అదుపులో ఉంచడం అత్యావసరమని ప్రధాన మంత్రి, ఇతరులు ఉద్ఘాటించారు. ధరలను అదుపులో పెట్టేందుకు రూ. 25 కోట్ల రూ.ల సబ్సిడీ కేటాయిస్తున్నామని ఆర్థిక మంత్రి ప్రకటించారు. అవసరమైతే ఇంకా కేటాయించగలమని అభయమిచ్చారు. ఇది సమంజసమే. మొదటి ప్రణాళికఫలితంగా ఆహారోత్పత్తి పెరిగినట్టే పెరిగి చివరి రెండేళ్లలోనూ పడిపోయింది. దీనివల్ల ఆహారాన్ని దిగుమతి చేసుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. పారిశ్రామికాభివృద్ధికి అత్యంతావశ్యకమైన విదేశీ ద్రవ్యం, మనదేశంలో మనమే పండించుకోగల ఆహారపు దిగుమతికి వినియోగమై పోవడం విచారకరమే. విదేశీద్రవ్యపు ఇబ్బందులకు ఇది కూడా ఒక కారణం. అధికాహారోత్పత్తికి, ధరలు అదుపుచేయడానికి, చాటుగా ధాన్యం నిలవచేయకుండా వారించడానికి ప్రభుత్వం తీవ్రచర్యలు తీసుకోవాలి. అలాచేయకుండా పన్నులు అధికంచేసి, ప్రణాళికను అనుకున్న ఖర్చుతో, అనుకున్న కాలంలో అమలుచేయగల మనుకోవడం భ్రమే అవుతుంది. ★

"ఇంటింట పెడతారు యెంకి నీ పేరు"

ఈ రోజుల్లో సామాన్యంగా ఏదో ఒక 'ఎంకిపాట' విననివా రుండరు.

"ఆనాటి వావోడు
సెందురూడా!
అలిగిరా లేదోయి!
సెందురూడా!"
"కొమ్మలో కోయిలా
కోయంటదే!
రాగతనమో ఏమి
బాగువోగెరుగదే!"
"ఆరి పేయవే! దీపమూ!
ఎలుగులో నీమీద
నిలపలే నే మనసు
ఆరి పేయవే! దీపమూ!"

ఈనాడీ పాటలు, రేడియోలోను, సభల లోను, సమావేశాలలోను చాలా చోట్ల వినిపిస్తున్నాయి. వీటిని గురించి పూర్వం ఒకప్పుడు పెద్ద పెద్ద గాలిదుమారాలు చెలరేగాయంటే ఈ కాలం వారికది ఆశ్చర్యంగానే కనబడుతుంది.

'ఎంకిపాటలు' మొట్టమొదటగా రచించిన రోజుల్లో కొంతమంది గొప్ప సాహిత్యపరులివి విని అసభ్యంగా ఉన్నాయని చప్పరించేశారు. మరి కొందరు 'ఎంకి-నాయుడు బావ'లవంటివారి ప్రణయ కలాపాలు గేయాలుగా రచించడం మన ప్రాచీనాలంకార శాస్త్రసంప్రదాయానికి విరుద్ధం అన్నారు. అయితే పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి వంటి విద్వాంసులే ఇవి నవ్యాంధ్ర కవితకు నూతనాలంకారాలనీ, వీటిలో 'ఎంకి నాయుడు బావ'ల అమాయక సరళప్రేమ ప్రతిబింబించిందనీ, ఇవి సహృదయులందరికీ శిరోధార్యాలనీ వాదించారు.

'ఎంకిపాటల' కృతికర్త

ఎంకిపాటల కృతికర్త నండూరి వెంకట సుబ్బారావుగారు 1895 లో జన్మించారు. మద్రాసు క్రిష్టియన్ కళాశాలలో పట్టభద్రులై కొంతకాలం నూజివీడు హైస్కూలులో ఉపాధ్యాయులుగా పనిచేశారు. తరవాత మదరాసు న్యాయకళాశాలలో బి. ఎల్ పరీక్షలో ఉత్తీర్ణులై ఏలూరులో న్యాయవాద వృత్తి సాగించారు.

వీరు మొన్న మే 29వ తేదీని హృద్రోగం వల్ల స్వర్గస్థులయినారు. వీరివయస్సు 68 సంవత్సరాలు.

గేయ రచన

సుబ్బారావుగారు 1917 ప్రాంతంలోనే తమ గేయరచన కుపక్రమించారు. ఇవి ఆంధ్రదేశంలో జానపదులు పాడుకొనే పాటల ధోరణిలో రచించిన గేయాలు.

ఈ గేయాలలో మన తెలుగు పల్లెల పరిసరాలు, పల్లె పట్టులలో పుట్టి పెరిగిన ఎంకి నాయుడు బావల సరస సల్లాపాలు, ప్రణయ కోపాలు, తాపాలు, మొదలైనవన్నీ ఎంతో సరళంగా మనోజ్ఞంగా ప్రతిబింబించాయి.


సుబ్బారావుగారి గేయాలవంటి రచనలా కాలంలో చాలా తక్కువ. అంతకుపూర్వం మనకు కవిత చాలావరకు ప్రబంధమార్గంలోనే నడిచింది. సుబ్బారావుగారికి పూర్వం గురుజాడ అప్పారావుగారు నీలగిరి పాటలలోను, ముత్యాల సరాలలోను కొంత వరకీ పాటలకు మార్గదర్శకులైనారు. సుబ్బారావుగారు మొట్ట మొదటిగేయ సంపుటి 1925 లో ప్రకటించారు. దానిలో 35 గేయాలున్నాయి. తరవాత రచించిన కొత్త గేయాలు చేర్చి ఇటీవల మరింకొక గేయ సంపుటి ప్రకటించారు. రెండవ సంపుటి ప్రకటించిన తరవాత కూడా వీరింకా కొన్ని కొత్త గేయాలు రచించారు. ఇవి భారతి, ఆంధ్రప్రభ మొదలైన పత్రికలలో ప్రకటించారు.

కొందరు రచయితలు వందలాదిగా రచనలు సాగిస్తారు. అయితే అవి అన్నీ మాత్రు భాష కమూల్యాలంకారాలుగా రచించగలవారు చాలా తక్కువ. సుబ్బారావుగారు రచించిన గేయాలన్నీ కలిపి నూరు గేయాల కన్న ఎక్కువ ఉండవు, కవితా శిల్పాన్ని బట్టి చూస్తే అవి అన్నీ నవ్య సాహిత్యాని కలంకారాలే! ఈ విధంగా పలికినవన్నీ భాషా మోషకు త్తమాలంకారాలుగా సంతరించిన ఈ కవి ధన్యులు!

సాంప్రదాయిక ధోరణి కలవాటుపడిన పాఠకులందరికీ సజీవమయిన నూతన రచన ఒక విడ్డూరంగా కనబడడం వాఙ్మయ చరిత్రలలో కొత్తకాదు. అందు చేత నే సుబ్బారావు గారి రచనల కొందిలో అంతటి గాలిదుమారం చెలరేగింది. అయినా ఆ రోజుల్లో కూడా కవికి తన రచన జాతికి జీవగర్ర అనే ఆత్మ విశ్వాసం సడలలేదు. ఆనాడా ఆత్మ విశ్వాసంతో నండూరి సుబ్బారావుగారు రచించిన ఈ గేయం నేటికీ ఒక అశరీర వాణిలా వినబడుతూనే ఉంది!

"ఆసీమ ఈసీమ అందరందాలు
తిన్నంగ నినుసూసె దిద్దుకుంటారు!
"ముందు మవ పాపణ్ణి కిందదిగనీరు!
ఎంకి కోవంటారు ఎత్తుకొంటారు!
ఎం కొక్క దేవతై ఎలిసెనంటారు
ఇంటింట పెడతారు ఎంకినీ పేరు!"

★



దేశమంతటా నెలకొల్పబడుతున్న పరిశ్రమలలో ఒక శాఖ విశాఖపట్టణంలో వెలిసింది. 15 కోట్ల రూ. ల ఖర్చుతో

విశాఖపట్టణంలో

కాల్టెక్స్ పెట్రోలు కర్మాగారం

కొన్నేళ్ళ తరవాత ఇప్పుడు మళ్ళీ విశాఖ పట్టణం రేవు దగ్గరగా వెళ్ళినవాళ్ళు ఆ ప్రాంతాన్ని ఓ పట్టాన గుర్తుపట్టలేరు. అల్లిబిల్లి తీగల్లా అల్లుకున్న నూనె గొట్టాలు, తాటిచెట్టంత పొడుగున నిలబడ్డ స్తంభాలు, బ్రహ్మాండమైన గిడ్డంగులు, బాయిలర్లు కనిపిస్తాయి.

అక్కడొక నూనెశుద్ధి కర్మాగారం ఏర్పడ్డట్టు చెప్పకుండానే తెలిసిపోతుంది. పారిశ్రామికంగా సర్వతోముఖవికాసం పొందుతున్న భారతదేశానికి ఈ కర్మాగారం సరికొత్తకొమ్మ.

వచ్చే జూలైనాటికి ఈ కర్మాగారం లోంచి పల్లెటూళ్ళ ఇళ్ళలోని దీపాల్లోకి కిరసనాయిలు ప్రవహిస్తుంది, మోటారుకార్లలోకి గాసొలిన్ ప్రసరిస్తుంది ఫ్యాక్టరీలకు జీవరక్తమైన రకరకాల నూనెలు వెలువడతాయి.

క్రూడాయిల్ శుద్ధిచేసే యంత్రం మొన్న ఏప్రిల్ 15 వ తేదీనే పని ప్రారంభించింది. అంటే నూనెశుద్ధి పనిలో మొదటి భాగం పూర్తయిందన్నమాట.

పెద్ద పెద్ద గిడ్డంగులలో నిలవ చేసిన క్రూడాయిల్‌ను మొదట ఒక "హీటర్" ద్వారా పంప్ చేస్తారు. అప్పుడు తయారైన నూనెఆవిరిని ఒక ఎత్తయిన గొట్టంలోకి (ఎట్మాస్ఫెరిక్ కాలమ్) పంపిస్తారు. ఆ గొట్టంలో ఈ ఆవిరి వేరు వేరు సాంద్రతల ప్రకారం వేరు వేరుచోట్ల మళ్ళీ ద్రవీభవిస్తుంది. బాగా తక్కువ సాంద్రతగల గాసొలిన్ ఆ గొట్టం పై భాగంలోనే తయారవుతుంది మరికొంతకింద కిరసనాయిల్, ఇంకా దిగువ డీసెల్ ఆయిల్, అట్టడుగున బాగా ముతకపదార్థం తయారవుతాయి


అలా తయారైన గాసొలిన్‌ను మరొక స్టెబిలైజర్ యంత్రంలోకి పంపించి ఇంకా తేలికవాయువు లేవైనా ఉంటే తొలగించివేస్తారు

మరో రెండు రకాల యంత్రాలు (ఫ్లూయిడ్ కెటాలిటిక్ క్రాకింగ్ యూనిట్, పాలీమెరైజేషన్ యూనిట్) స్థాపించడం పూర్తికావస్తోంది వీటిలో ఇతర రకాల గాసొలిన్ తయారవుతుంది ఈ గాసొలిన్‌ను, మామూలు గాసొలిన్‌తో కలిపితే మంచి మేలురకం మోటార్ గాసొలిన్ తయారవుతుంది. దాన్ని ఆధునికమైన ఇంజిన్‌లలో ఉపయోగించుతారు

ముతక పదార్థాన్ని ఎన్నో రకాలుగా శుద్ధిచేసి ఫ్యాక్టరీల్లో వాడే నూనెలు తయారుచేస్తారు. కిరసనాయిలును, డీసెల్ ఆయిల్‌ను ముందు చల్లబరచి, శుద్ధిచేసి సరాసరి గిడ్డంగులలోకే పంప్ చేసి నిలవ ఉంచుతారు.

రకరకాల నూనె తయారీ

విశాఖపట్నంలో కొత్తగా లేచిన ఈ కర్మాగారం కాల్టెక్స్ కంపెనీవారిది. ఈ కంపెనీకి భారతదేశంలో ఇదివరకే రెండు నూనె శుద్ధి కర్మాగారాలున్నాయి 1955 జూన్‌లో భారతప్రభుత్వంతో జరిగిన ఒప్పందం ప్రకారం కాల్టెక్స్ కంపెనీ విశాఖపట్టణంవద్ద కొండల ప్రాంతంలో పని ప్రారంభించింది తరవాత రెండేళ్ళలో కొండల లోను, లోయలలోను మొత్తం 515 ఎకరాల



విశాఖపట్టణంవద్ద కాల్టెక్స్ కంపెనీ నిర్మిస్తున్న నూనె శుద్ధికర్మాగారదృశ్యం పై ఫొటోలో చూడవచ్చు.

స్థలంలో నిర్మాణం సాగింది. రోజుకు 18,500 పీపాల క్రూడాయిల్‌ను శుద్ధిచేయ గలిగిన కర్మాగారం తయారైంది. అంటే ఏడాదికి 7,40,00,000 గాలన్ల మోటార్ గాసొలిన్, 8,11,98,557 గాలన్ల కిరసనాయిల్, 8,16,31,000 గాలన్ల డీసెల్ నూనె, 2,64,95,000 గాలన్ల యంత్రపు నూనె తయారవుతుందన్నమాట. కర్మాగారం నిర్మాణం మంచి ఊపులో సాగుతున్న కాలంలో 9 వేలమంది కార్మికులు పనిచేసేవారు. కర్మాగారానికి 16 వేల టన్నుల సిమెంటు, 38 వేల టన్నుల ఉక్కు పట్టింది.


ఉత్పత్తి జోరుగా ప్రారంభమైన తరవాత ఆర్. టిల్ట్సన్ నాయకత్వాన 550 మంది ఈ ప్రాజెక్టులో పనిచేస్తారు. వందమంది అమెరికన్, బ్రిటిష్ కాల్టెక్స్ కంపెనీ నిపుణులు ఇక్కడ పని చేస్తారు. అయితే క్రమంగా వీరిని తొలగించి వీరిస్థానే భారతీయ ఇంజనీర్లనే వేస్తారు.

మంచి నీటి సప్లై


భారతీయులకు ఈ విధంగా ఉద్యోగాలు దొరకడమే కాక, విశాఖపట్నంలోని కర్మాగారం వల్ల మరికొన్ని సదుపాయాలు కూడా లభిస్తాయి. ముఖ్యంగా దీని ధర్మమా అని మంచినీరు పుష్కలంగా సప్లయి అవుతుంది. గోస్తనీ నదినుంచి 26 అంగుళాల మందంగల గొట్టం ద్వారా నగరానికి, కర్మాగారానికికూడా నీరు సరఫరా అవుతుంది. నీటిగొట్టాన్ని ప్రభుత్వమే నిర్మించింది. దీనికైన ఖర్చును కర్మాగారం చెల్లించే నీటి పన్ను ద్వారా రాబట్టుకుంటారు. ఇదేరీతిగా మాచ్‌ఖండ్ నుంచి విద్యుచ్ఛక్తి నగరానికి, కర్మాగారానికికూడా ఒకేసారి సప్లయి అవుతుంది.

రేవు సౌకర్యాలు

ప్రకృతి సిద్ధంగా ఏర్పడ్డ కొద్ది రేవుల్లో విశాఖరేవు ఒకటి. ఇదివరకే ఇక్కడ నౌకా నిర్మాణకేంద్రం ఉండడంచేత విశాఖపట్టణం మంచి పారిశ్రామిక నగరంగా తయారైంది. ఇప్పుడు కాల్టెక్స్ నూనె శుద్ధి కర్మాగారం కూడా నెలకొనడంతో నగర ప్రాముఖ్యం మరింత హెచ్చవుతుంది. రేవు మంచి సదుపాయాలు కలిగిన రేవు. రెండు నూనెటాంకర్ నౌకలను ఒకేదఫా నిభాయించగలిగిన ప్రత్యేక రేవుస్థలం ఉంది. ఒక మైలు పొడుగు



క్రూడాయిల్ వడబోత యంత్రం మొన్న ఏప్రిల్ 15 నుంచీ పని ప్రారంభించింది. మధ్యలో కనిపిస్తున్న పొడుగాటి గొట్టంలోకి క్రూడాయిల్ పంపించి అక్కడ గాసొలీన్, కిరొసిన్, డీసెల్ నూనెలను విడదీస్తారు.




క్రూడాయిల్‌ను వేడిచేసి, పంప్‌చేసే భాగంలో అల్లిబిల్లిగా నిర్మించబడిన గొట్టాలు.

కాల్టెక్స్ పెట్రోలు కర్మాగారం

గొట్టంద్వారా క్రూడ్‌ఆయిల్‌ను ఒక గిడ్డంగిలోకి పంప్‌చేస్తారు. ఇలాగ క్రూడాయిల్ నిలవచేసే గిడ్డంగులు నాలుగున్నాయి. ఏడేటా పర్షియన్ అఖాతంనుంచీ, ఇండొనీషియానుంచీ క్రూడాయిల్ తీసుకొచ్చే నౌకలు 45 దాకా విశాఖరేవుకు రాగలవు. ఇంకా పెద్ద పెద్ద టాంకర్లు రావడానికి కూడా వీలయ్యేట్లు హార్బరును బాగా లోతుచేసే ఆలోచనలు జరుగుతున్నాయి.

క్రూడ్ ఆయిల్‌ను, శుద్ధిచేసిన నూనెను నిలవ ఉంచేందుకు మొత్తం 68 గిడ్డంగులు కట్టారు. ఇది సామాన్యమైన పనికాదు. ఎంత ఇంజినీరింగ్ నైపుణ్యమో చూపి ఉండక పోతే ఇవి తయారయేవికావు. 30 అడుగుల నుంచి 160 అడుగులదాకా వ్యాసాలు గలిగిన గిడ్డంగులను అరవై ఎనిమిదింటినీ పన్నెండు నెలల్లో పూర్తిచేశారు. ఇప్పటికీ ఇక్కడ ఇంకా నిర్మాణం సాగుతూనే ఉంది. బోలెడు మంది ఇంజినీర్లు, డజన్లకొలదీ కార్మికులు వాడావిడిగా పనిచేస్తూనే ఉన్నారు. రోజంతా రోళ్ళుపగిలే ఎండ. ఎండదెబ్బ తగలకుండా అల్యూమినమ్ టోపీలు పెట్టు



నూనె శుద్ధి కర్మాగారంలోని అన్ని పనులను కంట్రోల్ చేసే గది. ఇక్కడినుంచే మీటలు నొక్కి అన్ని భాగాలనూ పనిచేయిస్తారు. ఫొటోలోని ఇద్దరు ఇంజనీర్లలో ఒకరు జార్జ్ అబ్రహాం (కేరళ), మరొకరు హారీ థామస్ (బ్రిటన్).

కుని తిరుగుతారు. రెండంతస్తులమేడ ఒక టుంది. ఇదే కార్యాలయం. దాన్ని పూర్తిగా ఎయిర్ కండిషన్ చేశారు. అదిగాక యంత్ర పరికరాల నిలయం, పక్కా నవీన పద్ధతిలో ఉన్న లాబొరేటరీ, పనివాళ్ళకి ఎయిర్ కండిషను కాంటీన్, ఒక యార్డ్ ఆఫీసు ఇంకా తయారులో ఉన్నాయి.

పనివాళ్ల సదుపాయాలు

అగ్ని ప్రమాద నివారకదళం ఒకటి ఇరవై నాలుగు గంటలూ రెడీగా ఉంటుంది. అసలు కర్మాగారంలో పనిచేసే ప్రతివాళ్ళూ అగ్ని మాపక యంత్రాలను ఉపయోగించడంలో తర్ఫీదు పొందినవాళ్లే. ఈ యంత్రాలు కర్మాగారంలో ఎక్కడపడితే అక్కడే అమర్చారు. నాకు ఇదంతా తిప్పి చూపిస్తున్న ఒక ఇంజనీరు "ఇక్కడ మా ఇంట్లోకంటే సురక్షితంగా ఉంటుంది," అన్నారు ఛలోక్తిగా.

ఇక, ఉండే కొంపల సంగతేమిటి? కర్మాగారానికి మైలు దూరాన "యరడా పార్కు" అనే స్థలంలో నూరు కుటుంబాలకు ఇళ్లు కట్టడానికి పథకం తయారైంది. మధ్యలో ఒక పార్కు ఉంటుంది. ప్రతి ఇంటికీ తోట వేసుకోడానికి కూడా జాగా ఉంటుంది. కొంచెం పెద్ద ఉద్యోగస్థులు ఉండడానికి వాత్తేరుకు ఏడు మైళ్ల దూరాన ఒక స్థలం ఏర్పాటు చేశారు. ఇది కొండమీద ఉన్నది. అక్కడ అన్ని సదుపాయాలూ ఉండడమే కాక, అక్కడి ప్రకృతి సౌందర్యం కూడా అద్భుతంగా ఉంటుంది.

15 కోట్ల రూపాయల ఖర్చుతో తయారైన ఈ కర్మాగారంలో పని చేసే వాళ్లు సంతృప్తులైతే నే పని ఉత్సాహంగా సాగుతుందనేది కాల్టెక్స్ కంపెనీ విశ్వాసం. ★

"అలాగా? నిజంగా?"

మే నెల ఆఖరురోజున చెన్నపట్టణంలో ఎప్పుడూ లేనంత ఉక్క పోసింది. వడగాలి బాగా కొట్టింది. దీనికి కారణం ఏమిటని 'మెటీరాలాజికల్' ప్రధాన కార్యాలయంలో భోగట్టా చేయగా చల్లగాలి వీచక పోవడమే నని శాస్త్ర రీత్యా కనుక్కొని చెప్పారు. మామూలుగా సముద్రం మీంచి వచ్చే చల్లగాలి పెందరాళే వచ్చేది. కాని ఆరోజున సాయంత్రందాకా రాలేదట. అందుచేతే అంత ఉక్క పోసిందట. —పత్రికలలో వార్త.

బావ మరుదులు



సాంసారిక హాస్యము అంటే సంసార సంబంధమైన హాస్యము. భార్యాభర్తలు, వదినా మరదళ్లు, బావా మరుదులు ఒకరిపై ఒకరు విసురుకునే ఛలోక్తులు, సరసోక్తులు, వక్రోక్తులు మొదలైన ఉక్తి విశేషాలతో కూడిన రసవంతమైన వాగ్వ్యాపారమే సాంసారిక హాస్యము.

కోర్టులలో వ్యవహారాలుగాని, న్యాయాధిపతులుగాని ఎప్పుడైనా హాస్యంగా మాట్లాడవచ్చు. హాస్యప్రవృత్తి కలవారు ఎక్కడున్నా సమయం చిక్కితే ఒక్క విసురు విసరకుండా వూరుకోరు.

ఒకడు ఒకే యింటికి రెండుసార్లు కన్నం వేశాడట.—ఆ దొంగను న్యాయస్థానానికి విచారణకై తీసుకొనివచ్చారు. "ఒకే ఇంటికి రెండుసార్లు ఎందుకు కన్నం వేశావు?" అని అడిగితే, నిందితుడు:- "బాబూ! ఈ రోజుల్లో ఇండ్లకొరత ఏర్పడ్డదీ అన్నమాట తమకు తెలియంది కాదు గదా!"... అన్నాడు. ఇలాంటిది న్యాయస్థానాలకు చెందిన హాస్యము.

ఇదే విధంగా రోగులు డాక్టరుతోగాని, డాక్టరు రోగులతోగాని హాస్యంగా మాట్లాడితే అది మెడికల హ్యూమర్ అంటారు.

ఇలాగే వివిధ జీవితరంగాలకు సంబంధించిన హాస్యపు పలుకులు ఉండనే ఉంటవి. అన్నిటిలోకి సర్వజనానుభవ వేద్యమైనది, ప్రతివానికి అతి సన్నిహితమైనది ఈ సాంసారిక హాస్యం; అన్నిటిలోకి ఉత్తమమైనది రమణీయమైనది కూడా...

బావ మరదుల మధ్య హాస్యం సంప్రదాయసిద్ధము. అది వారిద్దరకును మధ్యగల సన్నిహితత్వాన్ని, సమాదరణను సూచించేదిగా వుంటుంది; ఒకరిపై ఒకరికిగల అనురాగాన్ని సూచించేదిగా కూడా ఉంటుంది. ఇందులో ద్వేషానికి తావులేదు.

బావతో హాస్యం ఆడటమూ, వేళాకోళం చేయడమూ పూర్వం నుంచీ వున్నదే. అయితే, పూర్వపు రోజులలో కొంత మొరటుగాను, మోటుగాను ఉంది ఈ హాస్య వ్యాపారం.—

బావగారు నిద్రపోతున్న సమయంలో, ఆయన జుట్టుకూ, మంచం నవారుకూ ముడి వేయడమూ, తిమలపాకులలో చింతగింజ పెట్టి ఇవ్వడమూ, పడుకొన్నే పక్కపైన కనపడకుండా పల్లెరుకాయలు పోయడమూ మొదలైన చిలిపిచేష్టలవల్ల కొంత వినోదాన్ని పొందేవారు.

ఇదంతా చేష్టలను ఆశ్రయించుకొనిన హాస్యం. బావామరుదుల మధ్య నడిచే హాస్యము చాలావరకుచేష్టానుగతంగానే వుంటుంది. బావ మరుదులు ఇద్దరూ నాగరీకులు, సంస్కృతి కలవారు, అయినప్పుడు ఆ హాస్యం వాగ్గతమై ఉత్తమ స్థాయికి చెందినది అవుతుంది.

ఏదో ఒక కొంటెపనిచేసి, అవతల మనిషిని ఏడ్పించడము సులభం; హృదయాన్ని గిలిగింత పెట్టగలయట్టి హాస్యపు పలుకు పలకడమూ కష్టమే.

బావ మరదుల హాస్య ప్రసంగాలలో జుగుప్సాకరము కానట్టి, వికార రహితమైనట్టి ఉత్తమ హాస్యం జనించేందుకు అవకాశమున్నది.

సాంసారిక హాస్యం

ఇట్టి ఉత్తమ హాస్యం వాగాశ్రయం కావచ్చు, లేదా, క్రియాశ్రయం కావచ్చు. మా బావమరిది వేషాన్ని గురించి వర్ణించి నవ్వించడానికి ఏమాత్రమూ ఆస్కారం లేదు. చక్కని దుస్తులు వేసుకొంటాడు; చక్కగా హాస్యంగా మాట్లాడుతాడు. బావమరిది అన్నవాడు ఎక్కడైనా అంతే. బావకంటే మరిదే అన్నివిధాల మెతుగ్గా కనపడుతూ వుంటాడు.

మునిమాణిక్యం నరసింహారావు

బావ మరదులు అన్న జాతి మనుష్యులు—ఆజాతి వృద్ధి పొందుగాక!—సంస్కారం కలవారై, ఇంట్లో ఇల్లాళ్ళకు అత్యంత సన్నిహితులూ, ప్రేమపాత్రులూ అయి, తమ తమ తోడబుట్టినవారితో కలిసి బావలను హాస్యమాడుతూ వుంటారు. ఈ వ్యాపారంలో తోడబుట్టిన వానికి ఇంటి ఇల్లాలు ఎప్పుడూ తోడు నీడగా ఉంటూ, అతడు పాడే పాటకు పక్కవాయిద్యం వాయిస్తూ, వుంటుంది. అప్పా తమ్ముళ్లు ఇద్దరూ కలిసి బావగారిని రెండుప్రక్కలా వాయిస్తూ, హేళనచేస్తూ, వేళాకోళం చేస్తూ ఒకొకప్పుడు ఆనందాన్ని మరికొన్ని సమయాలలో కించిత్తుగా మనఃక్లేశాన్ని కలిగిస్తూ ఉంటారు. ఒకప్పుడు వీరిద్దరికితోడు మరదలుపిల్ల కూడా ఉంటుంది. అప్పుడు వీళ్లు ముగ్గురూ మాట్లాడే హాస్యపు పలుకులతోనూ, చేసే అల్లరులతోనూ ఇల్లు స్వర్గఖండమై పోతుంది.

బావ మరిది కొంత సంస్కారం కలవాడైతే, అదొక రకం హాస్యం వస్తుంది. మా బావ మరిది ఒకసారి వచ్చి, ఒగరుస్తూ, ఆయాసపడుతూ మేడమీది నుంచి క్రిందికి రెండుమూడు మెట్లు ఒక్కసారి, దూకుతూ వచ్చాడు. నేనూ మా ఆవిడా మాట్లాడుకొంటున్నాము. వాడిరాక పద్ధతిని, వాడి ముఖ కవళికను, ఆ దూకుడునూ, ధూంధాంను చూచి ఎవరినో కొట్టివచ్చాడను కొన్నాము. నే ఆశ్చర్యపోయినాను. వాళ్ల అక్కయ్య అదుర్దాపడ్డది; "ఏమిట్రా! ఏంచేసి వచ్చావు అన్నాను. వాడు భీభత్స భయానక రసాలను ప్రదర్శిస్తూ, "చంపేశాను!" అని వైరివీర సంహారము చేసినట్లు చూశాడు.

"ఏమిట్రా! ఏం చంపావు?" అన్నాను. దానికి సరియైన సమాధానం చెప్పకుండా, "చంపక పూరుకుంటానికి నేనేమి పిరికి పందను కాను. అందులో నాశరీరాన్ని బాకు లాంటి ఆయుధంతో గుచ్చి, రక్తం కారే లాగున చేస్తే నేను నోరుమూసుకొని ఊరుకొనేదా! కళ్లు మూసుకొని పడుకొనేదా?" అన్నాడు, కళ్లు ఎర్రచేసి చూస్తూ.

కాస్త ఆయాసం తీర్చుకొని, మళ్లీ ఇల్లాగ అన్నాడు: "అవును బావా! నేను బాధ పడుతూ తలదిండులో దూర్చి, ఆ బాకు పోట్లను సహిస్తూ ఉండలేక పోయాను! విరోధిపై పడ్డాను. విరోధి నాకు అందకుండా అక్కడ నుంచి ఇక్కడకూ, ఇక్కడనుంచి అక్కడకూ గంతులు వేసి, నాకు చిక్కక, నా ఆయుధానికి గురిగాక, నన్ను నానా తిప్పలూ పెట్టడం జరిగింది. చివరకు సర్వనాశనం అయింది. ఒక్కగట్టిదెబ్బతో శత్రువు గిలగిల కొట్టుకొని చావడం జరిగింది. శత్రునాశనం అయింది. ఇహ, హాయిగా నిద్రపోతాను. శత్రువు బొందిలో ప్రాణమున్నంత వరకూ నాకు నిద్రపట్టలేదు. చంపేశాను, బాధేశాను నారక్తం శత్రువు కళ్లజూస్తే, నేను శత్రువు రక్తం అంతటా చిమ్మేశాను. నాకసి తీరింది."

"ఏమిటిరా? ఏమి చంపావురా? మమ్మలను పిలువక పోయినావా? ఎక్కడ చంపావు?" అన్నాను నేను ఆదుర్దాగా.

"నా గదిలోనే చంపాను. చూస్తే నీకే తెలుస్తుంది. నేను కాస్త అలావెళ్లి, కాఫీ తాగివస్తాను. అని అరచి పెద్దపెద్ద అంగలు వేసుకొంటూ వెళ్లిపోయాడు." వట్టి తొందరపాటు స్వభావం కలవాడు, చూద్దాంరా..." అన్నాను. ఆమే, నేనూ మేడపైకి వెళ్లి, వాడి గదిలో చూశాము. అక్కడ చచ్చిన వాళ్ళు ఎవరూ కనపడలేదు."

మా ఆవిడ అంతటా కలయాజూచి,—"అవునండోయ్! పాపం అన్యాయంగా చంపాడండీ!" అంటూ, అటు చూస్తున్నది. "అవిగో ప్రక్కపైన చచ్చినవన్నీ, ఈగలు, నల్లులు!" ఇద్దరం నవ్వుకొన్నాము. కొద్దిగా ఆందోళన కలుగజేసినా, చాలా నవ్వుతో తగిన రీతిగా వ్యవహారం నడిపాడు. బావమరుదుల హాస్యం ఇలా వుంటుంది.

బావమరుదుల హాస్యం అనుపూర్వికసంప్రదాయమే అయినా ఆ వ్యవసాయం బాగా సాగలేదు. హాస్యం ఏపుగా పెరగనూలేదు. ఫలపుష్ప భరిత సుందరమూ కాలేదు. గిడసబారిపోయి, మరుగుజ్జుతనము పొందింది. ఒక్కొక్కప్పుడు ఆ మొరటు హాస్యం అశ్లీలస్ఫోరకంగానూ, అమంగళకరంగానూ కూడా వుంటుంది.

గాలివానవచ్చింది. తెల్లవార్లూ బ్రహ్మాండమైన గాలితో వర్షం కురిసింది. బావమరిది వరుస అయిన ఒకాయన - మంచి పండితుడు కూడా - వచ్చి యోగక్షేమం విచారించే హాస్యపుధోరణి ఇది: "ఏమమ్మాఅక్కయ్యా! బావ ఇంకా బ్రతికే వున్నాడా? మొండిఘటం లే!...నీ సూత్రంకూడా గట్టిదిలే," అని పకపకా నవ్వాడు-పాపం ఆయన చాలా మంచివాడు. సుహృదయుడు. అయితే ఏమి!? హాస్యం అనేసరికి మోటు తనము వచ్చింది. ఏదైనా సాహిత్య విషయకమైన

(47-వ పేజీ చూడండి)



బుడుగూ !

ఛాలాబోల్డురోజుల్నుంచి కేపోమూడ్రోలుకో ఉత్తరం రాద్దామనుకుంటున్నాము. మాది కోటిపల్లి అనుకో. (పిల్లులుండవులే) మేమిద్దరం స్నేహితులుగామరి. నీవు కూడా మాతో కలుస్తావా! మేమొద్దామనుకున్నామనుకో. రైలుటిక్కట్టు లేదనుకో టిక్కట్ కలక్కర్ ప్రెవేటు చెప్పేస్తాడు. అలా అని మామేష్టారు చెప్పారు. నీవు అలా డీసుగామరి. నువ్వు సీ గానపెసూనాంబా లాంతరు భూతంతోటి వచ్చెయ్యండి. మా యింటిపక్క లావుపాటి పిన్నిగారు (లావు కాదనుకో) లేరనుఖో. కానీ ముగుడు బీడీలు కాలుస్తాడులే. తప్పకుండా వస్తావుగామరి.

శంకర్ అండ్ రమణా, కోటిపల్లి.

*　*　*

డియర్, బురుగూ !

నీవు పత్రికలో హింకా చాలబోల్డురోజులు వ్రాసిన ఖదలన్నీ చదివాను. ఛాలాబోల్డు బాగున్నాయిలే. ఖదలన్నీ చదువుతుంటే నాకే హాచ్చర్యం వేసింది. ఏమంటావు మరి. నిఝంగా నీవు ఛాల ఇంటెలిజెన్స్ ఫెలోవి అంటే చాలా బోల్డు తెలివిగల పిల్లవాడి వన్నమాట. ఇలా అని కేపో ప్ఫది రోలుకో మా అన్నాయ్ చెప్పాడులే. నిఝంగా నీవంటే, సీగానపెసూనాంబంటే కేపో మూడ్రోలుకో నాకు చాలబోల్డు ఇష్టం అనుకో, కేఫో మూడ్రోలుకో నీవు మా వూరు వస్తావుగా. నిన్నొప్ఫదిరోలు కోప్పదణాలు మనార్డురు చేసేస్తా. మరివస్తావుకదూ.

నాపేరు పద్మావతి, (నెల్లూరు)

*　*　*

చిరంజీవి బుడుగుకి,

నీతో స్నేహంచేయాలని చూస్తున్నా. మీకు మల్లేనే మాకు ఒక పక్కింటి లావు పాటి పిన్నిగారు ఉంది. నువ్వు మీబాబాయి దగ్గఱ నయా అయిడియాలు బోల్డు తీసుకొని ఇంకా నీ స్నేహితులందరికీ — కుంచెం సహాయంచెయ్యాలి మరి. సీత కులాసాగా ఉందా? కనిపిస్తే అడిగానని చెప్పు, నీ ఫొటో ఒకటి ఉంటే పంపు. ఎవళ్ళేనా ఒద్దంటే నడ్డి మీద చ్ఛంపేశెయ్! వెంటనే ఉత్తరం వ్రాస్తావుకదూ? మరిచిపోయా! నువ్వు యిప్పట్నించీ బళ్లోచేరద్దు. చక్కహో ఆడుకోవాలి! మా ష్టారికే నువ్వు ప్రెవేటు చెప్పేశెయ్!

వేలూరి అన్నపూర్ణ, (చిరివాడ)

*　*　*

డియర్ బడుగు,

నేను నీకు గ్నాపకంఉన్నానా? నా పేరు బుజ్జి. ఆనాడు మీ గోపాళం నాన్న, మీ అమ్మ నిన్ను మొదట బళ్లో పడేసినప్పుడు నువ్వు నన్ను కత్తికావాలా దెబ్బకావాలా అని అడిగి దెబ్బకొట్టేవే ఆ బుజ్జిని. ఇప్పుడేనా నేను నీకు బాఘా గ్నాపకంవచ్చానా? నేను నువ్వు బడి లోంచి మానెయ్యగానే, నేను అక్కడ మానేసి ఈ కూళ్ళో అంటే హైద్రాబాద్‌లో మొగబళ్లో చేరేశా. ఏం. నేను ఛాలా ఛాలా బోల్డు రోజుల్నించి నీకు లెట్రులు (లౌ లెట్రులు కాధులే) రాద్దామనుకునేనాణ్ణి. కానీ రాసి పెట్టేవాడు ఎవ్వడూ దొరక లేదనుకో. అఖరికి ఒకడు దొరికేడులే వాడిపేరు భావరాజు వెంకట సత్యమూర్తి./

*　*　*

బుడుగూ,

నువ్విలా చేసేస్తావని మేమెప్పుడూ అనుకోలేదు. ఎంచక్కా కబుర్లు చెబుతున్నావు కదా, యింకా చాలారోజులు, యెప్పుడూ యిలాగే చెబుతూ ఉంటావుగదా అని అనుకున్నాము. యెలాగోలావీలు చూసుకొని తొందరలోకనబడమ్మా-బుడుగూ. లేపోతే మేమంతా బెంగలు పెట్టేసుకుని చిక్కిపోయి సన్నపాటి అయిపోతాము.

అసలు పాపాయిలు ఎందుకు? అమ్మలు ముద్దు పెటుకునేందుకు' అని చెప్పావా? అలాగే అస్సలు నువ్వులు-అంటే బుడుగులు యెందుకు? ఎంచక్కా ఎపుడూ హాయి పోగొట్టకుండా కబుర్లు చెప్పిపెతేందుకు.

మీ బాబాయినీ, గానపెసూనాంబనీ, రాదనీ, గోపాలాన్నీ అడిగానని చెప్పిపెట్టు.

భరణి నారాయణరాజు, సత్తెనపల్లి.

*　*　*

డియర్ బుడుగూ,

బుడుగూ నువ్వు మళ్ళీ ఎప్పుడువస్తావు? నువ్వు హెప్పుడేనా మాఇంటికివచ్చేష్తే నీకు చాకెలట్లు హిష్టంలేదన్నావుగా. పకోడీటు కావాలన్నావుగా మరి అంచేత మాయింటికి వస్తే నీకు రోజూ బోల్డుబోలు ఫకోడీలు పెట్టేస్తాను. హిక్కడ నీకో బాబాయి హున్నాడులే నీవు హర్జంటుగా వచ్చెయ్యక పోతే నీకోసం బోల్డు, ఖుంచెం ఫకోడీలు హున్నాయిగదా హప్పుడేమో బాబాయి అన్నీ తినేసేస్తాడుగదా మనఖి[illegible] ఉండవు. బాబాయిని మనం కొట్టేసెయ్యలేము గదా మరి హందకుండా పారిపోతాడు. హందుకోసం తొందరగా తినేసి పారిపోవాలి.

హిక్కడ ఇంకా చాలా బోల్డు పాపాయిలు వున్నారు. వాళ్ళకు నువ్వంటే బోల్డు హిష్టం. వచ్చేష్తావా?

ఎస్. జయశ్రీ, (సికింద్రాబాదు) ★

పక్కింటి పిన్నిగారు

పాత్రలు:

పిన్నిగారు.
రాధ.
శేషగిరి.
మల్లిఖార్జునరావు.

కొండముది
హనుమంతరావు

[తలుపు తట్టిన శబ్దం...'రాధా! రాధా' అని పెద్దగా పిన్నిగారి కేక...లోపలి నుంచి 'ఆ వస్తున్నా! వస్తున్నా' అన్న రాధ సమాధానం...తలుపు తీసిన శబ్దం]

పిన్నిగారు: ఏమమ్మ రాధా! పడుకున్నట్లున్నావ్?

రాధ: లేదండీ ... ఇప్పుడే పడుకోవాల్చాను.

పి. గా: భోజనా లయాయా?

రాధ: ఆఁ! ఇప్పుడే అయాయ్...వారటు కాలేజీకి వెళ్లారు. నేనిటు యీ పుస్తకం పట్టుకు పడుకున్నాను.

పి. గా: ఏమిటి రాధ-నిన్న అన్నావ్? పని తొందరలో సరిగా వినలేదు. నువ్వు బియస్సీ ప్యాసయినావా!

రాధ: అవును...సెకండ్ క్లాసులో ప్యాసయ్యాను...ఆశ్చర్యంగా ఉందా?

పి. గా: అహఁ! లేదు...ఆశ్చర్యమెందుకూ...అయితే నాకు తెలియక అడుగుతాను...బియస్సీ సెకండ్ క్లాసులో ప్యాసయిన దానివి ఉద్యోగమేమయినా చేయకూడదూ?

రాధ: యిష్టంలేదండీ.

పి. గా: ఎవరికీ యిష్టం లేకపోవటం? నీకా-శేషగిరికా??

రాధ: (ఓక్షణం ఆగి) యిద్దరికీ.

పి. గా: ఎందు కిష్టం లేకపోవటం? కష్టమనా?

రాధ: చేస్తే ఏ కాలేజీలోనో డిమాన్స్ట్రేటరుగా చేయాలి అంతేగా? అంతకన్న బియస్సీ ప్యాసయిన ఆడవాళ్ళకు పెద్ద ఉద్యోగాలేమున్నయ్?

పి. గా: కాలేజీ డిమాన్స్ట్రేటరుకేం రాధా: చక్కగా నెలతిరిగే సరికి నూటనాలుగు రూపాయలు చేతికి వస్తయ్... ఏ ఖర్చుకయినా ఉంటయ్...ఇప్పుడు వస్తున్న రెండువందలకి తోడుగా.

రాధ: రెండువందలు సరిపోతూనే ఉన్నయ్ గదండీ...అందుకని ఉద్యోగం చేయాల్సిన అవసరం కన్పడటం లేదు. అదీగాక వారికేమో యీ ఊళ్ళో ఉద్యోగం పర్మనెంటుకదా! నాకూ యిక్కడే దొరకాలంటే కష్టంగాదూ?

పి. గా: కాలేజీ డిమాన్స్ట్రేటరంటే కలెక్టరుద్యోగమా-దొరక్కపోవటానికి.

రాధ: ఈ రోజుల్లో అలాగే ఉన్నదనుకోండి...దానికయినా ప్రయత్నం చేస్తేగాని లాభం ఉండటంలేదు.

పి. గా: బియస్సీలో నీమెయిను ఏమిటి?

రాధ: బాటనీ.

పి. గా: ఇంకేం? రొట్టె విరిగి నేతిలో పడింది పో. ఇందాకటినుంచీ ఆ మాట చెప్పవు కాదేం? ఈ ఊరు కాలేజీలోనే బాటనీ డిపార్టుమెంటులో ఒక డిమాన్స్ట్రేటరుగిరిఖాళీరాబోతున్నది. బహుశా యీ నెలాఖరు అవుతుందనుకుంటూ...మా అమ్మాయినీ బాటనీలో వేగా చేర్పిస్తా. ప్రిన్సిపాలుగారు ఏదోమాట మీద వచ్చినాతో అన్నారు కూడాను. కాగితం, కలం తీసుకురా దరఖాస్తు పెట్టువుగాని.

రాధ: (కంగారుగా) ఇప్పుడా?...ఇప్పుడప్లయిచేయటమా? వారికి చెప్పకుండానే!

పి.గా: (నవ్వి) ఎందుకురాధా! అంత కంగారుపడతావ్? కాగితంమీద కావాల్సిన విషయాలు రాయి. శేషగిరి వచ్చిన తర్వాత చెప్పి ఆ కాగితం కాలేజీలో యిద్దాం. దానిదేముంది?

రాధ: (నీళ్ళు నములుతూ) కాదులెండీ. వద్దులెండి.

పి./గా: ఏం? ఎందుకని?

రాధ: అదికాదండి. వారు కాలేజీనుంచి వచ్చేసరికి ఎంతో అలసటగా ఉంటారు. టిఫినూ, కాఫీ తయారు చేసి నేనింట్లో ఉండకపోతే...

పి. గా: పిచ్చిపిల్లా! (నవ్వి) అదా నీ భయం. ఫలహారందేముంది. ఓ కుర్రాడ్ని ఏర్పాటు చేసుకుంటేసరి. ఏదో హోటలు నుంచి తెప్పించుకోవచ్చు.

రాధ: అమ్మో! హోటలునుంచే. లాభం లేదండి. వారికి హోటలు పడదండి.

పి. గా: హోటలు పడకేం కేస్తుంది. ఆటలు సాగనిస్తుంటేసరి. సాగించుకుంటుంటారు. చదువుకునే రోజుల్లో హోటలు భోజనమూ, హోటలు టిఫిన్లూ కదూ.

రాధ: అపుడవును కోండి...కాని ఇపుడు...

పి. గా: (అందుకుంటూ) కాని ఇపుడు మార్చుకున్నారు. ఇంట్లో వండేది ఒకతి ఊరికే నే ఉందిగాదా అని. అంతేగా?

రాధ: వారి ఉద్దేశం అదేమీ కాదులెండి. అసలా మాటకువస్తే వారు హోటల్లో నే తింటాం అంటారు. కాని నేనే యీ ఏర్పాటుచేశాను.

పి. గా: అందుకే మన ఆడవాళ్లను చూస్తే నాకు వళ్ళుమంట. కావాలని తమంతట తామే మొగవాళ్ళకు బానిసలవుతారు. ఎంత చదువుకుంటే ఏం లాభం? చివరికి వంటింటికే జీవితాలు.

రాధ: చదువుకున్నంతమాత్రాన ఉద్యోగాలు చేయాలంటారా? అవసరం ఉన్నప్పుడు, పొట్టగడవ నప్పుడు ఎటూ తప్పదనుకోండి...ఆయన తెచ్చే రెండు వందలు హాయిగా సరిపోతుండె.

పి. గా: ఆఁ! సరిపోతున్నయ్...ఇప్పుడు మీరిద్దరేకాబట్టి మీ ఆయన తెచ్చే రెండు వందలుసరిపోతున్నయ్...మీకు...అది మీ జీవితావసరాలకు. ఎల్లకాలం మీరు ఇద్దరుగానే ఉంటారా? పిల్లలు పుట్టరా? అప్పుడెంతఖర్చు? ఎంత ఖర్చు??...పెళ్ళిళ్ళూ పేరంటాలూ...చదువులూ — ఒకటా, రెండా, ఎన్నో...నాలుగువందలు వచ్చినా చాలవు.

రాధ: మీరు చెప్పింది నిజమేననుకోండి. అయినా వారితో చెప్పిగాని నేనేం చేయలేనండి.

పి. గా: అలాగేను రాధా! అడగకుండా నేను చేయమనటంలేదే? ఒక్కమాట రాధా! నే చెప్పిందంతా శేషగిరితో అనేవ్! బాగుండదు. నేనే పురెక్కించా పెట్టానను కుంటాడు. ఏదో ఖాళీ ఉందిగదా. మన వాళ్ళేగదా, మన చేతిలోవున్న ఉద్యోగమే గదా అని చెప్పాను. అంతే!

★ పక్కింటి పిన్నిగారు ★

రాధ: (నొచ్చుకుంటూ) అదేం మాట పిన్నిగారూ! ఇదంతా వారితో యెందుకు చెప్తాను. నాకామాత్రం తెలియదూ!

పి. గా: తెలియదని కాదు...పొరపాటున మర్చిపోయి చెప్తావేమోనని. ఆఁ! అన్నట్లు మర్చాను రాధా! ఒక్క ఇరవై రూపాయలుంటే ఇద్దూ. నాలుగయిదు రోజుల్లో యిచ్చేస్తాను.

రాధ: దాందేముందండీ ఇరవయ్యేగా. వందలా? వేలా? నాలుగురోజుల్లో కాకపోతే నెలరోజుల్లో యిద్దురుగాని...తెస్తానుండండి ఒక్కక్షణం ఆగండి.

(రాధ లోపలికిపోతుంది)

పి. గా: (పెద్దగా లోపలున్న రాధకు వినపడేలా) అదికాదు రాధా! వెధవది. ఇంతవరకెన్నడూ ఎవర్నీ అడిగిన పాపానపోలేదు. ఏమిటో అభిమానం నోరు తెరిచి అడగబోతే ఏదో యిదిగా ఉంటుంది.

రాధ: (లోపలినుంచి) అయ్యో! అదేం మాట పిన్నిగారు. మనలోమనకేమిటి? (వస్తూ) మీ అమ్మాయి లాంటి దాన్ని-మీరన్నట్లు. ఆ...ఇవిగో...ఇరవయ్యేగా అడిగారు, తొందరలేదులెండి. ఉన్నప్పుడే యిద్దురుగాని.

పి. గా: ఎందుకురాధా నాల్గు రోజుల్లో యియ్యనూ. ఇక వస్తా.

రాధ: మంచిది.

* * *

(కార్లహారన్లు...రిక్షాలగంటలు – పట్టణరణగొణధ్వనిలో పార్కు రేడియోలోంచి ఏదోపాట తేలిపోతూ ఉంటుంది)

పి. గా: (స్వగతం) అబ్బబ్బ! చచ్చిపోతున్నాను ఒకటేగోల కాకిగోల. ఈ శేషగిరి ఎక్కడ కూర్చున్నాడో, ఏమో! పొద్దున రాధతో చెప్తున్నాడు కూడాను-ఈరోజే చెక్కు మారుస్తున్నట్లు. బహుశా జేబులోనే ఉండొచ్చు డబ్బుకూడా.

(క్రమంగా ఆ 'గోల' ఫేడౌట్)

అమ్మయ్య! అడుగో! శేషగిరి. ఈచివర కూర్చున్నాడు. పాపం యితడూ ఆగోల భరించలేక పోయినట్లున్నాడు. (దగ్గరగా వచ్చి) ఓహో! శేషగిరా! ఒక్కడివే కూర్చున్నావ్?

శేషగిరి: ఓ; మీరా! పిన్నిగారా! అవునండీ ఒక్కణ్నే కూర్చున్నాను—ఒక ఫ్రెండును కలుసుకోవాల్సి పదినిముషాలనుంచే వెయిట్ చేస్తున్నాను.

పి. గా: (నవ్వుతూ) భలే! నీవేమో ఒకరికోసం వెయిట్ చేస్తున్నావ్. నే నొకరికోసం వెతుకుతున్నాను.

శేష: ఎవరికోసం (నాలిక కర్చుకుని) సారీ! పొరపాటున అడిగాను.

పి. గా: ఫర్వాలేదు శేషగిరి? మనలో మనకేమిటి? తల్లిలాంటి దాన్ని నీవడగనూ వచ్చు నేచెప్పనూ వచ్చు. ఎవరికోసమో కాదు జానకమ్మగారని మా ఊరామె ఇప్పుడీ ఊళ్లోనే ఉంటున్నది. ఇంటికి పోతే పార్కుకు పోయిందని చెప్పారు. ఆమెను వెతుకుతుంటే నీవు కన్పించావు.

శేష: అర్జంట్ పనేమో! మరెలా!

ఫి.గా: అదే ఆలోచిస్తున్నాను. కొంచెం అర్జంటు (ఓక్షణం ఆగి) ఆమెను డబ్బడిగాను ఇస్తానన్నది.

శేష: ఏమాత్రం కావాలేమిటి?

పి.గా: ఆ! ఎంత ఓ యాభై ఆ! నీవిస్తావేమిటి? నిన్నీయమని కాదు నేచెప్తే. అడిగావు కదా అని చెప్పాను, అంతే!

శేష: ఏం నేనిస్తే తీసుకోకూడదా?

పి.గా: తీసుకోకూడదని కాదురా చిన్నవాడివి. నీదగ్గర తీసుకోపోతే ఏదో యిదిగా ఉంటుంది.

శేష: అదేమిటండి పిన్నిగారూ అలా అంటారు. అవసరమయినపుడు తీసుకొంటే ఏం తప్పా? మీరన్నట్లు మనలో మనకేమిటి? తీసుకోండి.

పి. గా.: (అందుకుంటూ) ఏమిటో అంతా మాయ! భగవంతుడి లీల లెవరికీ అర్థంకావు గదా! ఈ పూట నేను నీదగ్గర యిలా యీ యాభై తీసుకుంటాననుకున్నానా? సరే తప్పేదేముంది. తీసుకోకపోతే నువ్వేమయినా అనుకుంటావేమో? పదిరోజుల్లో తిరిగి యిచ్చేస్తాను.

శేష: పదికాకపోతే పదిహేనురోజుల్లో యీయండి. ఏం ఫర్వాలేదు.

పి. గా.: రాధా అంతే! పిచ్చిపిల్ల. మెత్తని మనసులు యిద్దరివీ! ఇంకొకరికష్టం చూడలేరు. ఆఁ! అన్నట్లు మర్చాను శేషగిరీ! నిన్న ఏదో మాటమీద వచ్చి రాధతో యీ ఊళ్లో కాలేజిలో బాటనీ డిపార్టుమెంటులో డిమాన్స్ట్రేటరుగిరి ఒకటి ఖాళీ కాబోతున్నదీ అని చెప్పాను. ఇక చూడు నాయనా! నన్ను చంపుకు తిన్నదనుకో. ఎందుకు చెప్పానా అని బాధపడాను. ఆ తర్వాత ఎలాగో ఓలా ఆ ఉద్యోగం తనకిప్పించేలా చూడమని ఒకటే గోల. అది కాదు కాని నాకు తెలియక అడుగుతాను-నిక్షేపంగా నువ్వు రెండువందలు తెస్తుంటివి గదా! అవి చాలవూ మీ యిద్దరికీ. ఏం శేషగిరీ!

శేష: ఎందుకు సరిపోవూ? సరిపోతూనే ఉన్నయ్‌గా. సర్దాగా ఉందేమో ఉద్యోగం చేయాలని.

పి. గా.: ఏం సర్దా? నా తలకాయ. ఎందుకు వచ్చిన వందరూపాయలు చెప్పు. నువ్వు కాలేజీ నుంచి వచ్చేసరికి అసలే అలిసిపోయి ఉంటావా! మంచి టిఫినూ, వేడి వేడి కాఫీ అందించి, తీయని మాటలు చెప్తూ ... తినిపిస్తే ఎంత ఆనందంగా ఉంటుంది? చిలక్కు చెప్పినట్లు చెప్పి చూశాను. కాని ఏం లాభం? వింటేగా? హోటలు నించి తెప్పిస్తానంటుంది. హోటలుకూ, యింటికీ భేదం లేదన్న మాట. అంతేనా శేషగిరీ! ఇదంతా ఆ వెధవ వందరూపాల కోసం. డబ్బంటే చూశావా-ఆడదానికెంత ఆశో!? అందుకనే మా ఆడవాళ్ళు ఎన్నటికీ పైకి రాలేరు. నేనుముక్కుసూటిగా పోయేరకం. అనదలచుకున్నది మొహంమీద అనేస్తాను. తర్వాత ఎదుటివాళ్ళు ఏమయినా అనుకోనీ.

శేష: రాధకు ఉద్యోగం చేయటం కష్టంగా ఉంటుందేమోనని నాబాధ. అంతే గాని వేరే నాకే అభ్యంతరమూ లేదు. హోటళ్లలో టిఫిను తీసుకోవటం పెద్ద కష్టమేమీ కాదు. ఉద్యోగం చేసి చూడనీయండి. మనం కాదనటం ఎందుకూ? అనుభవం నేర్పిన పాఠం ఎక్కువ పనిచేస్తుంది.

పి. గా.: నిజం చెప్పావు నాయనా! నా ఆయుష్షు కూడా పోసుకు బ్రతుకు. ఇక వస్తాను. ఆఁ! ఇవన్నీ కొంపదీసి రాధతో అనేవ్. బాగుండదు. తనకుద్యోగం యిప్పించటం నాకిష్టం కాదనుకుంటుంది. ఆడవాళ్ళ విషయం నీకు తెలియదు. మనసులు యిట్టే విరిగిపోతయ్. మరో మాటా...ఇలా నీదగ్గర అప్పు తీసుకున్నట్లు కూడా అనకు. డబ్బు విషయంలో తొందరగా జారిపోతారు ఆడవాళ్ళు...ఇక వస్తాను.

శేష: మంచిది.

* * *

[రేడియోలోంచి వీణ వినిపిస్తుంటుంది - శ్రావ్యంగా]

శేష: రాధా! రాధా! (క్షణం ఆగి బిగ్గరగా) రాధా! రాధా!

[రేడియో 'ఆఫ్' చేసినశబ్దం.. వీణారవం ఆగిపోతుంది]

శేష: రాధా! లోపల ఏంచేస్తున్నావ్!

రాధ: (లోపలనుంచి) ఆఁ! వస్తున్నా... (వచ్చి) ఎందు కంతగా కేకలేస్తారు. వస్తున్నా నంటుంటే.

శేష: ఇక్కడ వాచీ పెట్టాను. తీశావా?

రాధ: వాచీ ఏమిటండి. నేనేమీ ఎఱుగనే. అసలెక్కడ పెట్టారు?

శేష: పొద్దున బాత్ రూమ్‌కి పోతూ యిక్కడే టేబుల్ మీద పెట్టాను బాత్ రూమ్ నించి వచ్చి భోజనం చేశానా! భోజనం కాగానే కాలేజీకి పోయాను. కానీ వాచీపెట్టుకోవటం మర్చిపోయాను.

రాధ: పొద్దుననగా టేబుల్ మీద పెట్టింది యిప్పటిదాకా ఉంటుందా! ఇంకేం ఎవరో కొట్టేసి ఉంటారు. నేను భోజనం చేసి గదిలోకి వచ్చేసరికి పనిమనిషేమో అప్పుడే గదిలోంచి బయటకి వస్తున్నది. అసలు నే గదిలోకి పోయేసరికి టేబుల్ మీద వాచీ ఉన్నట్లు గుర్తులేదు, ఉంటే కనపడదు: అదేమన్నా చల్లపూసా కనపడక పోవటానికి. ఇంకేముంది ఎవరో కాజేశారు. (కొంచెం ఆగి) నాకు పనిమనిషిమీదే బాగా అనుమానం. మొన్న నేనెందుకో గదిలోకి వస్తే అలమార్లు వెతుకుతున్నది. ఏమిటి అంటే ఏమీ లేదు అన్నది కంగారు పడుతూ. రేపు దాన్ని రానీయండి. ఒళ్ళు చీరేస్తాను.

శేష: ఏడ్చినట్లే ఉంది నీ తెలివి. పని చేసుకునేదానికి వాచీదేనికి? అదేం చేసుకుంటుంది?

రాధ: ఏంచేసుకోవట మేమిటి? డబ్బు చేదేమిటి ఎవరికయినా?

శేష: వాచీ డబ్బుకాదుగా. డబ్బుగా మార్చటం అంటే పనిచేసుకునే దానికి ఎంత కష్టమో ఆలోచించవేం? ఊహు నోటి కొచ్చినట్లు మాట్లాడుతావుగాని.

రాధ: దాన్ని వెనకేసుకొస్తారేమిటి మీరు? మీ రల్లా ఉండండి. అసలు దాని సంగతి మీకు తెలియదు. నే రేపడుగుతా నుండండి.

శేష: అదేం చెపుతుంది దాని తలకాయ. అసలది కాజేస్తేగా నీ వూరుకో అదెవరు కాజేశారో నాకుతెలుసు. నే కనుక్కుంటా నులే.

రాధ: ఎవరని మీ అనుమానం!

శేష: నీకెందుకు? నే చెప్పినా అసలు నువ్వు నమ్మవు, నమ్మలేవు.

రాధ: పోనీ చెప్పరాదూ, నమ్మినా నమ్మకపోయినా?

శేష: ఇవ్వాళ పిన్నిగారు మనింటికి వచ్చారా?

రాధ: ఆ విషయం మీకెందుకు? కొంప దీసి మీ ఉద్దేశం ఆమె కాజేశారనా?

శేష: ఎన్నింటికి వచ్చారో చెప్పు.

రాధ: ఎప్పుడు వచ్చారో సరిగ్గా తెలియదుగాని నేను భోజనంచేసి గదిలోకి పోయేసరికి ఆమె అక్కడే ఉన్నారు - పేపరు చూస్తూ.

శేష: మరింకేం... నే అనుకున్నది నిజమే అయింది.

రాధ: ఏమిటి మీరనేది?

శేష: పిన్నిగారు మనవాచీ కాజేశా...

రాధ: (శేషగిరి నోరు తనచేత్తో మూసి) అవ్వవ్వ! ఆమె వింటే యింకేమన్నా ఉందీ! పెద్దముత్తైదువ...పరమసాధ్వి. ఈ రోజుల్లో ఎవరికి వారు చూసుకునే వారేగాని యితర్లకు రవ్వంత సహాయం చేసే వాళ్లున్నారూ? అంతా పచ్చి స్వార్థపరులు. ఆమెను చూడండీ! ఆమెకూ మనకూ ఏం చుట్టరికం? వారం రోజుం క్రితం యీ ఊరొచ్చి మన పక్క భాగంలో ఉంటున్నది. అంతకన్న మనకూ, ఆమెకూ ఏ విధమయిన సంబంధమూ లేదు గదా! మనకు ఉన్న ఊళ్ళో వంద రూపాయల ఉద్యోగం యిప్పిస్తామన్నారు. అలాంటి వారు నూటికొకరుంటారు.

శేష: (వ్యంగ్యంగా) అవునవును :— అలాంటి వారు నూటికొకరే ఉండేది. నూటికి నూరయితే మనం మంచి నీళ్ళు కూడా త్రాగలేం. ఆమెను నువ్వర్థం చేసుకోలేదు. పయోముఖవిషకుంభం. నీకు తెలియదు. జీవితపుసుడిగుండాల్ని పోల్చుకో కలిగే అనుభవం నీకింకా లేదు. ఆమె చేసే ప్రతి పని వెనుకా ఏదో గూడు పుఠాణీ, ఎంతో కొంత స్వార్థం ఉండి తీరుతుంది. డబ్బు కోసం, ఆమె ఎంతటి పని కయినా పాల్పడుతుంది.

రాధ: పెద్దగా అనకండి. ఆమెకి వినపడు తుంది. వింటే బాగుండదు. ఆమె మీరను కున్నటువంటి వారు కారు.

శేష: కాదు రాధా: ఆమె నన్ను మోసం చేసింది. ఆమె నా దగ్గర నుంచి నలభై రూపాయలు ఎంతో తెలివిగా లాగింది-పదిరోజుల్లో యిచ్చేస్తానంటూ. ఇప్పటికి నెలరోజుల దాకా అయింది తీసుకొని, ఇంతవర కిచ్చిన పాపాన పోలేదు. ఇక ముందయినా యిస్తుందని ఆశేమాత్రం లేదు. ఆమె చర్యలు కనిపెడుతూనే ఉన్నాను. నా కనుమానంగానే ఉన్నది. నా వాచీ కొట్టేస్తుందను కోలేదు కాని, నీ వస్తువేదో కాజేస్తుందను కున్నాను.

రాధ: అదేమిటండి. మీరల్లా అంటారు. ఆమె నా దగ్గర ఓ యిరవై రూపాయలు తీసుకుంది. నాలుగు రోజుల్లో యిస్తా నన్నది. మర్నాటికే యిచ్చేసింది. మీరు చెప్పేది నమ్మలేక పోతున్నాను.

శేష: అదేను రాధా! ఆమె తెలివి అక్కడే ఉన్నది. నా దగ్గర నలభై రూపాయలు తీసుకొని అందులోంచి నీ కిరవై యిచ్చింది-యిస్తానన్న రోజుకిముందుగానే. దాంతో నీకు ఆమె మీద ఎంతో గౌరవం ఓ విధమైన అభిమానం కలిగినయ్ చూశావా! ఇప్పుడామె దొంగతనం చేసిందంటే నమ్మ

★ పక్కింటి పిన్నిగారు ★

శేషు. నమ్మకూడదు, అది నీ తప్పు కాదు. ఆమె తెలివి అది.

రాధ: ఏమో తొందరపడి అడగకండి, బాగుండదు.

శేష: నేనంత తెలివితక్కువ వాణ్ణేమీ కాదులే రాధా! నిర్ధారణ చేసుకొని ఋజువు దొరికాకే అడుగుతాను అసలు ఉద్యోగం చేయమని ఆమె ప్రస్తాపణ పెట్టిందికాదూ?

రాధ: ప్రస్తాపణ ఏముంది? ఖాళీగా ఉంది. అప్లై చెయి-అన్నది.

శేష: నువ్వెంతదాచినా నేనర్థం చేసుకోగలను రాధా! నేను నిన్ను మొట్టమొదట ఉద్యోగం చేయాలని ఉంటే చెయ్యమన్నాను. కాని అపుడు నువ్వెన్ని కారణాలు చెప్పలేదూ! అవన్నీ నువ్వు ఆమెకూ చెప్పి ఉంటావు. కాని భేద మెక్కడంటే ఆమె నిన్ను ఒప్పించకల్గింది. నేను ఒప్పించలేకపోయాను. అంతే! అందుకే ఆమె తెలివిగలది అన్నాను. ఎంతటి పనయినా యిట్టే చేయకలదు. నీ మీదా కూడా నాకు ఎంతో చెప్పింది.

రాధ: (కంగారుగా) కొంపదీసి నేరాలేమీ చెప్పలేదూ కదా?

శేష: కంగారుపడకు. అపుడు నిజాలని నమ్మినా యిపుడవన్నీ నేరాలని తెలుసుకున్నానుగా.

రాధ: (భయంగా) ఇదంతా నాకేదో గొడవగా ఉంది సుమండీ.


శేష: అంత భయపడకు. రెండురోజుల్లో అంతా నీకే తెలుస్తుంది.

* * *

శేష: రాధా!

రాధ: ఏమిటండీ?

శేష: (రహస్యంగా) అదుగో! విను. మీ పిన్నిగారు ఊరినుంచి వచ్చిన కొడుకుతో ఏం చెప్తున్నదో విను. పరమసాధ్వి... పెద్దముత్తైదువ-అని అంటివే.



రాధ: ఏం చెప్తున్న దంటారూ.

శేష: విను-ఏం చెప్తున్నదో.

[పక్క భాగంలో పిన్నిగారు, కొడుకు మల్లికార్జునరావుల రహస్య సంభాషణ వినిపిస్తుంటుంది.]

పి.గా: వెర్రినాగమ్మా! ఊరికినే యిప్పిస్తామట్రా వంద రూపాయల ఉద్యోగం. నేనంత తెలివితక్కువదా న్ననుకున్నావా!

మల్లి: మరి ఏమిటంటావ్-నీ తెలివి.

పి.గా: ఏముంది. ఉద్యోగం ఖాళీ వచ్చింది. ప్రిన్సిపాలు మనం చెప్పినట్లు వినే మనిషి. మనమ్మాయి ప్యాసయ్యేసరికి యింకో ఏడాది పట్టుందిగదా. ఈలోపల ఎవరో ఆ ఖాళీలో దూరిపోతే మనమ్మాయి పని హుళక్కి. ఇపుడే కనుక మన పలుకుబడి ఉపయోగించి రాధనా ఖాళీలో దూర్చామా మనం కావాలన్నప్పుడు మనమ్మాయికి ఆ ఉద్యోగం వస్తుంది.

* * *

శేష: చూశావా! రాధా! నేను చెప్ప లేదూ, ఏదో గూడుపుఠాని ఉందని.

రాధ: ఇంత పెద్ద ప్లాను వేస్తుందనుకోలే దండి... నే నా ఉద్యోగం చేయను. నాకు వద్దు.

శేష: ఆగు......ఆగు. విను...ఇంకేదో చెప్తున్నది.

* * *

పి.గా: ఒక్క బాణంతో రెండు పక్షు లన్నట్లు ఉద్యోగం - రాధా మన చేతి క్రిందికి వచ్చినయ్. రాధకు నేనంటే భలే అభిమానం, ఎంతో గౌరవం. ఎందుకనో తెల్సునా.

మల్లి: ఏమో నా కెలా తెలుస్తుంది?

పి.గా: శేషగిరిదగ్గర వలభై రూపాయలు అప్పని చెప్పి తీసుకున్నాను. దాదాపు నెలా పదిహేనురోజులయింది. ఇంతవరకీయలేదు. ఇక ముందయినా యీయదలచుకోలేదు. రాధదగ్గరేమో మొట్టమొదట ఓ యిరవై తీసుకొని శేషగిరిదగ్గర తీసుకున్న వలభై లోంచి ఆ యిరవై యిచ్చి తీరుస్తానన్న దానికన్న ముందుగానే తీర్చేశాను. దాంతో రాధకు నేనంటే ఎంతో అభిమానం, గౌరవం, విశ్వాసం......ఇదిగో. ఇది చూశావా?

మల్లి: రిస్టువాచే! ఎక్కడిది? కొన్నావా?

పి.గా: తెలివితక్కువదద్దమ్మా! ఇంత ఖరీదైన వాచీ కొంటామట్రా. అసలు మాటకు వస్తే మనం కొనగలమా?

మల్లి: మరెక్కడిది?

పి.గా: ఎక్కడిదేమిటి? అతనిదే...శేషగిరిది...వాళ్ళకు మనం వంద రూపాయల ఉద్యోగం యిప్పించినపుడు ఈమాత్రం వాచీ...

మల్లి: ప్రెజెంట్ చేయలేరా అంటావా?

పి.గా: వాళ్ళు మనకు ప్రెజెంట్ చేసే దేమిటి? మనమే తెచ్చుకున్నాం.

మల్లి: (భయంగా) దొంగతనమే!

పి.గా: ఛ నోర్ముయ్! దొంగతన మేమిటి? తీసికెళ్ళి చక్కగా వాడుకో. నీ చేతికి వాచీలేకపోతే ఏంబాగాలేదు. మనకు లేనప్పుడు ఉన్నవాళ్ళ దగ్గిఅనుంచి దొంగతనంచేసినా దొంగతనం అనిపించుకోదు, తప్పులేదు. వెధవ ఆదర్శాలు పెట్టుకుంటే ఇక నువ్వు బ్రతికినట్లే...

* * *

శేష: చూశావా! రాధా! పిన్నిగారు పరమసాధ్వి అన్నావ్. పైగా పనిమనిషిని అనుమానించి దానిమీద లేనిపోని నింద మోపావు.

రాధ: పొరపాటయింది క్షమించండి పిన్నిగారు పరమసాధ్వి కాదు పచ్చిదొంగ.

శేష: అదీ అల్లా దారికిరా. నీ నోటిమీదుగానే చెప్పించాను—పిన్నిగారు దొంగని...నీవిక్కడే ఉండు. ఆ పక్కకి రాకు... నేనిప్పుడే వస్తా.

రాధ: కొంపదీసి చేయిచేసుకునేరు. ఎంతైనా ఆడది బాగుండదు.

[శేషగిరి గబగబా నడుస్తున్న శబ్దం]

పి.గా: ఆఁ! ఆఁ! ఎవరూ? శేషగిరా! ఏమిటి శేషగిరీ! మీ యిద్దరూ మాట్నీకి పోతిరిగా...ఎప్పుడువచ్చారు నే చూడలేదే! అదేమిటి అలాఉన్నావ్? రాధేది!...ఒక్కడివే వచ్చావేం? ఏం జరిగింది?

శేష: ఏంజరగలేదు. మాట్నీనుంచి వచ్చి చాలాసేపయింది. రాధకూడా వచ్చింది. నీవిందాకటినుంచి మీ అబ్బాయికి చెప్పిందంతా మేయిద్దరం వింటూనే ఉన్నాం. నీ బతుకంతా తెల్సుకున్నాం. దొంగతనం చేయటానికి కూడా పాల్పడ్డావు. ఛీ! ఆ వాచీ యిటివ్వు. (వాచీ ఊడలాక్కుంటాడు. ఓ క్షణం నిశ్శబ్దం.)

శేష: చూశావా! రాధా! పిన్నిగారు బాగా అర్థమయారుకదూ?

రాధ: ఆఁ! బాగా అర్థమయారు.

శేష: ఇలాంటివారు జీవితంలో తగుల్తుంటారు. సాఫీగాపోయే జీవితనౌకను సుడిగుండాల్లోకి తోసేస్తారు...ప్రశాంత జీవిత సాగరంలో తుఫాను లేపుతారు. సంఘానికి చీడపురుగులు. వాళ్ళని జాగ్రత్తగా ముందుగానే కనిపెట్టి సాధ్యమైనంత దూరంలో ఉంచాలి......లేకపోతే ఏమయ్యేది నేను వేరే చెప్పనవసరంలేదు. పయోముఖ విషకుంభం...తేనెపూసినకత్తి......

రాధ: సంఘానికి చీడపురుగు...గోముఖ వ్యాఘ్రం...... ★

మమకారం

పాటిమళ్ళ రామకృష్ణ.

మూడో వరంగా నచికేతసుడు యముణ్ణి మానవుల మరణానంతరవిషయం కోరాడు. దానికి ఆయన "నూరు సంవత్సరాల వయస్సూ, పుత్ర పౌత్రుల్నీ, రాజ్యాలనూ కోరుకోగాని మరణానంతర విషయాల్ని మాత్రం అడక్కు" అన్నాడుట. నచికేతసుడు, "మరణానంతరం కొందరు ఆత్మవున్నదంటారు. కొందరు లేదంటారు. ఆ సంగతేమిటో నాకు సవిస్తరంగా తెలుపవలసింది" అనడిగాడు. అందుకు యముడు "అదిమాత్రం అడుగరానిది" అని ప్రత్యుత్తర మిచ్చాడు.

యముడంతటివాడు ఆ ప్రశ్నకు సమాధానం చెప్పకుండా తప్పించుకో జూచినప్పుడు, మనం, మానవ మాత్రుల్లం ఏపాటి? అని "కుటుంబయ్య"గారు వితర్కించుకున్నారు. ఆయన యీ మధ్య కొంతకాలం నుంచి ప్రశాంతంగా కాలంగడుపుతున్నారు. వృద్ధాప్యం మీదపడింది. శరీరంలో పటుత్వం తగ్గింది. ప్రాపంచిక వాంఛలూ, సుఖదుఃఖాల్లో యింకా కొట్టుమిట్టాడుతూ, ముక్తిమార్గాన్ని కలుషాయితం చేసుకొంటూ జీవించడం "మూర్ఖం" అని ఆయన నిర్ధారించుకొన్నారు. పుత్రుల్ని చదివించారు. విజ్ఞుల్ని చేశారు. కష్టించి కూడబెట్టగా శేషించిన యావత్తూ వాళ్ళపరం చేశారు. "మీరు తింటే నాకూ యింత పెట్టండి. మీకు లేకపోతే నేనూ మీతోబాటే! కాని నా ప్రశాంతతనుమాత్రం భంగపరచకండి" అని అందరితోనూ చెప్పారాయన. పెద్దమ్మాయి 'శశి' అత్తవారింటికెళ్ళింది. నేడో రేపో 'సీత' కూడ వెళ్లిపోతోంది. కోడళ్లొచ్చారు. కుమారు లిద్దరూ ఉద్యోగాల్లో చేరారు. ఇక ఆ గృహంలో చింతకు స్థానంలేదు.

కుటుంబయ్యగారి గృహిణి నాలుగేళ్ల క్రితం పరలోకగతురాలయింది. ఆయన తండ్రిగారు మహాపండితులు. అందువల్లనే కుటుంబయ్యగారు సంస్కృతాంధ్రాల్లో సమానపాండిత్యం గడించారు. ఎల్లప్పుడూ గీతావాక్యం మననం చేసుకొంటూవుంటారు.

ప్రపంచం తనదారిన తాను పురోగమిస్తోంది. వ్యక్తిగతాభిప్రాయాలకు ప్రకృతి ఎక్కడా ప్రాధాన్యం ప్రసాదించినట్టులేదు. నింగిని మేఘాలు ఆవరిస్తూనే ఉన్నాయి. సర్పాలు పీలయినప్పుడల్లా ప్రాణుల్ని కాటందుతూనే వున్నాయి. ప్రాణుల్ని విజాతులు భక్షిస్తూనే వున్నాయి. కాలచక్రం పరిభ్రమిస్తూనే ఉంది. జననం, మరణం నైజదృష్టి మరల్చలేదు. ప్రాణుల మంచిచెడ్డల్నీ, అందచందాలను, వివేకాలను గుర్తించకుండా, విచక్షణారహితంగా మృత్యువు కబళిస్తూనేయుంది.

"దుర్మార్గులు పూర్వం వున్నారు. నేడూ వున్నారు. వాళ్లని పూర్వం ఒక జాతిగాజేసి రాక్షసులు అన్నారు. అదను జూసుకొని అందినవాళ్ళని భక్షిస్తూండేవాళ్లు. ఆ దుర్మార్గులే నేడూ వాళ్ళ రూపాలు మార్చుకొని మనలోనే, మనలానే, మసలటం నేర్చుకున్నారు. అంతే విశేషం నేటికీ నిన్నకీ" అని కుటుంబయ్యగారు ఒక కాగితంమీద వ్రాసుకొని పెట్టెలో పెట్టుకున్నారు. ఇలా చెయ్యడం వారి కలవాటు. అప్పుడప్పుడు దాన్ని తీసి ప్రతి అక్షరంవంకా తీక్షణంగా, నిశితంగా అవలోకించి తిరిగి దాచేస్తూంటారు.

నేటివరకూ సంసారాన్ని ఏ కొరతా లేకుండా ఆయన తీర్చి దిద్దుకొచ్చారు. ఇప్పుడొక్కసారిగా ఆయన ఆరంగాన్నుంచి విరమించుకొనేసరికి కొడుకులు ఉక్కిరిబిక్కిరయ్యారు. సలహాలకు మాటిమాటికి తండ్రిదగ్గర కొస్తూండేవారు.

సృష్టిని వితర్కించుకొంటూ మధ్య మధ్య మను ధర్మశాస్త్రంలోని ముక్కలు చదువుకొంటూ కూర్చున్న కుటుంబయ్యగారికి అనూహ్యమైనవార్త మమకారప్రవంతినిపొంగించి ప్రాంతీయ జ్ఞానాన్ని మునిగిపోయేట్టుచేసింది. పెద్దమ్మాయి 'శశి' కి మసూచికంపోసి నెలరోజులుగా చివికి, చివికి, జీర్ణించి,నశించిపోయింది. పితృహృదయం తల్లడిల్లింది. ఆయన భోరునఏడ్చారు, చంటిపిల్లవానిలా...

కుటుంబయ్యగారికి తీర్థయాత్రలుచెయ్యాలని సంకల్పం కలిగింది. ఇంట్లో నలుగురితో చెప్పారు. "ఒక్కడివే ఎలా వెడతావు నాన్నా! మనవూరునుంచి వెళ్ళేవారెవరయినా వుంటే చూడు. తోడు తీసుకుని వెడుదువుగాని..." అన్నాడు పెద్దాడు.

"పెద్దదిక్కు లేకుండా వెళ్ళిపోతే ఎలా నాన్నా?......ఏచింతా లేకుండా యింటిపట్టునే భగవద్ధ్యానం చేసుకొంటూండకూడదూ వచ్చుగా!" అన్నాడు చిన్నబ్బాయి.

కుటుంబయ్యగారు అందరికీ 'ఆత్మశాంతికోసం' అని సమాధానంచెప్పి ప్రయాణానికి సంసిద్ధులయ్యారు. కొడుకులూ, కోడళ్లూ ఆయన సామానంతా సర్ది కావలసిన అన్ని వసతులు కలిగించారు. రెండోవాడు బెజవాడవరకూ వచ్చి తండ్రిని పెద్దబండీలో ఎక్కించాడు. "నాన్నా! లెక్కకు ఏమీ ఇబ్బంది పడకు. రెండు రోజులు ముందుగానే ఒక కార్డు వ్రాసి పారేయ్! నేపంపుతా...అన్నాయ్ విస్మించుకోడులే" అన్నాడు.

"తండ్రీ! నీ దగ్గరకొస్తున్నా! నాకు జ్ఞానం ప్రసాదించు. సంకుచితత్వాన్నీ; స్వార్థాన్నీ నాలో నశింపచేయి"అని చేతులు జోడించి మ్రొక్కారు కుటుంబయ్యగారు. రైలు కదిలింది.

మదరాసు చేరుకున్నారు. ఒకతన్ని తనకు కావలసిన రైలును గురించి విచారించారు. అదృష్టవశాత్తూ అతడూ ఆంధ్రుడే! కుటుంబయ్యగారి గమ్యస్థానం తెలుసుకొని వివరాలు చెప్పాడు.

కావలసిన పళ్ళూ వగయిరాలు తీసికొని ఎక్కవలసిన బండీలో ఎక్కారు. ఆయన ప్రస్థానకాలమంతా భగవద్ధర్మనాతురులై ఉండటంవల్ల అన్యమనస్కంగాను, మౌనంగానూ, గడుపుతున్నారు.

'వృద్ధాచలం'లో ఒక మహమ్మదీయుడు కుటుంబయ్యగారి ప్రక్కను కూర్చోడం తటస్థించింది.

అతను "పండిట్ జీ! ఎందాక?" అని ప్రశ్నించాడు హిందీలో. కుటుంబయ్యగారికి హిందీ రాదుగానీ ప్రయాణాలలో సాధారణంగా ఎవరయినాఅడిగేది ఆప్రశ్నే కాబట్టి ఆయన వెంటనే 'రామేశ్వర్' అన్నారు.

"మీకు హిందీ రాదూ?" అన్నాడు ఆయన్ని. కుటుంబయ్యగారు తల అడ్డంగా త్రిప్పారు. కానీ వెంటనే 'సంస్కృతం' వచ్చు అన్నారు.

"ఓ! సంస్కృతం వచ్చునా అయితే ప్రయాణం దుర్భరం, అనుపయోగం కాదు"న్నమాటఅన్నాడు మహమ్మదీయుడు సంస్కృతంలోనే.

కుటుంబయ్యగారు కించిదాశ్చర్యం ప్రకటిస్తూ "మిత్రమా! నీ వెక్కడికి?" అని ప్రశ్నించారు.

"ప్రపంచం దుర్భరమైంది. హయాస్సు బుద్బుదమైంది. మనసుకు కళ్ళెం వేసి యాత్రార్థం బయలుదేరాను. నేనూ మీ

★ మ మ కా రం ★

తోనే వస్తున్నాను” అన్నాడతను.

కుటుంబయ్యగారు అతన్ని పరిచయం చేసుకున్నారు. అతని జీవిత నిమ్నోన్నతాల ఫలితాలు విన్నారు. అతనూ మతగ్రంథాలన్నీ తిరగేశాడు. నాలుగయిదు భాషలు ధారాళంగా మాట్లాడగలడు. హైస్కూల్లో ఆరేళ్ళక్రితంవరకూ ఉపాధ్యాయ వృత్తిలో వుండి ప్రస్తుతం విరమించుకున్నాడు.

“కృష్ణుడు చెప్పినా, క్రీస్తు చెప్పినా, కొరాను చెప్పినా అంతా ఒకటేగదా ఆర్యా! ‘నన్ను జ్ఞాపకముంచుకొనుడు; నేను మిమ్ము లను జ్ఞాపకముంచుకొందును; నాకే నమస్కృతులర్పింపుడు. నాయెడల విశ్వాసఘాతకులై యుండకుడు. కృతజ్ఞతతో నుండుడు” అని వుంది కొరానులో.

“తేషామహాం సముద్ధర్తా
మృత్యుసంసార సాగరాత్
భవామి న చిరాత్పార్థ
మయ్యావేశితచేతసామ్”

అన్నాడు కృష్ణభగవానుడు. స్వామీజీ! ఏమిటీభేదం? ఎందుకు లోకం మతద్వేషాల్ని పెంచుకొని స్వార్థబుద్ధితో సంకుచించుకొంటుంది? నేను జీవితాన్ని వృథాచేశాననే వ్యథతో కుమిలిపోతున్నాను. నాకు యీ సత్యం తెలిసివుంటే ఎన్నడో ప్రపంచానికి దూరంగా వుండేవాడిని,” అని నజీరుద్దీన్ దీనవదనంతో చెప్తుంటే కుటుంబయ్యగారు తన ఏకీభావాన్ని తెలియజేశారు.

నజీరుద్దీన్‌కు ఏబదైదేళ్లుంటాయి. డెబ్బది ఏళ్లు మీదపడ్డ కుటుంబయ్యగార్ని చూసి, ఆయన ఒంటిపాటు ప్రయాణానికి నొచ్చుకుంటూ “మీకోసం నేను ముందుస్టేషనులో పాలు సంపాదించి తీర్తాను. మీరు పాలైనా పుచ్చుకోకుండా ప్రయాణం చేయడం చాల కష్టం. నాకు అది సమ్మతికాదు” అన్నాడు.

అన్నట్టే నజీరు పాలు తెచ్చాడు. కొంచెం పాలు కుటుంబయ్యగారు త్రాగి, రైలు బయలుదేరబోతూండగా వాంతి చేసుకొన్నారు. తరువాత ఆయాసపడ్డారు. ప్రాణం కడబట్టినట్లు ఉక్కిరిబిక్కిరయింది.

కండ్లు మూసుకుని ‘తస్య బ్రహ్మలలాటస్య రుద్రో వకసిచా భవత్’ అని విరాట్ రూపాన్ని తల్చుకుంటూ వుండిపోయారు. నజీరుకూడ వారికి ఆరోగ్యాన్ని చేకూర్చుమని భగవానుని ప్రార్థించాడు.

“టికట్” అంటూ వచ్చాడు టి.సి. నజీరు తన టిక్కట్టు చూపించి, వారి టిక్కట్టు ఎక్కడుందో తెలియదు. కొంచెం ఆగిరండి” అన్నాడు.

“అదంతా పనికిరాదు. అసలు టిక్కట్టు లేదల్లేవుంది. అందుకే ఆ దొంగవేషం” అన్నాడు కర్కశంగా టి. సి.

నజీరు వెంటనే అందుకుని “మీలో మానవత్వం కనుపించదేఁ మీకు ముసాఫిర్లమీద ‘చెకింగ్’ అధికారం వుంటేవుండనీ. అసలు జబ్బుగావున్న ముసాఫిర్నుగురించి రైల్వే కంపెనీచేసిన రూలు తెలుసా మీకు?... పరిస్థితి అవగాహన చేసుకోండిసార్. మనమూ వృద్ధులమౌతాం. అలా అందర్నీ చూసిరండి. ఈలోపున వారు కండ్లు తెరువవచ్చు” అని యింగ్లీషులో గట్టిగా సమాధానం చెప్పేసరికి టి. సి. వెనక్కు తిరిగాడు. ఇంతలో కుటుంబయ్యగారు మెల్లిగా లేచి బొడ్డునవున్న ‘టిక్కట్టు’ తీసి నజీరుకు యిచ్చారు. అతను ‘టిక్కట్టు’ చూపించాడు.

సంధ్యాసమయానికి బండి గమ్యంచేరింది. కుటుంబయ్యగారు దైవదర్శనానికి ఆత్రుతపడ్డారు. ఆ రాత్రికి ధర్మశాలలో బసచేసి మరునాడు ఆలయాలు చూశారు.

ఆ రాత్రి కుటుంబయ్యగారికి నిద్రపట్టలేదు. తెల్లివార్లూ దైవాన్ని గూర్చి యోజిస్తూనే వున్నారు. పాంచవకుండాలలోనూ, ధనుష్కోడిలోనూ, స్నానాలు చేశారు.

భగవానునిముందు నిలబడి తదేకదృష్టితో చూస్తూండగా ‘నతుమాంశక్యసే ద్రష్టుమ నేనైవ స్వచక్షుషా, దివ్యం దదామి తే చక్షుః పశ్యమే యోగ మైశ్వరమ్!’ అని వారి మనసులో మెదలింది. వారు పులకించారు.

‘ప్రియజనుల హావభావములను తలచుకొంటూ యింతఆప్తులు మరియొకరు లేరని కీర్తించడాన్ని గుణసంకీర్తనం’ అన్నాడు నారదుడు. జయదేవుడు, లీలాశుకుడు మొదలయినవారు యీ గుణసంకీర్తనం వల్లనే దైవకృపకు మార్గం వేసుకున్నారు.

‘సర్వకాల సర్వావస్థలయందు భగవన్నామసంకీర్తనంవల్ల భక్తులందరూ తరించారు. ఇది నామసంకీర్తనం. మనసు యొక్క వేగాన్ని తగ్గించి కేంద్రీకరించేందుకు మార్గాలు యివే’ అనుకున్నారు కుటుంబయ్యగారు.

నజీరు ఎప్పుడూ తర్కిస్తూనే వుండే

వాడు. కావలసిన గ్రంథాలు కుటుంబయ్యగారివద్దతీసికొని కూలంకషంగా చిలుకుతూం డేవాడు. ఖొరాన్‌తో పోలుస్తూ "అంతా ఒకటే" అని తన అభిప్రాయాన్ని స్థిరీకరించుకున్నాడు. "సూర్యోదయం మొదలు తిరిగి సూర్యోదయంవరకూధ్యానం చెయ్యాలి. అర్ధరాత్రి సైతం నిద్రమాని ధ్యానం చెయ్యాలి. అప్పుడే భగవంతు డనుగ్రహిస్తాడు" అని వుందన్నాడు నజీరు.

ఇరువురూ ప్రతిదినం ఆలయాలకు వెళ్ళి వస్తూండేవాళ్లు. కుటుంబయ్యగారి ఆరోగ్యం సరిగా వుండటంలేదు. "పోనీ...యీ పవిత్రక్షేత్రంలోనే కలిసిపోతాను" అనుకున్నారాయన.

ఓ రోజున యింటివద్దనుండి వుత్తరం వచ్చింది. కుటుంబయ్యగారు దానిని తెరచి చూడాలనే ఉద్దేశ్యం అణచివేశారు. ఆ లిప్న అంతరించేలోగానే వారికి ఆప్తులంతా కళ్లకు కట్టినట్లు కన్పించారు. వారి క్షేమ సమాచారాలకోసం పితృహృదయం తల్లడిల్లింది. తన బిడ్డలు ఎలా వున్నారో? పెద్దమ్మాయ్ అలా అన్యాయం చేసిపోయింది. పెద్దాడు, చిన్నాడు సఖ్యతగా వుంటున్నారో లేదో? చిన్నమ్మాయ్ కాపురమెలా వుందో? ఈ ప్రశ్నలన్నీ సాగరంలోని కెరటాలవలె వెంటవెంటనే వచ్చి ఆయన్ను వూపిరి పీల్చనివ్వలేదు.

వెంటనే లేచి వెళ్ళి వుదయంవచ్చిన వుత్తరాన్ని విప్పి అంతా చదివారు. ఆయన మనస్సు క్షోభించిపోయింది. కన్నులవెంట అశ్రుకణాలు వుద్భవించి చెక్కిళ్లవెంట కారుతున్నాయి. 'చిన్నాడికి కలరా తగిలింది'.

* * *

రైలు అతివేగంగా ఆంధ్రదేశంవేపు దూసుకుపోతోంది. వెనక్కు తగ్గుతున్న ప్రకృతిని చూస్తూ కుటుంబయ్యగారు దుఃఖభారాన్ని దిగమ్రింగేందుకు ప్రయత్నిస్తున్నారు.

తన నిష్ఠ మంటగలసింది. ఆప్తులమీది మమకారం చావలేదు. మనస్సు పరాధీన మౌతూంటే భగవానుని సన్నిధానం నిష్ప్రయోజనం. తను వయోవృద్ధుడు. విచక్షణాజ్ఞానాన్ని జీవితమంతా వడబోతపెట్టి ఆర్జించాడు. సుఖదుఃఖాల అనుభవాలు జీర్ణించిపోయాయి. మరణాలు తను చాలా చూశాడు. మరణం అనేది జీవికి ఆఖరి అనుభూతి. జీవితంలో దేన్నుంచిఅయినా దూరంకావచ్చుగాని మరణాన్ని మాత్రం తప్పించుకోలేడు. ఇది తనకు తెలిసినసత్యం. కాని తాను "తన, పర" భేద భావం కలిగించుకొని వుండటంవల్లనే మనస్సు అనేది తనవాళ్లవేపు పరుగిడుతోంది. తను జీవితంలో సాధించింది ఏమిటి?...చివరికి మృత్యువు తన్ను సమీపించే అంతిమ ఘడియల్లో మిగిలేదేమిటి? తర్వాతమాత్రం తాను గానీ, తన ఆత్మ గానీ శేషించగలగటం సాధ్యమా? భగవానుడు తనవంటి కూపస్థమండూకాలకు చూపిన సుసాధ్యమయిన, అనపాయకరమైన మార్గాన్ని తానెందుకు గుర్తించి పురోగమించలేకపోతున్నాడు. ఎంత మౌఢ్యం! పంకిలంలో పడిపోతున్నాడు తాను.

కుటుంబయ్యగారు యీ సుదీర్ఘమయిన ఆలోచనలో చలించిపోయారు. చైతన్యం సన్నగిలుతున్నట్లు గోచరించసాగింది. జగత్తు కళ్లముందు పరిభ్రమించి మిరుమిట్లుగొల్పింది. అవయవాలు పట్టుతప్పుతున్నై.

రైలు ఒక స్టేషనులో ఆగి మళ్ళీ బయలుదేరింది. వెలుగుతూన్న గుడ్డిదీపంకాంతిలో మూలగా కూర్చున్న కుటుంబయ్యగారి స్థితిని జోగుతూన్న ప్రయాణీకు లెవరూ గుర్తించలేదు.

కుటుంబయ్యగారు మెల్లగా గొణుగుతున్నారు. 'జాతస్య మరణం ధ్రువం' అని.

కుటుంబయ్యగారు ఒకసారి భగవంతుని ధ్యానించుకున్నారు. అంతే! ఆయన జీవనజ్యోతి అంధకారంలో కలసిపోయింది. రైలు ఆయన స్వగ్రామంలో ఆగి మళ్ళీ బయలుదేరి వెళ్లిపోయింది. ఎటో? ★

ఆచార్య విభ్రాంతి

ప్రాచీన గాథాలహరి

పి. గణపతిశాస్త్రి

[గత సంచిక తరువాయి]

౪

అమరుకదేవునికి లీలావతిపైకలిగిన గాఢాను రాగం అంతఃపురరాణు లందరికీ కన్నె్రగా మారింది. వారెవ్వరూ ఎన్నడు అతని అనురాగం అంతగాఢంగా చవిచూడలేదు. స్వతః అతని ప్రకృతి అంత లోతైనదికాదు. ఇంతకుపూర్వం అతని అనురాగము, అపేక్ష, మమకారము ఏ రాణిమీద పట్టుమని పది రోజులపాటైనా సుస్థిరంగా నిలబడలేదు! అలాంటప్పుడు ఒకమారు చిత్తరువులో చూచినంతమాత్రాన ఆయనకు లీలావతిపై అంతటి వల్లమాలిన ప్రేమకలగడానికి కారణమేమో! రాణు లెవరికీ మహారాజు స్వభావంలో కలిగిన ఈ విచిత్ర పరిణామానికి కారణం తెలియలేదు. కొంతమంది రాణులదంతా వట్టి మూన్నాళ్ల ముచ్చట అని కొట్టిపారేశారు. ఇదంతా వట్టి నటనేలే! తీరా ఆకొత్తరాణి రాణివాసం ప్రారంభించగానేమళ్లీ యథాప్రకారంగా పాతకథే ప్రారంభం అవుతుంది. మొదట్లో మామీదమాత్రం ఆయనకీమాత్రం అనురాగం కలగలేదు గనకనా?"

వారిలోవారలాగ సమాధానపడ్డారు.

ఇక కింశుకప్రభకీ లీలావతీ ప్రేమ మరింత విచిత్రంగా కనిపించింది. కింశుకప్రభ ఒకప్పుడు మహారాజు మమకారం గాఢంగానే చవిచూచింది. తరవాత అమరుకుని కామెపై ఏర్పడింది కేవలం ఉపేక్షాభావం మాత్రమే! తలవని తలంపుగా మహారాజు తనకత్యంత సన్నిహితులయిన రసికులతోను, విట విదూషకులతోను కలిసి అంతఃపురకంలో రెండు మూడు పూరు లామె నృత్య చాతుర్యం చూచి ఔనౌనని తల పంకించి వేనోళ్ళ ప్రశంసించాడు. నిరాదరణ అవమానం భారంతో కుమిలి కృశించిపోతున్న కింశుకప్రభకా ఆదరణఒక వెన్నిధిలా కనిపించింది. ఆ పరిస్థితులలో ఆమె తనపై అతని కటీవల ఏర్పడిన ఆసక్తి అలాగే నిలవరించుకోవాలని అనేకవిధాల ప్రయత్నించింది. లీలావతికథ విన్నతరవాత కింశుకప్రభ కామెపై ఈర్ష్యాసూయలు కలగకపోలేదు! కాని అమరుకదేవుని కామె మీద కలిగిన ఆసక్తి కేవలం తాత్కాలికమే అని ఆమె నిశ్చయించింది. అందుచేతనే తనకు లీలావతిపై కలిగిన ఈర్ష్యాసూయ లలాగే దిగమింగి అతి కష్టం మీద ఆమె చిత్తరువొకటి సంపాదించి ఎంతో ఆప్యాయంగా అమరుకదేవునికి బహూకరించింది. అది గ్రహించిన అమరుకదేవుని కామెయెడల జాలికలగక పోలేదు కాని అతనిచిత్తం లీలావతీ గాఢానురాగ పాశబద్ధమై వివశమై పోయింది!

అది హఠాత్తుగా గ్రహించిన కింశుకప్రభ నిష్కారణంగా కొరివితో తల గోక్కున్నానని పశ్చాత్తాపపడింది. కాని చేతులు కాలిన తరవాత ఆకులు పట్టుకుంటే ఏమిలాభం?

మహామాత్యుడు రాజ్యవర్ధనునికిది మరింత పెద్ద విషమసంధిగా కనిపించింది. విదర్భ దేశాధిపతి తనకుమార్తె నమరుకదేవునికిచ్చి వివాహం చెయ్యడానికంగీకరించలేదు. కాని ఇరుగుపొరుగురాజ్యమైన మాళవంలో విరోధానికి వెరిచి ఆమహారాజును స్వయంవరానికిమాత్రం ఆహ్వానించాడు. అంతే! అమరుకదేవుడు స్వయంవరయాత్ర మిషతో సైన్యాలన్నీ సమాయత్తపరచవలసిందని ఆజ్ఞాపించాడు. అంతేగాని తన నిజ సంకల్పం మాత్రం రాజ్యవర్ధనునికి తెలియనీయలేదు. కాని రాజ్యవర్ధనుని కతనిసంకల్పంగ్రహించడానికట్టేకాలం పట్టలేదు. లీలావతిని రాక్షసవివాహ మర్యాదతోనైనా వివాహమాడితీరాలని మహారాజు నిశ్చయించుకున్నాడని మహామాత్యుడిట్టే పసికట్టేశాడు. దానివల్ల మాళవ విదర్భ దేశాల మధ్య ఏర్పడిన సామరస్యంచెడి తిరిగీ వైమనస్యంగా ప్రబలవైరంగా పరిణమించగలదని అతడు భయపడ్డాడు. అందుచేత మహారాజంతగా మనసిచ్చి మాట్లాడక పోయినా సైన్య సన్నాహాలతో స్వయంవరయాత్రకు తరలివెళ్ళడం సముచితంకాదనీ దానివల్ల అనేకమైన అపోహ లేర్పడవచ్చుననీ అన్నాడు. అమరుకదేవు డదివిని అతి హేళనగా ఒకనవ్వు నవ్వాడు.

"మీకాభయం అక్కరలేదు! అవన్నీ నేను చూచుకుంటాను. రాజ్యం వీరభోజ్యం అంతేగాని భీరుభోజ్యంకాదు! మీరిక వెళ్ళవచ్చును."

అంతపరుషంగా మహారాజు మాట్లాడినప్పుడిక రాజ్యవర్ధనుడేమీ అనలేక తలవంచుకుని ఒక్క నిట్టూర్పు విడిచిపెట్టి చల్లచల్లగా అక్కడినించిజారుకున్నాడు.

అతని హృదయంలో మళ్ళీ మథన ప్రారంభమయింది. మహారాజు పూర్వం రాజ్యవ్యవహారాలన్నీ తనమీద విడిచిపెట్టి యథేచ్ఛగా భోగవిలాస లాలసలో మైమరిచేవాడు. ఎన్నివిధాల చెప్పినా రాజ్యవ్యవహారాలేవీ చెవికెక్కనిచ్చేవాడుకాదు.

ఇప్పుడది మరింత మితిమీరిపోయింది.

కొన్ని వ్యవహారాలేమైనా తరిచి తరిచి అడిగితే వాటికన్నిటికీ అంటీఅంటని సమాధానాలేవో చెప్పి తప్పించుకోవడం మొదలుపెట్టాడు. మరికొన్ని వ్యవహారాలతనికేమీ జ్ఞాపకమున్నట్లే కనబడలేదు!

పూర్వకాలంలో ఏదైనా ఒక ముఖ్య వ్యవహారం పరిష్కరించవలసివస్తే తన మాటప్రకారమే నడుచుకునేవాడు. ఇప్పుడదంతా తారుమారయింది. మహారాజు భోగవిలాసా లానాటికానాడు పెచ్చు పెరిగిపోయాయి. పైగా ముఖ్య వ్యవహారాల్లో

తనతో ఒకమాటయినా అనకుండా యథేచ్ఛగా ఇష్టంవచ్చినట్టు సంచరిస్తున్నాడు. ఇక దైనందిన రాజ్యపరిపాలనగూడా పట్టించుకోవడం మానివేశాడు. వాటి విషయం ఎత్తితే అతని కెక్కడలేని చిరాకు, విసుగు పుట్టుకొస్తున్నాయి. ఒకవేళ ఏదయినా సమాధానం ఇచ్చినా దానిలో పూర్వాపర సంబంధం లేదు! ఆ విస్మృతికీ, విసుగుదలకు అసలు కారణ మేదో మహామాత్యుని కేమీ అంతు చిక్క లేదు.

అతనికేమీ పాలుపోక మిగిలినమంత్రులతో ఆ విషయం ముచ్చటించాడు. వారిలో కొందరది తేలికగా కొట్టిపారేశారు. "దేవరవారి దివ్యచిత్తానికొక దారి తెన్ను ఉండాలనుకోవడమే ఒక పెద్ద పొరబాటు! మారుమాట్లాడకుండా వారి సంకల్పప్రకారం నడుచుకోవడమే మన విధ్యుక్తధర్మం! మహారాజు తామై ప్రశ్నిస్తే ఏదైనా తోచిన సదుపదేశం చెయ్యడంవరకే మనధర్మం! అంతే!"

కాని రాజ్యవర్ధనుడంతటితో సంతృప్తిపడి ఊరుకోలేదు. మహారాజు హృదయములో ఇటీవల బయలుదేరిన యీ విపరీత పరిణతి కేదో ప్రబలకారణం ఉండితీరాలని నిశ్చయించాడు. రాజవైద్యుల్ని కొందరిని పిలిచి మహారాజు చిత్తభ్రాంతిని గురించి చర్చించాడు. వారదంతా క్రమక్రమంగా దానంతట అదే కుదటపడగలదని సమాధానాలిచ్చారు. రాజ్యవర్ధనుడికి చేయగలిగినదేమీ లేక వారిమాటప్రకారం కొంతకాలంవరకు వేచివుండడమే మంచిదని నిశ్చయించుకొన్నాడు.

❧

విదర్భదేశాధిపతి తన కుమార్తె లీలావతిని అమరుకదేవుని కిచ్చి వివాహం చెయ్యడానికంగీకరించకపోవడానికొక కారణం లేకపోలేదు. అమరుకుడసలే భోగలాలసుడు. ఆపైన అతనికప్పుడే సుమారు నూరుగురుదాకా రాణులున్నారని ఒక లోకప్రవాదం బయలుదేరింది. బహుభార్యాత్వం ఆనాటి మహారాజ సంప్రదాయమే! అయినా తన కుమార్తె సుఖం ఆలోచించి అతడమరుకుని వివాహసంబంధానికంగీకరించలేదు! కాని దానివల్ల అమరుకదేవునితో బలవద్విరోధం ఏర్పడగలదని అతనికి భయం కలగకపోలేదు. కాని అతడది లెక్క చెయ్యలేదు. అలాగే భీష్మించుకుని కూర్చున్నాడు. ఇటీవల అమరుకునికేదో కొంచెం చిత్తచాంచల్యం కలిగినదని కూడా అతనికి తెలిసింది. దానితో అతనికి మరింత గట్టిపట్టుదల పట్టుకుంది. ఏది ఏమైనాసరే! లీలావతి నమరుకదేవుని కిచ్చి వివాహం చెయ్యకూడదని గట్టిగా నిశ్చయించుకొన్నాడు.

అప్పటి విదర్భరాజధాని పద్మనగరం రాజకుమార్తె లీలావతి స్వయంవర సన్నాహకోలాహలంతో నూతన తోరణాలంకారాలతో కలకలలాడింది. స్వయంవరార్థం విచ్చేసిన రాజకుమారులంతా తమకోసం ప్రత్యేకంగా అమర్చిన సింహాసనాలమీద కూర్చుని లీలావతి సందర్శనంకోసం అనుక్షణము ఎదురు చూస్తున్నారు. అమరుకదేవుడామె రాక కోసం మరింత ఆత్రంగా ఎదురుతెన్నులు చూచాడు.



చివరికి నూతన వధూవేషంతో కలకలలాడుతూ లీలావతి ప్రత్యక్షమయింది. ఆమె సౌందర్యం చూచిన రాజకుమారులలాగే నిశ్చేష్టులై శిలాప్రతిమ లయినారు. అమరుకదేవునికామె చిత్తరువులో, ఆమె సౌందర్యంలో

★ ఆచార్య విభ్రాంతి ★

లవలేశంకూడా ప్రతిఫలించలేదని అనిపించింది!

లీలావతి స్వయంవరమాలిక చేత ధరించి నెమ్మదినెమ్మదిగా అడుగులు వేసుకుంటూ నడిచివస్తూంది. ఆమె చెలికత్తె బారులుదీర్చి కూర్చున్న రాజకుమారులలో ఒక్కొక్కరి వైపే చూచి సంగ్రహంగా వారివారి గుణగణాలేకరువుపెడుతూంది.

క్రమక్రమంగా లీలావతి అమరుకదేవుని సింహాసనం సమీపించింది. అతనితో బాటతని పార్శ్వాల కూర్చున్న రాజకుమారులంతా ఆమె స్వయంవరమాలిక ఉత్తరక్షణంలో తమ కంఠాలలంకరించగలదని ఎంతైనా ఉవ్విళ్లూరారు. కాని అలాంటిదేమీ జరగలేదు. ఆమె వారి నందరినీ అతిక్రమించి వెళ్లిపోయింది! అయినా రాజకుమారులంతా పైపైకలాగే చిరునవ్వులు చిలకరించారు. అమరుకదేవుని కది సాధ్యం కాలేదు. ఎలాగో అలాగ శ్రమపడి ఒక్క విషపు నవ్వు వెళ్ళగక్కాడు. లీలావతి చెలికత్తెతో కలిసి హేలగా అలాగే ముమ్ముందుకు సాగిపోయింది. ఒక రాజకుమారుని సింహాసనం దగ్గర కొంతసేపు నిలబడింది. అది గ్రహించి చెలికత్తె అతని గుణగణాలనే పనిగా పొగడడం మొదలు పెట్టింది. లీలావతి చెక్కిళ్లెర్రబడ్డాయి. ఆమె స్వయంవరమాలిక నెమ్మదిగా ఆ రాజకుమారుని కంఠంలో అలంకరించబోయింది.

అంతలో రాజకుమార పంక్తిలో ఒక పెద్ద గగ్గోలు బయలుదేరింది. వారందరు తమ తమ సింహాసనాలు దిగి ఆ కల్లోలానికి కారణం తెలుసుకోడానికి ప్రయత్నించారు. క్షణంలో వారి కది అంతా అవగాహన అయింది.

లీలావతి తన సింహాసనందాటి ముమ్ముందుకు సాగిపోగానే అమరుకదేవుడిక తన సింహాసనంపై కూర్చోలేక పోయాడు. మరి కొంత సేపటికి లీలావతి స్వయంవరమాలిక ఇంకొకరి కంఠం అలంకరించబోతున్నదని గ్రహించాడు. మరుక్షణంలో లీలావతిని హఠాత్తుగా చేజిక్కించుకొని తన రథం మీదికి వెళ్లిపోయాడు. అంతంతకు అమరుకదేవుని విడిదిలో పరిచారకులుగా అధికారులుగా మారువేషాలు ధరించిన సైనికులంతా నిజస్వరూపాలతో అతని రథం పక్కనే యుద్ధసన్నద్ధులై నిలిచారు.

అప్పటికి సూర్యాస్తమయం అయింది. అమరుకదేవుని సైనికులు, విదర్భదేశాధిపతి సైనికులు ఒకరొకరితో యుద్ధానికి తలపడ్డారు. క్రమంగా బాగా చీకటి పడింది. విదర్భదేశాధిపతి సైనికులు స్వయంవర మహోత్సవం సన్నాహంలోపడి వివిధ వినోదాలతో వినోదిస్తున్నారు. వారెవ్వరూ హఠాత్తుగా యుద్ధం తమపై విరుచుకుపడగలదని అనుకోలేదు! అమరుకుని సైనికులంతా సర్వసన్నద్ధులై అక్కడికి వచ్చారు. 'అనుక్షణము యుద్ధంకోసం ఎదురుచూస్తున్నారు. అందుచేత ఆ సంకుల సమరంలో వారిదే పైచేయి అయింది. అయినా అమరుకదేవుని సైనికుల్లో చాలామంది ఆ యుద్ధంలో మరణించారు. అమరుకదేవు డతికష్టంమీద లీలావతితో సహా తన రాజధానికి తిరిగిరాగలిగాడు.

అటుపిమ్మట రెండు రోజులలో వారిద్దరికీ యథావిధిగా వివాహం జరిగిపోయింది. ఆ వివాహంలో లీలావతి ఇష్టానిష్టాల విషయం ఎవరు తలపెట్టలేదు. ఆ విధంగా వివాహమాడడం ఆ రోజుల్లో సుక్షత్రియ ధర్మం! అందుచేత అమరుకదేవుని అత్యద్భుత సాహసం విని అందరు వేనోళ్ళ ప్రశంసించారు. అతడావిధంగా అత్యద్భుత శౌర్యసాహసాలు ప్రదర్శించి శత్రువులందరినీ చెండాడి లీలావతిని రాక్షసవివాహమర్యాద చేజిక్కించుకురావడమే వారి కత్యాశ్చర్యకరంగా కనిపించింది.

అంతేనేగాని లీలావతికది అంగీకారం అవునో కాదో వారెవ్వరు ఆలోచించలేదు! అందరుఅమరుకదేవునినూతనకళ్యాణోత్సవాల కోలాహలంలోపడిఆవిషయ మేవిస్మరించారు.

ఇక లీలావతిమాట! ఆమె మొట్టమొదట ఆ ఆఘాతానికి తట్టుకోలేక అమరుకదేవుని రథంమీదే స్పృహతప్పి పడిపోయింది. తరవాత అతని అంతఃపురంలో కళ్లు తెరిచి నాలుగువైపుల పరకాయించి చూచింది. ఉత్తరక్షణంలో ఆమె కదంతా అవగాహన అయింది. కాని ఆమె మరి మాటలాడలేదు! ఒకమారు తన దురదృష్టం నిందించుకొని గుడ్లనీరుకుక్కుకుంది. వివాహసమయంలో కూడా ఆమె పెదవులపై ఒక చిన్ని చిరునవ్వైనా చిగిరించలేదు!

వివాహం జరిగిన ఒకపక్షం రోజులవరకు ఆమె ముఖవైఖరిలో మార్పేమి గోచరించలేదు. కాని అమరుకదేవుడామె అనుగ్రహం సంపాదించడానికెన్నెన్నో విధాల ప్రయత్నించాడు. అనుక్షణము ఆమెకే లోటు రానీయకుండా కంటికి రెప్పలా చూడవలసిందని అంతఃపుర పరిచారికలను ఆజ్ఞాపించాడు.

లీలావతి అంతఃపురంలో అడుగుపెట్టినప్పటినించీ అతని దృష్టిఅంతా ఆమెమీదనే లగ్నమయింది. అంతేకాదు! ఆపైన మరి ఒక మాసంరోజులు గడిచిపోయినా అతని వైఖరిలో మార్పేమీ గోచరించలేదు. అప్పటికి లీలావతి పెదవులపై చిన్ని చిన్ని చిరునవ్వులు చిగిరించడం మొదలు పెట్టాయి. అమరుకదేవుడిక తనవంటి అదృష్టశాలి ప్రపంచంలో ఇంకెవరులేరని సంతోషించాడు. ఇక లీలావతి కనుసన్నలలో మెలుగుతూ మిగిలిన అంతఃపుర రాణులమాటే మరిచిపోయాడు. ఆ ధోరణిచూచి మిగిలిన రాణులందరు ఆశ్చర్యపోయారు. కొత్త రాణి అతిలోక సౌందర్యమే అతని నంతగా ఆకర్షించినదని కొంచెం సమాధానపడ్డారు. మరి కొందరామె చాలా అదృష్టవంతురాలని అసూయపడ్డారు.

అప్పటికావివాహం జరిగి ఇంచుమించుగా ఒక నెల రోజులకాలం గడిచిపోయింది. అప్పటికమరుకదేవుడు లీలావతి బాగా కుదటపడిందని సంతోషించాడు.

కాని మరి కొంత కాలానికి లీలావతి క్రమక్రమంగా చిక్కి శల్యమైపోయింది. ఆమె తన శయ్యమీదనించి లేచి నాలుగడుగులు వెయ్యడమే గగనమైపోయింది. ఆమె ఆ విధంగా క్షీణించి చిక్కి శల్యమైపోవడానికి కారణమెవరికీ తెలియలేదు. చివరికి రాజవైద్యుల ప్రత్యేక ప్రక్రియలు కూడా పనికిరాలేదు. ఆమె అలాగే చిక్కి శల్యమైపోయింది. అసలామె రుగ్మతకూడా ఎవరికీ అంతుబట్టలేదు. లీలావతి పెదవుల మీది చిరునవ్వూ, ముఖలావణ్యము మాత్రం క్షీణించలేదు. అంటే, కొందరామె దురంతచింతతో ఆవిధంగా కృషించిపోయినదని అన్నారు! మరి కొందరామె కమరుకదేవునితో వివాహం బొత్తిగా సరిపడలేదని గుసగుసలాడారు. మరి కొందరామె రహస్యంగా విషం పుచ్చుకొని ఉండవచ్చునని అనుమానించారు. అమరుకదేవుడామె శయ్యపక్కనే నిలబడి అనుక్షణము కంటికి రెప్పలా కాపాడుతూ కాయకష్టలా వైద్యం చేయించాడు. కాని ప్రయోజనమేమీ కలగలేదు. ఒకనాటి అర్ధరాత్రి ఆమె అలాగే చిరునవ్వుతో కళ్ళుమూసింది. అది చూచి అమరుకుడక్కడే కూలబడిపోయాడు.

౬

అతనికా ఆఘాతంతో ఒక పెద్ద పిడుగు మీద విరుచుకుపడినట్లయింది. అంతకు పూర్వం అతడెప్పుడు అంత హృదయాఘాతమే చవిచూడలేదు! ఆ దుఃఖాఘాతంతో అతడొక్క మారు కళ్లు తెరిచి చూచాడు! జీవితం అంతా అతని కొక్కమారుగా దుఃఖభూయిష్ఠమై అనిత్యమైపోయినట్లు స్ఫురించింది. తన భోగలాలస నిత్యవినోదాసక్తులన్నీ కేవలం అర్థరహితంగా వ్యర్థంగా కనిపించాయి.

జీవితంలో అందరికీ అడుగడుక్కీ తీవ్రమైన దుఃఖ ఆఘాతాలు తగులుతూనే ఉంటాయి. కాని ఆ ఆఘాతాలకే వేవో అర్థాలు చెప్పుకుని అనేకులనేక విధాలుగా సంతృప్తి పడుతూ అలాగే జీవితయాత్రలు సాగిస్తూంటారు. ఒక్కొక్కరికి ఒక్క శోకాఘాతంతో జీవితం అంతా నిస్సారమైపోయినట్లు స్ఫురిస్తుంది. అమరుకుడింతకు పూర్వం అనేక వివాహాలు చేసుకున్నాడు. కాని వారెవరి మీద అతని కంతటి గాఢానురాగం ఏర్పడలేదు. తలవని తలంపుగా లీలావతి మీదనే అతని కంతటి గాఢానురాగం కలిగింది. అయితే ఆమె అప్పుడప్పుడే వికసించిన క్రొవ్విరిలా అతని హృదయం అలంకరించి అంతలోనే వాడి నేలపై రాలిపోయింది. అమరుకుని కామె హృదయం అన్యాయత్తమై ఉండవచ్చునని అనుమానం కలిగింది. అయినా ఆమె యెడల అతని అనురాగం కొంచమైనా వాడిపోలేదు. కనకనే ఆమె మృతితో అతని కంతటి తీవ్రావేదన కలిగింది. ఆ ఆవేదన అతని కంత గొప్ప కనువిప్పు కలిగించింది.

అతడప్పటినించీ పూర్వ భోగలాలసలన్నీ పూర్తిగా విసర్జించి వేశాడు. లీలావతి మృత్యుజిజ్ఞాస అతని అంతరాంతరాలలో ఒక పెద్ద సంక్షోభం రేకెత్తించింది. అమరుకుడప్పటినించీ విద్యావయోవృద్ధులతో వేదాంత చర్చ లారంభించాడు.

వేదాంతవేత్తలనేక విధాలుగా అతనికి దుఃఖోపశమనం కలిగించడానికి ప్రయత్నించారు. వారి వేదాంత సూక్తులుగాని, ఉపశమనవాక్యాలుగాని అతని హృదయంలోని చిచ్చార్పలేకపోయాయి.

ఎంతసేపు అతనికొకటే జిజ్ఞాస? లీలావతి ఎక్కడికి వెళ్ళిపోయింది? మరుమరీచికలై స్ఫురించే జీవనమరణాల అంతరార్థమేమిటి? తానెవరు? ఆమె వియోగం తన హృదయాంతరాలాన్నింతగా దొలిచివేయడానికి కారణమేమిటి? తిరిగి లీలావతి ఎవరు? అసలీ జీవితపరమార్థమేమిటి? ఇటువంటి ప్రశ్నలెన్నెన్నో అనుక్షణము అతని హృదయంలో అరని జిజ్ఞాసాగ్ని ప్రజ్వలింపజేశాయి. ఎంతమంది తత్త్వవేత్తలెన్ని విధాల సమాధానపరిచినా అతని హృదయవేదనాజ్వాల చల్లారలేదు. ఆ కారణంవల్లనే అతని దర్శనం అంతఃపురస్త్రీలకే గాక మంత్రులకుగూడా దుర్లభమైపోయింది.

ఒకనాడు రాజ్యవర్ధను డేదో అత్యవసర వ్యవహారంమీద మహారాజదర్శనానికి వస్తున్నానని కబురు పంపించాడు. ఎంత రుచించకపోయినా అమరుకదేవునికి తన నిదర్శనం ఇవ్వక తప్పలేదు. రాజ్యవర్ధనుడు లోపలికి వస్తూనే ఎంతో ఆత్రంగా మాట్లాడాడు:

"మహాప్రభూ! విదర్భ దేశాధిపతి సైన్యాలతో సహా మనమీదికి దండెత్తి వస్తున్నారట! ఆయన తమ కుమార్తె మృతికి తగిన ప్రతీకారం చెయ్యడంకోసమే ఈవిధంగా మనపై విరుచుకు పడుతున్నారట!"

ఆమాటలువిని అమరుకదేవుడొక్కమారుగా విరగబడి నవ్వడం మొదలు పెట్టాడు. ఆ ధోరణిచూచి రాజ్యవర్ధనుడతనికి పూర్తిగా మతిభ్రమణమే కలిగిందని అనుమానించాడు. అంతలో మహారాజు తనవెర్రినవ్వాపివేశాడు:

"రానివ్వండి! దానికేం! నేను యుద్ధమే కోరుకుంటున్నాను! వారు సరిగా సమయానికే వచ్చారు! మీరు వెంటనే వెళ్ళి సైన్యాలన్నీ సమాయత్తపరచండి! వెళ్ళండి!"

రాజ్యవర్ధనుడతని మాటలు విని మరింత ఆశ్చర్యపోయాడు. వెనువెంటనే సైన్యసన్నాహప్రయత్నంలో పడ్డాడు.

దుఃఖోద్వేగంవల్ల అమరుకుని కప్పటి జీవితం కేవలం దుర్భరమైపోయింది. ఆ సమయంలో విదర్భసైన్యాధిపతితో యుద్ధంచేసి వీరస్వర్గం చూరగొనడమే సముచితమని అతనికి స్ఫురించింది. కాని పైపైకా సంకల్పం ఎవరికీ తెలియనీయకుండా వెంటనే యుద్ధప్రయత్నంలో పడ్డాడు. ఆ ప్రయత్న తన్మయతలో మైమరచిన అతనికి తాత్కాలికంగా కొంతవరకు దుఃఖోపశమనం కలిగింది.

—సశేషం.

వెంగళప్ప పరిశోధన

విజ్ఞప్తి: శ్రీ వెర్రిబాగుల వెంగళప్పగారు వారు యిటీవల కనిపెట్టిన విషయంపై యీ రోజు సాయంత్రం అయిదుగంటలకు నందనోద్యానం అనే నామాంతరంగల సుబ్బారాయుడు పార్కులో బహిరంగంగా ఉపన్యసిస్తారు గనుక పురజనులందరూ విచ్చేయ ప్రార్థన.

ఇట్లు
కార్యదర్శి,
పునరుద్ధరణ సంఘం.

వేసవికాలం అప్పుడే ప్రవేశించిందేమో ప్రాణం కాస్త చల్లగాలికి తహతహ పడుతోంది. పార్కుకు వెళితే గాలి బాగా వేస్తుందిగాని ఆ సుఖం ఘ్రాణేంద్రియం లేనివాడికి లేక ఉన్నా పని చెయ్యనివాడికి నూటికి నూరుపాళ్లూ లేకపోయినా కొంతయినా ఉండకపోదు. కాని పంచేంద్రియాలూ కాస్త సరియైనస్థితిలో ఉన్నవాడు మాత్రం ఆ పార్కు చుట్టూ ఉన్న మురికి కాలువల కంపుకీ, కాలువలలోంచి వచ్చి దండయాత్ర జరిపే దోమలకీ ఎవరిమాట ఎలా ఉన్నా నాకు మాత్రం తట్టుకుందికి దమ్ములేదు. అయినా ఆ విజ్ఞప్తి మానేసరికి ఏదో ప్రత్యేకత కనుపించింది—వెంగళప్పగారి ఉపన్యాసం అనగానే సాక్షిలో ఉన్మత్తుని ఉపన్యాసాలు జ్ఞప్తికి వచ్చాయి. వెంగళప్పకీ, ఉన్మత్తుడికీ సామ్యం ఉన్నా లేకపోయినా యింతకీ వెంగళప్ప కనిపెట్టినవిషయం ఏమిటో తెలుసుకోవాలని బయలుదేరాను.

నేను వెళ్లేసరికి వెంగళప్పగారు ఉపన్యాసం ప్రారంభించారు. శ్రోతలు పాతికముప్పై కన్న ఎక్కువ ఉండరు. అంత తక్కువ మంది ఉన్నందుకు లెక్కపెట్టి సరిగ్గా ఎందరు హాజరయ్యారో పాఠకులకు చెప్పవలసిన బాధ్యత నాకు ఉంది. కాని మరిచిపోయినందుకు క్షమించండి.

"......నేను చాలా అదృష్టవంతుణ్ణి. బహిరంగసభకి జనం ఎంత తక్కువ వస్తే అంత సంతోషం నాకు. జనం ఎక్కువగా వస్తే ఏముంది చెప్పండి. ఉపన్యాసకుణ్ణి చెప్పనివ్వరు. వాళ్లు ఊరుకోరు. ఒకటే గొడవ. కిచకిచలూ, పకపకలూ, వ్యాఖ్యానాలూ, వెక్కిరింపులూ, గడబిడలూ, వాడబిడలూ, యీలవేతలూ, పిల్లికూతలూ, అబ్బబ్బ...వాళ్లు వినరు, ప్రక్కవాళ్లని విననివ్వరు. అందుచాత నేడు అటువంటి ప్రమాదం లేనందుకు చాలా సంతోషిస్తున్నాను....

"ఇటీవల మీరందరూ చాలా మార్పులు గమనించారు. వాటిలో ముఖ్యమైనవి రెండూ మీకు తెలుసు—

'నాకు తెలీదు చెప్పండి వెంగళప్పగారూ' ఒక శ్రోత.

"ఓ బ్రహ్మానందంగా చెపుతా. శ్రోతలు కోరినదానిని చెప్పడంకన్న బ్రహ్మానందమైనది మరొకటి ఏమిటుంటుంది ఉపన్యాసకుడికి...చెప్తాను కాయనా సావధానంగా వినం...."

"నయాపైసాలూ, శాలివాహన శకం ప్రకారం పంచాంగం మారిపోవడం" మరో శ్రోత.

కరెక్ట్. మీరు సరిగ్గా చెప్పాసారు. చాలా మంది ఉపన్యాసకులుకి తెలివైన శ్రోతలు దొరకరు. కాని నాకు అటువంటి దురదృష్టము పట్టలేదు. సోదరులారా! ఈ మార్పుల వల్ల మీకు కంగారుగా ఉండవచ్చు. కంగారే ఏమిటి, తగవులుకూడా వస్తున్నాయి. యీ రోజునే నేను స్వయంగా చూసిన రెండు విషయాలు వివరిస్తాను—

పూ భా

ఉదయం ఒక కార్యాలయానికి వెళ్లాను. ఆఫీసు యజమాని గుమాస్తాను పిలిచి ఇవాళ ఎంత తారీకని అడిగాడు. ఆ గుమాస్తా అదృష్టము కాస్త వక్రించడంవల్ల ఆరోజు తారీకు గుర్తుకురాక గోడనున్న క్యాలండరు చూసి, అందులో శాలివాహన శకం ప్రకారం వేసిన తేదీలు పెద్ద అంకెలతోనూ, యింగ్లీషు తేదీలు చిన్న అంకెలతోను అచ్చువెయ్యబడి ఉండడంనుంచి శాలివాహనశకం తేదిని ఇంగ్లీషు తేదీక్రింద తకీమని చెప్పడం—ఆఫీసు యజమానికి తపీమని కోపంవచ్చి, "ఫూల్, బ్లాక్ హెడ్ అని ఆశీర్వచనాలు ప్రారంభించడం జరిగింది, అప్పటికి అతనికి సరియైన తారీకు జ్ఞప్తికి వచ్చేసింది కామోసు.

బంట్రోతుని నమ్మని ఒక ఛోటా ఆఫీసరు కూరలు కొనుక్కుందికి తనే స్వయంగా బజారుకు బయలుదేరి తనకు కావలసిన కూరగాయలు తీసుకుని, డబ్బు నయాపైసాల్లో యివ్వబోతే, ఆ కూరలమ్మే ముసలిది నయాపైసాలు పుచ్చుకుందికి నిరాకరిస్తే, యీ ఛోటా ఆఫీసరు అలా నయాపైసాలు పుచ్చుకోకపోతే వచ్చే ప్రమాదాన్ని ఉపన్యాసం క్రింద వెళ్ళబోస్తూంటే, పదిమంది చేరటం, అమాంతంగా రెల్లిముసలమ్మకు కోపము వచ్చి చోటా ఆఫీసరు చేతిలోని సంచీని లాక్కొని కూరగాయల్ని గంపలో వేసుకుని నాలుగు ఆశీర్వచనాలతో కాళీసంచీని అతని ముఖంమీదికి విసరడం, నలుగురూ నవ్వడం, అతను లోలోపల ఏడవడం, ఇదంతా నేను ప్రత్యక్షంగా ఒక ప్రేక్షకుణ్ణై చూడటం ఒక గంటక్రితమే జరిగింది. చూసారా సోదరులారా! యింకా గమ్మత్తు; రెండణాలక్రింద మనం యిస్తే పదమూడు నయాపైసాలు, మన కెవరయినా యిస్తే పన్నెండు నయాపైసాలు. ఏ అణాలకి ఎన్ని నయాపైసాలని ఎవరయినా అడిగితే దిక్కులు చూడాలి. ఇది పరిస్థితి. కాలం మారిపోయింది. నాణెం మారిపోయింది. భూమి గుండ్రంగా వుందో బల్లపరుపుగా వుందో తెలియదు కాబట్టి, ఇక దిక్కులు కూడా తెలియవు కాబట్టి—ఒక ఇంగ్లీషు తేదీల క్యాలండరూ, ఒక శాలివాహన శకం క్యాలండరూ, యీ రెండూ కలిపి వేసిన మొత్తం క్యాలండరూ, నయాపైసాల జంత్రీ, అట్లాసూ, మేగ్నటిక్ కంపాసూ లేనిదే ఇక ఎవరూ వీధిలోనికి బయలుదేరకండి..."

"ఇదేనా మీరు కనిపెట్టిన విషయం" ఒక శ్రోత

"కాదు కాదు...అది చెప్తున్నాను—ఇదంతా చూస్తూంటే నాకూ ఒక కొత్త ఆలోచన తట్టింది. మనం ఇప్పుడు అనుసరిస్తున్న కాలమానం రాత్రి పన్నెండు గంటలతో ప్రారంభం అవుతోంది. ఇది పాశ్చాత్య సాంప్రదాయం. మన హిందూదేశానికి కాలమానం సూర్యోదయంతో ప్రారంభం అవుతుంది. మనం కొత్త కాలమానం ప్రారంభిద్దాం. మనకు సరాసరి సూర్యోదయం ఆరు గంటలకి అవుతుంది. అప్పుడు సరిగ్గా పన్నెండు గంటలుగా మీ వాచీలు దిద్దుకోండి. ఇందువల్ల మీకేం ప్రమాదం లేదు. ఇప్పుడు మీ వాచీలలో ఆరుగంటలయి వుంటుంది నా కొత్తలెక్క ప్రకారం ఇప్పుడు సాయంత్రం పన్నెండు గంటలు..."

"చాల్ చాల్లేవయ్యా! మహా గొప్పది

వెదకబోయిన తీగ

ప్రియ వనజకు — గుంటూరు.

అంతా క్షేమమే. నేను ఎప్పుడూ నిన్ను గురించే ఆలోచిస్తుంటాను. ఎన్నో మనస్తత్వశాస్త్రాలు చదివాను, వ్యక్తుల మనస్తత్వం గూర్చి నాకు బాగా తెలుసు కాని ఈనాటికీ నీ మనస్తత్వం నాకేమీ బోధపడలేదు. రోజూ నీ విషయమే ఆలోచిస్తుంటాను ఎప్పుడూ నీ మనస్సుగురించే చర్చించుకుంటాను—కాని అంతా అగమ్యగోచరంగా ఉంది. ఎన్నిసార్లు ప్రశ్నించినా మీనాన్న, అమ్మగార్ల పేర్లు తెలుపకపోవటం నాకు చాలా వింతగా గోచరిస్తుంది. ఎన్నాళ్ళీ దాగుడుమూతలు? తొందరగా మా అన్నగారికి చెబుదామన్నా నీ వివరాలు పూర్తిగా నాకు తెలియవాయె! ఇకనైనా బాగా ఆలోచించుకుని వివరాలు తెల్పుతావని విశ్వసిస్తున్నాను. ప్రత్యేకంగా ఈవిషయం కొరకే జాబు వ్రాస్తున్నాను. ఇంతే సంగతులు.

నీ
శేఖర్ ...

* * *

ప్రియ శేఖర్ కు,— విజయవాడ,

నీ జాబు చేరింది అంతా క్షేమమే. ప్రస్తుతం నా పూర్తి వివరాలగూర్చి మీరంతగా ఆతురత పడవద్దు. నావిషయం నీకు పూర్తిగా తెలుసు. ఇక మా నాన్నగారి చిరునామా కొరకు నీవింత తొందర పడటం దేనికి? ప్రస్తుతం మీ అన్నగారికీవిషయం మరుగు పర్చటం మంచిది. మనమెంత గుట్టుగా పోతే అంత మనకే మేలు. అనవసరంగా ఈ విషయం కొరకు గాభరా పడకండి. మళ్లీ మన మెప్పుడు కలసికొంటామో, ఆ తీయని ఘడియల గూర్చి ఆలోచించండి-ఇంతేసంగతులు.

మీ
వనజాక్షి.

* * *

ప్రియ వనజకు,— గుంటూరు.

వనజా...ఈ ఉత్తరం వ్రాసేటప్పుడు పూర్తిగా నీగురించి ఆలోచిస్తూ వ్రాస్తున్నాను. కాని ఎంత ఆలోచించినా కనబడేది ఒక్కటే మార్గం. అది "నిదానమే: ప్రధానం." కొంచెం నిదానిద్దా మనుకుంటాను కాని అది అంత తేలికగా అయ్యే పనిలా కనపడలా నాకు. దాదాపుగా మనం విడిపోయి రెండు వారాలు కావస్తుంది. రోజూ నీగురించే మధుర స్వప్నాలు... అబ్బా...వర్ణించాలంటే కాగితాలు చాలవు. అది కాకపోయినా ఈ ఉత్తరం ఎవరిచేతిలో పడుతుందోనని నీభయం. అంతభయం పనికిరాదు. పిరికిదానా! ధైర్యంగా వుండు. మనల్నెవరూ వేరు చేయలేరు. మనమిద్దరం ఒకరికొరకొకరం జన్మించామన్నమాట మరచిపోకు—ప్రళయం వచ్చినా, భూమి బ్రద్దలయినా, ఆకాశం ఒరిగినా, మనల్ని వేరు చేయలేదు.

"దత్తశ్రీ"

ఈ పాడు లోకంలో చవటలు చేరి 'ప్రియుడు' అన్న పదానికి అర్థం చవట అని కోడైకూశారు. వాళ్లు ఒక్కొక్కళ్లుగా ఎదురైతే ఏం చేసేవాణ్ణో నీకే తెలుసు. అందరు ప్రియుళ్లు మాటలతో మోసం చేస్తున్నట్లు నిన్నుగూడా మోసం చేస్తున్నాననుకోకు. చేతలతో తప్పక ఈ కార్యం సాధించి లోకానికి మరో నమ్మకం తప్పక కల్గిస్తాను. ఇప్పటికే భారతం అయింది. ఇక ఉంటా. త్వరగా జవాబు వ్రాయి. ఇంతే సంగతులు.

నీ
శేఖరం

* * *

ప్రియ శేఖర్ కు,— విజయవాడ.

ఇక్కడ పరిస్థితులు ప్రస్తుతం బాగానే వున్నాయి. మీరావుత్తరం ఏ శుభ ఘడియన వ్రాశారో గాని, మా యింటి ఫ్యూను నా అడ్రసుది నాకిచ్చాడు. కవరుచించి కాగితం తీసి రెండు లైను చదివానో లేదో! ఎక్కణ్ణించి వచ్చిందో మా చెల్లి "ఏమేవ్ బావ వ్రాశాడా" అంటూ దీర్ఘంతీసి "అమ్మని పిలవనా" అంది. దాన్ని బతిమాలి ఊరుకోపెట్టేటప్పటికి తలప్రాణం తోక్కవచ్చింది. ఇంతకీ మీరు వ్రాసిన ఆ నీలం కాయితం చేసిందీ పనంతా. అదలా వుంచండి! మీరు మీ నిజాయితీ గురించి కోశారే దాన్లో చాలా ఘాటయిన మాటలు పడ్డాయి. నిజంగా అంత నిజాయితీపరులేమో చూస్తాగా? ప్రత్యేకంగా యింకేమి సంగతులు లేవు, ఇక వుంటా!

మీ
వనజాక్షి.

* * *

ఒంగోలు.

ప్రియమైన తమ్మునికి—,

నీ అన్న ప్రభాకరం వ్రాయున దేమనగా ఇక్కడ అంతా క్షేమమే, మీ వదినా పిల్లలూ అంతా బాగానే ఉన్నారు, రామం ఎప్పుడూ "బాబాయి ఎప్పుడొస్తాడే అమ్మా?" అని అడుగుతుంటాడు. నీ వక్కడ బాబాయి వాళ్లింటివద్ద ఉంటున్నట్లు వ్రాశావు. శెలవుల్లో గూడా అక్కడే ఎందుకు ఇక్కడకు రాక. వాళ్లసలే మంచి మనుషులు కారు, నీదా మాటపడే గుణం కాదాయె. ఎందుకు అనవసరపు తగాదాలు? వీలయినంత త్వరగా రావటానికి ప్రయత్నించు, అది అలా ఉంచి నేనీ మధ్య ఒక శ్రోత్రవార్త విన్నాను. నీవు ఒక అమ్మాయిని ప్రేమించి ఉత్తరాలు జోరుగా వ్రాస్తున్నావట. మీ వ్యవహారం చాలా మట్టుకు ఒచ్చిందని విన్నాను. అదెంత నిజం? నిజమయితే పిచ్చి పిచ్చి వేషాలేయక ఇకనయినా ఆ అమ్మాయితో సంబంధం

కనిపెట్టేశావ్" ఒక శ్రోత కూత.

"క్షమించండి శ్రమ యిచ్చినందుకు. నా ఉపన్యాసం అయిపోయింది. ఇక సెలవ్-"

నాకు బుర్ర పనిచెయ్యటం మానేసింది. నిజంగా దిక్కులు కనిపించడంలేదు. ఒక అట్లాసూ, మేగ్నటిక్ కంపాసూ ఉంటే బాగున్నేమో చేతిలో—యీ సాయంత్రం పన్నెండుగంటల వేళలో. ★

★ వెదకబోయిన తీగ ★

దూనుకో. ఇది నీకు వ్యంగ్యంగా వ్రాస్తున్న జాబులా పరిగణిస్తే ప్రమాదం! నీకు తగిన సంబంధం నిశ్చయించే వాళ్లేం మేమున్నా మన్నమాట మర్చిపోకు. ఇంతే సంగతులు, వెంటనే జాబు వ్రాయి.

నీ అన్న,
ప్రభాకరం.

* * *

గుంటూరు.

ప్రియమైన అన్నకు—,

నేనిక్కడ క్షేమంగానే ఉన్నాను. మీ క్షేమ సమాచారం బాగానే ఉందని విశ్వసిస్తున్నాను. ముఖ్యంగా వ్రాసే దేమంటే నాకు నచ్చిన పిల్లను నేనేనాడో నిర్ణయించుకున్నాను. కనుక మీరు నా పెళ్లి విషయం తొందర పడవద్దు. పిల్లను పెళ్లి చేసుకునేది నేను. ఆమె బాగోగులు నేనేనాడో పరీక్షించే నిర్ణయం చేశాను. ఇక కులం. ఈ కాలంలో కులం మాట నాకనవసరం. అయినా మీ తృప్తి కొరకు ఆ పిల్లది మన కులమే అని చెప్పగలను. నాకు ఆ సంబంధం కాక వేరే సంబంధం మీరు చేయలేరు.

నీ తమ్ముడు,
శేఖరం.

* * *

ఒంగోలు.

ప్రియమైన తమ్మునికి—,

అంతా క్షేమం. మేము నీకు క్రిందటి సంవత్సరమే వివాహం నిశ్చయించి ఉంచాము. కట్నాలూ, కానుకలు అప్పుడే మాట్లాడాం. వాళ్లు మనకు కొద్ది బంధువులు కూడా. ఈ విషయం నీతో చెపితే నీవు అప్పుడే ఎందుకన్నయ్యా అంటావని నాకు తెలుసు, నీవు దేశోద్ధారకుడవు కదూ! నీ ప్రజ్ఞ ఇక్కడే తెలుస్తుంది, నీ విప్పుడా సంబంధం కాదంటే ఎలా! ఇప్పటికే అమ్మాయి కెన్నో సంబంధాలువచ్చాయి కాని నీ వలన అవన్నీ వాళ్లు తిరగగొట్టాగు. ...లో నీవు కాదంటే మళ్లా ఆ పిల్ల పెళ్లి జన్మకు కాదని ఒక్కసారయినా ఆలోచించావా? నేనిక వాళ్లి నాన్న ముఖం

లా చూడను? అన్నీ మళ్లా ఒకసారి బాగా లోచించుకో. నీవు ఎన్ని చెప్పినా ఈ సంబంధమే ఖాయం. ఇంతే సంగతులు, ఇక ఉంటా.

నీ అన్న,
ప్రభాకరం.

* * *

గుంటూరు.

ప్రియ వనజకు—,

వనజా — ఇక్కడి పరిస్థితులు విషమిస్తున్నాయి. మా అన్న పెళ్లి విషయం పదే పదే జాబు వ్రాస్తున్నాడు. ఆయనసలే, పట్టుదల మనిషి. అన్నంతా చేసితీరుతాడు. ఎక్కడో సంబంధం కూడా మాట్లాడానని వ్రాస్తున్నాడు. ఏ మాత్రం ఆలసించినా అమృతం విషమౌతుంది. త్వరగా మీ నాన్నగారి పేరు మొదలయినవి వ్రాసి పంపు. తరువాత నా బాధ నే పడతాను. నిన్ను మాత్రం విడువను. నేను మాటల ద్వారా, వ్రాత మూలకంగా చేసిన ప్రతిజ్ఞ అక్షరాలా నిర్వహిస్తాను. అన్ని విషయాలు పూర్తిగా ఆలోచించి త్వరగా మీ నాన్నగారి అడ్రసు పంపు-ఇక ఉంటా.

నీ,
శేఖరం.

* * *

విజయవాడ.

శేఖర్ కు—,

నీ జాబు చేరింది విషయాలు అమూలాగ్రంగా గ్రహించాను, నీవింత పిరికి వాడివని కలలోనయినా తలంచలేదు. ఈనాడు నీ పరిస్థితి పూర్తిగా అవగాహనం చేసుకున్నాను. మీ అన్నకు ఖచ్చితంగా జాబు వ్రాయలేక పోయావా? మీ అన్న ఇంకా కొంచెం తొందర పెడితే ఆ సంబంధానికి ఒప్పుకుంటావన్న మాట. ఇన్నాళ్లకు నీ బలహీనత పూర్తిగా అర్థమయింది. మీ బాబాయిగారమ్మాయి నీ పెళ్లి ఈ శెలవుల్లోనే నని జాబు వ్రాసింది. ముఖ్యంగా వ్రాసేదేమిటంటే ఆ అమ్మాయితో సుఖంగా కాపరం చెయ్యి. ఇక నాకు ఉత్తరాలు వ్రాయబోకు నా పూర్వపు అడ్రసుకు వ్రాసినా ఫలితం శూన్యం. నీమోసం పూర్తిగా అర్థమయింది ఇక శెలవు!...

ఇట్లు
వనజాక్షి.

* * *

ఒంగోలు,

ప్రియమైన తమ్మునికి,

అంతా క్షేమం. ప్రస్తుతం నీపని మీదే ఉన్నాము, పెండ్లి పనులన్నీ పూర్తి అయ్యాయి. పందిళ్ళు ఇప్పుడే వేస్తున్నారు. నేను ఓ పదిహేనురోజులు శెలవుపెట్టాను. నీ ఇష్టప్రకారమే చేద్దామనుకున్నాను; గాని అవతలవాళ్లకు మనకూ బీరకాయపీచు బంధుత్వం ఉందట. ఈ సంబంధం తెగతెంపులు చేసుకుంటే, దానివలన మనకు చాలా బంధుత్వాలు దూరమౌతాయి. ముఖ్యవిషయం పిల్లరంగు పసిడిరంగు; రూపురేఖా విలాసాల్లో ఊర్వశి, విద్యలో సరస్వతి, గుణంలో సావిత్రి-ఈజన్మకి ఇవి చాలు, నేను అన్నీ ఆలోచించాను. నాకు తెలుసు. నీవు తప్పక ఆసంబంధం మానుకుంటావని, ఈ జాబు 'టెలిగ్రాం'గా భావించి చదివినవెంటనే బయల్దేరు. బాబాయివాళ్ళు గూడా నీతోపాటే బయల్దేరుతారు. ఇక్కడ నీతో చాలా పనులున్నాయి. వెంటనే బయల్దేరు.

నీ అన్న
ప్రభాకరం.

* * *

ప్రియమైన అన్నగారికి, గుంటూరు

వెంటనే బయల్దేరుతున్నాను. ఆ సంబంధం నాకు వద్దు. అక్కడ పరిస్థితుల విషయాం మాట్లాడతాను. ఇంతే సంగతులు,

నీ తమ్ముడు,
శేఖరం.

* * *

ప్రియమైన శేఖర్ బావకు,

నీవు ఇంత మోసగాడివని తలంచలేదు... ముఖ్య విషయం నాకు పెండ్లి నిశ్చయమై దాదాపుగా సంవత్సరం అయింది. వరుడి పేరు వెలగా శేఖరం. వారి అన్నగారి పేరు వెలగా ప్రభాకరం వారిది ఒంగోలు.

ఒకరోజు నీవు, నేను రైల్లో కలిసికొన్నాము. అప్పటికి దాదాపుగా నా సంబంధ నిశ్చయమై ఒకవారంరోజులు గడిచాయి. అప్పుడే నీ పూర్తి వివరాలు సేకరించి నీవే కాబోయే వరుడవని నిశ్చయించుకున్నాను. అందుకే ఆ వేళ మనం చాలా చనువుగా ప్రవర్తించాం. ఇక నేను ప్రస్తుతం వధువును. ఇప్పుడు నీకు ఉత్తరం ఇచ్చిందే మా చెల్లి కమలం. ఇక గాని అదనీ చెవులు సులపదు. నాకు ఒక వ్యక్తిని ఆటలు పట్టించటమంటే సరదా. అందుకే ఇన్నాళ్లుగా నీతో ప్రేయసిగా నటించాను, ఇప్పటికయినా అర్థమయిందా, ఇంకా వ్రాయాలా? సరే చెపుతా విను. నా పేరు వనజాక్షి. ఇక మీ కాబోయే మామగారి పేరు, అంటే మా నాన్న అన్నమాట, రమణయ్య. మా అమ్మ పేరు శ్యామలాదేవి, కథ అర్థమయిందిగా. ఇక ఆతురత మాను—ఉంటా—

మీ
కాబోయే అర్ధాంగి
వనజాక్షి.

* * *

"హారి వనజాక్షీ,, వనజ,, ఇంకా రెండు పేర్లు పెట్టుకోకపోయావా...ఎలా నయితే నేం నా ప్రతిజ్ఞ నెరవేర్చుకున్నాను వెదకబోయిన తీగే కాలికి చుట్టుకుంది" అనుకున్నాడు శేఖరం. ★

అసంప్రేక్ష్యకారిత్వము... పంచతంత్రము
...ఆరువదవ భాగము





నండూరి. రామమోహనరావు
బొమ్మలు... బాపు
ఎంతేటి వెండియె చూచితిరా! ఇంతటితోనిక మరలుదము అందరమూ ఇది పంచుకొని ఉందము హాయిగ కలకాలం
బంగారము తాపొచ్చినచో అంగారమె కద ఈ వెండి! ఒంటిగ నేనే మరలుమయా జంటగ ముందుకె పోదుమయా
ఇరువురు ముందుకు చనుచుండ మరియొక తూలిక తూలినది తూలిన తావున తక్షణమే నేలే పసిడిగ మారినది
దొరికినదయ్యా బంగారం! చెరిసగమూ ఇది పంచుకొని ఇహమూ పరమూ చూరగొని మహారాజుల వలె బ్రతుకుదము
బంగరు చూచే చూచుటతో లంగరు పడినదా కోర్కెలకు! మరి కొంతేగెద నొంటరిగా దొరకును మణులో, రత్నాలో!
పెన్నిధి కోసము పేరాసన్ ఆ నగ భూముల నతడేగన్ గుండెలు జల్లని తల్లడిలన్ కొందొక దృశ్యము కానబడెన్

మోసం చేసిన మోహన్ కోటు


నిద్రనుంచి లేచేటప్పటికి సాయంత్రము 4 గంటలయింది. శారద టేబిల్ మీద కాఫీ తెచ్చిపెట్టింది. ఆలోచనలో నిమగ్నుడైన మోహన్ కాఫీ త్రాగలేదు. తాను చేసిన ఉద్యోగప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. ఇంటర్వ్యూలేవీ ఫలించలేదు. డబ్బంతా వృథా అయింది. "దీనికి కారణమేమిటి? నాకు తగిన చదువు లేకా...పర్సనాలిటీ లేకా... సరియైన సిఫార్సు లేకా? శారద కాపరానికి వచ్చి సంవత్సరముపైగా అయింది. నేను ఏదో పెద్ద ఉద్యోగస్థుడనవుతానని మావాళ్లు నాపై కొండంత ఆశ పెట్టుకున్నారు. వారి ఆశలు నిరాశలు అవుతున్నాయి" అని అనేక ఆలోచనల్లో పడ్డాడు మోహన్. "ఏమండీ! ఇంకా కాఫీ త్రాగలేదా! ఏమిటీ తీవ్రంగా ఆలోచిస్తున్నారు? ఎందుకలాగున్నారు?" అని శారద భర్తవద్దకు వచ్చింది. "కొంచెం తలనొప్పిగా ఉంది, శారదా" అంటూ తల పట్టుకున్నాడు. "శారదా, మీ అన్నయ్య ఎప్పుడు వస్తాడన్నావ్? సంక్రాంతికి మీ వూరు వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నావా?" అని అడిగేడు మోహన్. "శారద నవ్వుతూ. మొదటనుంచీ మన రష్తా ఒకే రకంగా ఉందండీ నన్ను ఏడ్పించాలనా మీ ఉద్దేశము? సంక్రాంతికి మీరు రారా? మీకు కట్నాలు అవసరంలేదు కాబోలు?" "నీవు వెళ్ళడము తప్పనిసరి. నేను నిరుడు వచ్చేను. మరి ఈ ఏడు నేను రానిశ్చయించలేదు" అని మోహన్ చెప్పగానే "మీరు తప్పకుండా ఈ సంవత్సరము కూడా రావాలి. రాకపోతే నేను ఒప్పుకోను" అంటూ మోహన్ భుజము కుదిపింది, శారద.

గుడిపూడి కామేశ్వరి

మధ్యతరగతి కుటుంబానికి చెందినవాడు మోహన్. తండ్రి చిన్నతనములోనే చనిపోయేడు. తమకున్న కొద్దిపాటి భూమిని అమ్మి తల్లి చదువు చెప్పించింది. మోహన్ బి. ఏ. ప్యాసు అయేడు. వెంటనే అనేక సంబంధాలు వచ్చాయి. ఆనందపురం గ్రామంలో గోవిందయ్యగారి కూతురు శారదనిచ్చి వివాహము చేసేరు. మోహన్‌కు కుటుంబ బాధ్యత పెరిగింది. తమతోపాటు తన తల్లిని ఇద్దర చెల్లెండ్రనుకూడా పోషించవలసినదే కదా!

తెల్లవారింది. సూర్యకిరణాలు కిటికీలోంచివచ్చి గాఢనిద్రలోనున్న మోహన్‌ను మరింత జోగొట్టుతున్నాయి. బస్సుదిగి సూర్యం వచ్చేడు. అంతా పలకరించేరు. శారద గదిలోనికివెళ్ళి "ఇంకా పడుకున్నారేమిటండీ? లెండీ, మా అన్నయ్యవచ్చేడు" అని లేపింది. వెంటనే లేచి సూర్యాన్ని కుశలప్రశ్నలు వేసాడు. "ఏం బావా, నీ ఉద్యోగ ప్రయత్నాలు ఏమయాయి? మొన్నను ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజి ఆఫీసులో నీపేరు రిజష్టరు చేయించేవుకదా, ఏదైనా వచ్చిందా?" అని ప్రశ్నించేడు. మోహన్ తలదించుకొని "మూడు నాలుగు ఉద్యోగాలకు దరఖాస్తులు పెట్టేను. ఏదో ఒకటి తగలవచ్చును" అని జవాబిచ్చేడు. వారు మరేమి మాట్లాడక కాఫీ త్రాగి బజారుకు బయలుదేరారు. మెయిన్‌రోడ్డులోనున్న ఒక బట్టల దుకాణంలోనికి వెళ్లేరు. చీరెలు, జాకట్టుగుడ్డలు చూచేరు. మోహన్ తన తల్లికి, శారదకు, చెల్లెండ్రకు బట్టలు పండుగకు కావాలని అనుకున్నాడు, కాని జేబులో పదిరూపాయలుమాత్రమే ఉన్నాయి. "ఏమిటి చూస్తున్నావు బావా? కావలిసిన బట్టలు అన్ని వేరెపెట్టు" అన్నాడు సూర్యం. "వాళ్ళకు బట్టలు నచ్చుతాయో నచ్చవో అని, సంకోచిస్తున్నాను" అన్నాడు మోహన్. అన్నిటికి ఒకే బిల్లేనండీ?" అని శెట్టి అడగ్గానే మోహన్ బట్టలు వేరుచేసి "వీటి బిల్లు వేరు, వాటి బిల్లు వేరు" అని అనగానే "ఒక టేబిల్లు అన్నిటికి రాయవయ్యా" అంటు సూర్యం హెచ్చరించేడు. మోహన్ మరి మాట్లాడలేదు: మనస్సులో సంతసించేడు. అందరిని పండుగకు రమ్మనమని ఆహ్వానించి సూర్యం, శారదను తీసుకొని ఆనందపురం చేరేడు.

పండుగకు రెండు రోజులే వున్నాయి. ఇంతలో ఉదయం పోష్టువాడు ఒక కవరు తెచ్చిఇచ్చేడు. కవరు విప్పిచూడగానే తాను వెళ్ళిన సర్వీసు కమిషను పరీక్షలో ఉత్తీర్ణుడైనట్లును తనను కర్నూలు, ఇంటర్వ్యూకు రమ్మనమన్నట్లు తెలుసుకున్నాడు. ఈ విషయము తల్లితో చెప్పేడు. తల్లి సంతోషించి "నాయనా! మన కష్టాలు గట్టెక్కాయి" అంది కంటినీరు తుడు



ఉంటూ "అమ్మా అప్పుడే కాలేదు నేనుదీనిలో కూడా ప్యాస్ అవాలి తెలుసా?" అన్నాడు మోహన్. "భయములేదు అయినా తప్పకుండా పరీక్షవుతావని నమ్మకముంది నాకు. మీ నాయన మహా ఉత్తములు. వారుచేసిన పుణ్యము మనకు ఫలిస్తుంది" అంటూ తల్లి తిరిగి సమాధానం ఇచ్చింది. చెల్లెళ్లిద్దరూ వీథి అంతా చాటారు, అన్నయ్యకు కర్నూలులో ఉద్యోగము వచ్చిందని. ఊరివాళ్లకు సమాధానం చెప్పేసరికి తలప్రాణం తోకకు వచ్చింది మోహన్‌కు.

'పండుగకు అత్తగారింటికివెళ్ళే ఉద్దేశము లేదు మోహన్‌కు. రానూ పోనూ వాళ్లకు బోలెడు ఛార్జీలు ఉండాలి. తన వద్ద డబ్బు లేదు. కాని, మరి ఇంటర్వ్యూకు వెళ్ళటానికి డబ్బు ఎలాగు వస్తుంది? ఆఖరుకి చెల్లెండ్ర గాజులు నాలుగు కూడా తాకట్టు పెట్టేడు. మరి డబ్బు వచ్చే మార్గంలేదు. కాబట్టి, కట్నం గురించి అయినా సంక్రాంతికి ఆనందపురం వెళ్లాలి కదా అని ప్రయాణానికి నిశ్చయించేడు.

అలుడు సంక్రాంతికి ఒకరోజున ముందుగా నేవచ్చినందున గోవిందయ్య అతనిభార్య అమ్మన్న అంతమంది సంతసించేరు. "ఏమిటి వింతలు మోహన్" అని అడిగేడు గోవిందయ్య. "మరేమిటున్నాయి. అంతా కులాసాగా ఉన్నారు" అంటూ "నేను సర్వీస్ కమిషన్‌పరీక్షలో ప్యాసయ్యేను వారంరోజులలో కర్నూలుకు నన్ను ఇంటర్వ్యూకు రమ్మనమని కాగితం వచ్చింది" అని చెప్పేడు మోహన్ "సరేబాగుంది కాని నీవువెళ్ళేప్రయత్నంలో ఉన్నావా లేదా?" అని గోవిందయ్య అడిగేడు. మోహన్ జవాబు ఇవ్వకుండా నే "నాన్నా, నేను వచ్చేటప్పటికే అన్ని సిద్ధం చేసేరు" అంటూ శారద చిరునవ్వు నవ్వింది. మోహన్ ఆవిషయం గ్రహించేడు.

ఆనాడు సంక్రాంతి పండుగ ఉదయం అభ్యంగన మొనర్చి బట్టలువేసుకొని కూచున్నాడు మోహన్. సూర్యంవచ్చి మోహన్ ముఖమునకు బొట్టుపెట్టి నూరు రూపాయలు కాగితం ఇచ్చేడు. రాత్రి శారదతో "శారదా! గత సంవత్సరము రూ. 50 ఇచ్చేరు కదా. మరి ఈయేడు రూ 100 లు కట్నం యిచ్చేరెందుకు?" అని అడిగేడు మోహన్. "వచ్చేయేడు రూ 200 ఇస్తారు" అని నవ్వుతూ అంది శారద. "నీమాటలు నాకు అవగాహన కాలేదు." అని చిరాకుగా అన్నాడు మోహన్. "ఎందుకు అవుతాయి. ఉద్యోగము లేనంత కాలము మన బాధ్యత మా వాళ్ళపైకూడా పడిందికదూ" అని సమాధానం ఇచ్చింది. మరి నీవు చింతించనవసరం లేదు ఈసారి తప్పకుండా నేను సెలక్టు అవుతాను, అంటువుండగానే ఎవరో లోపలినుంచి పిలిచేరు. శారద వెళ్లిపోయింది: మర్నాడు

★ మోసంచేసిన మోహన్ కోటు ★

ఉదయం మోహన్ శారదను తీసుకొని విజయ నగరం చేరేడు. ఇంటివద్ద తల్లివాళ్ళకు సాయము ఉండాలని శారదను మరి ఉంచ లేదు.

"నేను ఇంతకాలము ఇంటర్వ్యూలలో నెగ్గకలేవడము నాకు, అర్హతలేక గాదు, ఉర్సునాలిటీ లేక కాదు. దానికి ఒకటే కారణము. వేషంలేక వేషంలేకుండా భాష ఉన్నా రాణించదు, భాష లేకపోయినా వేషం ఉంటే బ్రతుకు తెరువు వుంటుంది. అప్పుడు మన ప్రయత్నాలు ఫలిస్తాయి" అని ఒక నిర్ణయానికి వచ్చాడు. మోహన్ డబ్బు ఖర్చయినా ఈ తరుణం మించకుండా తనకిచ్చిన కట్నంలో ముప్పయి ఇచ్చి మంచి లేతానుపచ్చకోటు కొన్నాడు. ఇటుపైని ఇంటర్వ్యూలకు ఈకోటు తొడుక్కొని వెళ్ళా లని నిశ్చయించేడు. ఎరువుకోటుల ప్రారబ్ధం తప్పింది.

కర్నూలులో ఇంటర్వ్యూబోర్డుముందు హాజరయ్యాడు మోహన్. ఇంటర్వ్యూ పూర్తి అయింది. అంతమందినీ ఆకోటు ఆకర్షించింది. తప్పకుండా తనను సెలక్టు చేస్తారని ధైర్యంతో తిరిగి ఇల్లుచేరాడు.

......నెలగడిచింది......రెండు నెలలు పూర్తి అయేయి...పక్కింటి రామావతారానికి ఆర్డర్సు వచ్చేయి. మోహన్‌కు మాత్రము రాలేదు. చాలా దిగులు చెందేడు. "గోరు చుట్టుమీద రోకటిపోటు" అన్నట్టు తన బాధతో పాటు పూర్వం అమ్మలక్కలకు సమాధానాలు చెప్పకొనేసరికి చాలా బాధ అవుతూవుంటేది. విసుగులోను విచారములోను బాధపడుతున్నాడు; కాని మనోధైర్యము పోగొట్టుకొనలేదు. ఎప్పటికైనా తన పచ్చకోటులోనే పరీక్షలో నెగ్గాలని పట్టుదల హెచ్చింది. రోజాలు గడుస్తున్నాయి. లాండ్రీకి వేసిన కోటును జాగ్రత్తగా దాచేడు. ఇంటర్వ్యూ సమయాలలోతప్ప మిగతా సమయాలలో దానిని వాడదలచలేదు. అంతలో ఆ వూరిలో ఇన్స్పెక్టెన్సువారు ఆర్గనైజర్లను వేసుకొంటున్నట్లు తెలిసి తన కోటు వేసుకొని యథా విధిగా రహదారి బంగళాకువెళ్ళి వారిని కలిసేడు. గంటక్రిందటే అందరిని రిక్రూటుచేసేమని చెప్పేరు. కత్తివేస్తే నెత్తురులేదు ముఖానికి. ఇతని వేషంచూచి వీథివాళ్ళకు, ఇతడు ఎక్కడికో ఇంటర్వ్యూకు వెళ్ళేడని తెలిసింది. ఇంటికిరాగానే చిరునవ్వుతో "ఏమండీ! ఎక్కడికి వెళ్లేరు. అప్పుడే వచ్చేరేమి?" అని శారద ప్రశ్నించింది. "స్నేహితునిదగ్గర పనిఉండి వెళ్లేను" అని తల దించుకొని సమాధానము ఇచ్చేడు. "కాని, మనకుమాత్రం పనిఅయ్యేటట్టులే"దని మెల్లగా అంది శారద. "ఛా, ఇక్కడనుంచి" అని కోపంగా ఇంటిలోకి గంతేడు. శారద చిన్నబుచ్చుకొని ఇంటిలోనికి పోయింది. అమాయకురాలగు శారదను కసరినందుకు పరితపిస్తూ ఉండగానే నిద్రాదేవత జోగొట్టింది......సాయంత్రము 5 గంటలయింది. శారద తెచ్చిన కాఫీ త్రాగి ఆలోచనలు ప్రారంభించేడు. ప్రభుత్వాన్ని నిందించడము మొదలుపెట్టేడు. "ప్రతిసంవత్సరము మన యూనివర్సిటీలు అనేక వేలమంది గ్రాడ్యుయేట్లను తయారుచేస్తున్నాయి. నిరుద్యోగ సమస్యచూస్తే ఏటేటా హెచ్చుతున్నది. దీనిని అరికట్టడానికి ప్రభుత్వము ఏంచర్య తీసుకొంటున్నది? ఉన్న ఆస్తిపాస్తులు అమ్ముకొని చదువుకొన్న నాబోటివాళ్లగతి ఏమౌతుంది? నేను ఏ శాసనసభ్యుడినో లేక లోక్‌సభా సభ్యుడినో అయేమాటుంటే, నాకీసమస్యలోవున్న అనుభవముబట్టి ప్రభుత్వమును బాగా ఖండించే వాడిని" అని అనేక రకాలుగా అనుకున్నాడు.

ఆ మర్నాడు మళ్ళీ పోస్టుమేన్ కవరుతో హాజరు...ఈసారి విశాఖపట్టణము హిందుస్థాన్ షిప్‌యార్డులో గుమస్తా ఉద్యోగము గురించి ఇంటర్వ్యూకు రమ్మనమని. కవరు విప్పేటప్పటికి సంతోషముకన్న దుఃఖము అశాంతి హెచ్చినవి ప్రాణము విసిగింది. ఇంటర్వ్యూలకు వెళ్లే ఖర్చు తన కాలేజి

దుపుకయిన ఖర్చుకు రెండు రెట్లయింది. పోని మానేద్దామనుకుంటే కుటుంబ పోషణ ఎట్లా? "సరే ఏ పుట్టలో ఏపాము ఉన్నదో ఎవరికి తెలుసు" అంటూ పదిరూపాయిలు అప్పుతెచ్చి విశాఖపట్టణానికి ప్రయాణమయేడు. యథావిధిగా తనకోటు వేసుకొని ఉదయమే రైలుకు ప్రయాణమయేడు. ఎదురుగుండా ప్రక్కింటి గోపమ్మ చీపురుకట్టతో గుమ్మము కడగడానికని వచ్చి మోహన్‌ని చూచి "నాయనా! ఇంత ఉదయమే ఎక్కడికి బయలుదేరావు? వెళ్లు వెళ్లు" అంది. ఆమెకు సమాధానము ఇవ్వకుండా కాళ్ళు కడుక్కుందామని ఇంట్లోకి వెళ్ళేసరికి వంటఇంట్లో పిల్లి పాలు త్రాగుతున్నది. దాన్ని తోలి పాదములు కడుక్కుని రైలుకు బయలుదేరాడు. మధ్యాహ్నము ఒంటిగంటకు ఇంటర్వ్యూ చేసే మెంబర్ల ముందు సిద్ధమయేడు. వారు కొన్ని ప్రశ్నలు అడిగిన తరువాత అందులో ఒక సభ్యుడు "అబ్బాయి నీవు ఈమధ్య సింధియా కంపెనీకి ఉద్యోగముగురించి వచ్చేవుకదూ?" అని ప్రశ్నించేడు. "యస్సార్" అని సమాధానము ఇచ్చేడు మోహన్. "అవును నీకోటు చూచి పోల్చేను, జ్ఞాపకము వచ్చింది" అని ఆ సభ్యుడన్నాడు. ఇక నీవు వెళ్ళవచ్చునన్నాడు చైర్మన్. గుండెలు జారాయి. నా గురించి వీడికి ఎలాగు తెలిసింది. సింధియాకంపెనీకి, దీనికి ఏమి సంబంధము లేదే అనుకొంటూ బయటకు వచ్చేడు మోహన్. అంతా అంధకారమయింది. తిరిగి ఏముఖంతో ఇంటికి వెళ్ళడం? మరి మాబాధలు గట్టు ఎక్కవు అని అనుకొంటూ సముద్రములో దూకితే మరి బాధలుండవు, ఆత్మకి శాంతి ఉంటుందని టవున్‌హాలునుంచి సముద్రానికి చేరాడు. ఒడ్డున కూర్చొని ఆలోచింపసాగేడు. తనను నమ్ముకొని ఆధారపడ్డవారిని దుఃఖసముద్రములో ముంచి తాను సముద్రములో పడుట చేతకానిపని అని ఆలోచించి, అటువంటి పనిచేయుటకు ఇచ్చగించలేదు. "ఎప్పటికేనా కష్టాలు గట్టు ఎక్కుతాయి" అనే ఆశతో తిరిగి ఇంటికి వెడదామనుకున్నాడు కాని కోటును మాత్రం తిరిగి ఇంటికి తీసుకొని వెళ్ళకూడదని నిశ్చయించుకున్నాడు. ఈ కోటువల్ల తన ఉద్యోగము రాకపోవడమే కాకుండా చాలా అవమానముకూడా కలుగుతోందని ఎవరు చూడకుండా ఆకోటును సముద్రములో విసిరి గబగబా ఎంప్లాయిమెంటు ఆఫీసు రోడ్డును పట్టేస్తూ, తనకు ఏమైన ఉద్యోగము ఉన్నదేమో తెలుసుకుందామని ఆ ఆఫీసులోకి వెళ్లాడు. అతని కష్టాలు ఒడ్డు ఎక్కేయి. తనను హైదరాబాదులో ఎక్సైజు సబిన్‌స్పెక్టరుగా వేసిన కాగితం తీసుకొని స్టేషనుముఖము పట్టేడు. తాను నమ్మలేకపోయేడు. చావుకు సిద్ధపడితే మేలే జరిగిందని కోటుపోయినా కూటికి దొరికిందనుకుంటూ రైలు ఎక్కేడు.

సముద్రములో తేలుతున్న కోటు చూచి ఎవరో సముద్రములో పడిపోయారని, విశాఖపట్టణంలో పుకారు లేచింది. మనిషి తేలలేదు, కోటును తీసేరు. పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టేరు. ఇంతలో మోహన్ స్నేహితుడొకడు ఆ కోటు చూచి పోలీసులతో అది స్నేహితుని కోటు అని దానిని మోహన్ తొడుక్కొని ఉండగా సాయంత్రము 8 గంటలకు చూచేనని స్టేట్‌మెంటు ఇచ్చేడు. వెంటనే ఇంటికి వైరు చేసేరు. "మోహన్ సముద్రములో కొట్టుకొని పోయినాడు. కోటు తేలింది" అని. వైరు వచ్చేటప్పటికి ఇంటెడుమంది గొల్లుమని ఏడ్వసాగేరు. చుట్టుప్రక్కల అమ్మలక్కలు పరామర్శ చెయ్యడం ప్రారంభించేరు. మోహన్ రైలు దిగి ఇంటికి వస్తూ ఏడుపువిని ఏ విపత్తు వచ్చిందో అనే గాభరాతో మరింత త్వరగా ఇల్లు చేరాడు. "ఏమిటమ్మా" అన్నాడు కన్నీళ్ళతో. అంతా ఆశ్చర్యభరితులయ్యారు. జరిగినదంతా మోహన్ చెప్పేడు. 'మోహన్ కోటు మంచి మోసం చేసిం'దంటూ చుట్టుప్రక్కల వాళ్లు నవ్వుకుంటూ ఎవరిళ్లు వాళ్లు చేరారు. "మంచి పనే చేశావు. భోజనానికి లెండి" అని శారద అనగానే వంట ఇంట్లోకి అంతా చేరారు. ★


పుష్పమువలె...
రెక్సోనాతో మీ చర్మ
సౌందర్యము వికసించును
Rexona
BLENDED WITH CADYL
రెక్సోనా సబ్బులో, కేడిల్ ... చర్మమును పోషించునటువంటియు మీ సహజ సౌందర్యమును బయల్పరచుటకు సహకరించునటువంటియు ఒక ప్రత్యేక నూనెల మిశ్రమము గలదు!
ఇది ఒక్కటే కేడిల్‌తోగూడిన సబ్బు
రెక్సోనా ప్రొప్రయిటరీ లిమిటెడ్ తరపున భారతదేశంలో తయారుచేయబడినది
RP. 148-X52 TL

వనితా లోకం

* అద్దెకొంపలూ — అగచాట్లూ *

ప్రస్తుతం చాలామంది అద్దెయిళ్ళవారు పడుతున్న బాధలు యిన్నీ, అన్నీ కావు. అద్దెలకున్నవాళ్ళను యెన్నివిధాల బాధలు పెట్టి యేడ్పించాలో అన్నివిధాల సొంతయిండ్లవారు ఏడ్పిస్తూనే వున్నారు. అద్దె పుచ్చుకుంటూ (అందులో అడ్వాన్సుగా) కూడా అద్దెవాళ్ళను బాధపెట్టడంలోగల ఆంతర్యం యేమిటో మాత్రం తెలియదు.

"టులెట్" (అద్దెకివ్వబడును) బోర్డు చూచి లోపల ప్రవేశించినవాళ్ళకు కాఫీ వగైరాలతో అతిథిమర్యాద సాగించి, తీరా అద్దెకు ప్రవేశించగానే నానాఅగచాట్లపాలు చేస్తారు.

అద్దెకు ప్రవేశించిన వారం, పదిరోజులు యింటివారు అద్దెవారుకూడా ఏక కుటుంబీకులుగా మసలుతారు. వారియింటి ఫలహారాలు వీరి యింటికి, వీరి యింటి వంటకాలు వారి యింటికి సరఫరా అవుతూవుంటాయి. వారి ఖర్చుమీద వీరు, వీరి ఖర్చుమీద వారు సినీమాలు కూడా సాగిస్తారు.

ఇంక ఇటుపైన చూసుకోండి, ఒకటొకటిగా యింటియజమానురాలు షరతులు మొదలుపెట్టూ వుంటుంది. దాసీదానికి తలుపుతియ్యలేదనో అద్దె వారి అబ్బాయి తమ పక్కవచ్చి తుక్కుపోశాడనో సన్న సన్నగా సాధింపులు ఆరంభమౌతాయి.

నీళ్ళ విషయం ఆలోచిద్దాం. ఇంట్లోపంపు లేకపోతే బాధలేదు, గాని పంపువుంది ఆ బాధ చెప్పనక్కరలేదు. కొలాయి కట్టే వరకు అద్దెవాళ్ళకు నీరు పట్టుకోడానికి అవకాశమే వదలరు. ఇంటివారి స్నానాల దగ్గరనుండీ, బట్టలు వుతుక్కునే పని పూర్తి అయే వరకు అద్దెవారికి బిందెడు నీళ్ళు దొరక్కుండా చేస్తారు.

ఇట్లా నాలుగైదు రోజులుచూచి అద్దెవారు ముందుగా నీరు పట్టుకున్నారో దెబ్బలాట ఆరంభమైందే.

"ఏమండో అంతగా నీళ్లు వాడితే ఎట్లా? నీటిపన్ను యెవరుకడ్తారని, అంతనీరు కావలసొస్తే నూతిలో నీరు వాడుకోండి" అని వుత్తరువు జారీచేస్తుంది యజమానురాలు.

పోనీ దీపాలదగ్గర సఖ్యతవుందా అంటే (విద్యుద్దీపాలు వుంటే) అదిముందరేసున్నా. నీటి తగాదాకంటే కూడా హెచ్చు రగడ లైట్లమూలంగా జరుగుతుంది.

రేడియో గాని అద్దెవారికివుంటే వారిబాధ చెప్పనక్కరలేదు. కొంతమందిముందుగానే రేడియోవుంటే అద్దెకివ్వము"ని నిష్కర్షగా చెప్పివేస్తారు. అదిచాలామంచిదే. రేడియో వేసుకున్నందుకూ, లైట్లకూ ఇచ్చేడబ్బ అద్దెతోపాటే నిర్ణయించుకున్నా తీరా రేడియో పెట్టుకునేసరికి సాధింపు మొదలు పెటారు.

ఎం. లక్ష్మి

ఇంటిలో చేరిన కొత్తలోమాత్రం యింటివారి అబ్బాయిలు, అమ్మాయిలు రేడియో చుట్టూచేరి సిలోను స్టేషను పెట్టమని ఒకరు, మద్రాసుపెట్టమని ఒకరు వేధిస్తారు. రాత్రి అయితే యింటియజమాని ఏమండి న్యూస్ పెట్టలేదా యింకా?" అని అడుగుతారు.

తీరా మొదటినెల కరెంటుబిల్లు కట్టేసరికి అసలురంగు బయటపడుతుంది. (అద్దెవాళ్లు యిచ్చేలైట్లు చార్జీతో యింటివారి ఖర్చుకూడా సరిపోతే ఫరవాలేదులెండి.) ఇంక అక్కడనుంచీ అద్దెవాళ్లు యేసినిమాకో వెళ్లి వచ్చేసరికి మెయిన్ స్విచ్ తీసికొని వుండడమో లేకపోతే రేడియోట్యూను చేసేసరికి అకస్మాత్తుగా రేడియో ఆగిపోడవడం జరుగుతూ వుంటుంది..

ఇవన్నీగాక, పిల్లలు వుంటే ఇక ఆతగాదాలు చెప్పనక్కరలేదు. పెరట్లో పువ్వులు కోశారనో లేక చెట్లు పీకారనో యేదో విధంగా యింటివారు జగడానికితయారౌతూ ఉంటారు.

అద్దెకు ఉన్నవారు సహానం కోల్పోయి యెదురు సమాధానం చెప్తే యిల్లు ఖాళీ చెయ్యమని బెదిరిస్తూ వుంటారు. ఈ విధంగా బాధలుపెట్టే వారేగాక యిల్లు యే పరిస్థితులలోను బాగుచేయించనివారు తప్పుడు రసీదులుయిచ్చేవారు (అంటేరెంట్ కంట్రోలరు ద్వారా పుచ్చుకున్న యిల్లు అయినప్పటికీ), పన్నులవాళ్లు వచ్చినప్పుడు తక్కువ అద్దె యిస్తున్నట్లు చెప్పమని (లేనిచో యిల్లు ఖాళీ చెయ్యమంటారు) వేధించేవాళ్లు యెంతమందో చెప్ప నక్కరలేదు.

తమయింట్లో అద్దెకున్నంత మాత్రంచేత తోటివారిని యీ విధమైన బాధలు పెట్టడంలో గల వుద్దేశ్యాలు తెలియవు. వుద్యోగ రీత్యా ఊరూరా తిరిగేవారికి ప్రతి వూరులోను స్వంతయిండ్లు వుండవుకదా!

ఇటువంటి పొరపాచ్చాలకు కారణం ఒకరిని ఒకరు అర్థం చేసుకోలేక, లేక ఒకరి తప్పులను మరి ఒకరు సానుభూతితో క్షమించలేక, స్వంతయింటి వారిమనే అహంభావముచేత ఇలా చేస్తారుకాబోలు. ఇటువంటి వాటికి నివారణోపాయ మేమిటో! ★

ఉన్నా అవస్థే; లేకున్నా అవస్థే!

చాలా కాలానికి మా వూరు వెళ్లాము. నన్ను చూడటానికి నా చిన్నప్పటి స్నేహితురాలు శారద వచ్చింది. కాసేపు మాటా మంతీ అయాక "నీకు పిల్లలెంత మందే శారదా" అన్నాను.

అదివరదాకా ఉత్సాహంగా మాట్లాడుతున్న దల్లా సగం కృంగిపోయి దమ్మిడీ అంత ముఖంతో, "నాకా భాగ్యం లేకపోబట్టే అయిన వాళ్ళకీ, కాని వాళ్ళకి తేలికై పోయానే. చూడు నిజంగా నాకు మాత్రం ఓ పసిపాప బోసి నవ్వులొలక పోస్తూ తప్పటడుగులతో తిరుగాడుతూ ఉంటే మనసుకు సంతోషంగా ఉండదూ?

ఈ కారణంవల్లనే వారికి కూడా నామీద కొంచెము నిరాదరణ కలుగుతోంది. మా మరిదిగారి పిల్లను పిల్లవాడిని 4 సంవత్సరాలు నుంచి పెంచాము. పిల్లకు అయిదారువేలు ఖర్చుపెట్టి పెళ్ళిచేసి అత్తవారింటికి పంపాము. పిల్లాడు పట్నంలో చదువుకుంటున్నాడు. డబ్బు పంపమని కబురుమీద కబురు పంపుతూంటే కొంచెము జాగ్రత్తగా ఖర్చుచేయి నాయనా "అని మందలించారని కోపము వచ్చింది. వాళ్లి నాన్న దగ్గరకు వెళ్ళి ఈ రోజు మొదలు మా గడప తొక్క నన్నాడట. కన్న బిడ్డ అయితే అలా అనగలడా చెప్పు? మళ్ళా పేమిద్దరం మిగిలాము. నేను బెంగ పెట్టుకున్నానని తెలిసి మా అక్క నన్ను చూడటానికి వచ్చి నాలుగు రోజులుండి తన ఆఖరి పిల్లవాడిని ఇక్కడ ఉంచి వెళ్లి పోయింది. అయిదు సంవత్సరముల రామును చూస్తే నేను ఎంతో మురిసి పోయాను. ఇల్లు కళకలలాడిందని ఆనందించాను. వాడికి కొత్త బట్టలు కుట్టించి, చిన్న మూడు చక్రాల సైకిలు, రంగుల గుఱ్ఱం కొని కొన్నారు మా వారు. ప్రైవేటు మాష్టరు గారు రోజూ వచ్చి చదువుచెప్తున్నారు.

ఇంటి వారమ్మాయి 3 ఏళ్ళ జానకి 2 జడలు వేసుకొని చిన్న ఫ్రాకు తొడిగి మేజోళ్ళు, జోళ్లతో చిన్న చిన్న అడుగులు వేసుకుంటూ వచ్చి "లామూ! ఆలుకుందామా" అనగానే రాము గుఱ్ఱం మీదనుంచి ఒక గంతున ఉరికి వెళ్ళి పోయేవాడు ఆటకి. ఒకరోజున గుఱ్ఱంమీంచిపడ్డాడు రాము. నుదుటి పైన పెద్ద గాయం తగిలి రక్తం కారింది. వాళ్ళ నాన్న గారికి యీ సంగతి తెలిసి వచ్చి రామూని తీసుకు వెళ్ళిపోయారు: ప్రమాదం ఏమీ లేదని చెప్పి కట్టుకడుతూన్నారు డాక్టరుగారు. త్వరలో మానిపోతుందని ఎంత చెప్పినా వినకుండా పిల్లవాడిని తీసుకువెళ్లిపోయాడు వాళ్ళనాన్న. చూడవే మళ్ళీ మామూలే నా సంగతి ఎవరితో చెప్పుకోను. ఎవరికి యెంత సొమ్ము పెట్టినా ఎవరికి యెంత చాకిరీ చేసినా మన బిడ్డలవుతారా? ఎంతసేపు కాలక్షేపం చేసుకున్నా రోజు గడవదు. ఎన్ని పుస్తకాలని చదవను...ఎన్ని అల్లికలు

కె. పద్మజ

కుట్టినా ప్రొద్దుపోదు. నిన్ను చూచి చాలా కాలమైందని యిలావచ్చాను." అని ఊరుకుంది.

"శారదా నీకు ఏమంత కాలం గడచిపోయిందని ఈ బెంగ. భగవంతుని దయవల్ల నీకింత కలిగి ఉంది. కులాసాగా ఖర్చుపెట్టుకోవచ్చు" అన్నాను. "నీకు తెలియదే సంఘంలో పిల్లలుగన్న తల్లికి ఉన్న విలువ. నోములకి, వ్రతాలకి శుభకార్యాలకు అన్నిటికి ముందు పిల్లలగన్న తల్లినే పిలుస్తారు. చివరకు కాసిని బియ్యం పెటవమ్మా నీ చలువైనచేత్తో అని జోలె అడిగికూడా పట్టుకెళ్ళడం మనం చూస్తూంటాము. నీ చేత్తో పిల్లవాడిని ఉయ్యాలలో ఉంచమ్మా అంటారు పిల్లలతల్లిని. ఆఖరికి శకునంకూడా చంకను బిడ్డతో వస్తే చాలా బాగుందని ప్రయాణానికి బయలుదేరుతారు. ఎవరైనా కొత్తవాళ్ళువస్తే మొదటి ప్రశ్న 'నీకెంత మంది పిల్లలు'. అనేగా, ఇంతకీ యెవరి జీవితంలో యే అదృష్టం వ్రాసివుంటే అది జరుగకమానదు. ఇంకోసారి వస్తాలే చీకటి పడుతోంది" అంటూ లేచింది శారద.

* * *

మరొకనాడు భారతియింటికి వెళ్ళాను. "ఏమే భారతీ అంత తీరికలేకుండా ఉన్నావా! మా ఇంటికి ఒకనాడైనా రాలేదు. పోనీ నేనే నిన్ను చూచివద్దామని వచ్చాను. మా ప్రయాణం దగ్గిరకి వచ్చింది నిన్ను చూడకుండా వెళ్ళడం అవుతుందేమో' నని అనుకున్నాను. అంతా కులాసా? ఏమిటి సంగతులు?" అన్నాను.

భారతి యెంతో సంతోషంగా నామీద నీకంత ప్రేమ ఉండబట్టి వచ్చిచూచావు. పాడుదానిని. ఒక్కసారీ మీయింటికి వచ్చి చూచాను కాదు. నా జన్మయింతేనే. ఈ యింట్లో ఒకనాటికంటె ఒకనాడు నరకమై పోతోందే. ప్రతిరోజుకూడా నేను నీ దగ్గరకు రావాలని ప్రయాణమవుతున్నాను. యేదో ఒక ఆటంకంతో సరిపోతోంది" అంది.

నీ కెంతమంది పిల్లలు అన్నాను. భారతి ముఖం ముడిపడింది చిరాకుగా. తన సంగతంతా ఇలా వెళ్ళబోసుకొంది:

"యేం పిల్లలు. ఏం లోకం. ఎవరితో చెప్పుకోను నా బాధలు. దాన్నిబట్టి ఆలోచించుకో నిన్ను చూచేందుకే నాకు వీలుపడలేదంటే. అనుక్షణము నువ్వు నా మనస్సులో, మెదులుతున్నావు. కాని ఏం చేయను. పెద్దపిల్లవాడికి జ్వరం. రెండోవాడు బడినుంచి వస్తూ తోటల్లో పడ్డాడు. కాలు వాచింది. వాడికి వేడినీళ్ళ కాపు వేయటం, తోమటంతో సరిపోయింది ఇక చంటిపిల్ల, ఎడపిల్ల ఎప్పుడూ పేచీకదా! ఏవేళకు ఆ పని కాకపోతే ఆయన కస్సూబుస్సూమంటూరు. నాకు పిల్లలను పెంచడమే చేతకాదనీ, వంట ఆలస్యమైతే భోంచేయకుండా ఆఫీసుకు వెళ్ళిపోతారు. అదే నాకు తగినశాస్తి. అందరూ తినకుండా నేనెలా తినగలను. కాని ఓ నౌకరును పెట్టుకుంటే ఈ సమస్య తీరిపోయేదికదా! పిల్లలను ఎత్తుకుందుకు" అన్నాను.

"సరి. సరి. 100 రూపాయలతో జీవితంలో అతి కష్టంమీద రోజులు నెట్టుకుంటుంటే నౌకరెలావస్తారు. ఇంటి అద్దె పిల్లలచదువులు, రోగాలు, మందులు ఇవి



టేబుల్ క్లాత్ డిజైను — ఎం. జి. కాంతమ్మ.

ఖర్చులే తప్పక పోతుంటే ఇంకా తక్కినవి ఎలా జరుగుతాయిలే. యేమిటో! చూచి చూచి ఆ భగవంతుడు పిల్లల్ని మనకే యివ్వాలి. ఎంతమందో పిల్లలు లేక అలో మంటూ ఏడుస్తుంటేను" అని విసుక్కున్నది. తెల్లవారు ఝామునే లేచి పని తెముల్చుకుందామంటే నాతోపాటే చంటి పిల్ల, ఎడపిల్ల కూడా లేస్తారు. ఏడుస్తే ఆయన చిరాకుపడుతూ సణుగుతూ లేస్తారు. అది మొదలు బడి పిల్లల తొందర. ఆఫీసు తొందర వంటలు, చంటిపిల్లల పేచీలు, స్నానాలు, ముస్తాబులు.

ఈలోగా నేను నీళ్ళుపోసుకోకుండా ఏ బియ్యమైనా తొందరపడి పొయ్యిమీద పెడితే పక్కవాటాలో వున్న వాళ్లెవరో యే కాఫీపొడికో, పంచదారకో వచ్చి అప్పుడే అయిపోతోందమ్మా వంట" అని వాళ్ళకు కావలసిన అప్పు పట్టికెళ్ళి, ఇరుగు పొరుగు వాళ్ళతో, "ఇంత అనాచారపు కొంప ఎక్కడా చూడలేదమ్మా, నీళ్ళుపోసుకోకుండా వంటే?" అని బుగ్గలు నొక్కుకుంటూ చెపుతారు.

ఎన్నని చెప్పేది ఏనాడో నా వీణమూల పడింది. నేనే పత్రిక అయిన ఖర్మంచాలక చదవడానికి తెచ్చుకుంటే అది పేజీ, 16 ముక్కలు కింద చింపుతుంది మా ఎడపిల్ల, ఆ పత్రిక తెచ్చినచోట సిగ్గుపడి ఇక ఎప్పుడూ అడుగలేను. లేసులు, అల్లికలు సరదా ఇదివరకే పూర్తిగా వదులుకున్నాను. ఓ సినిమా అని పేరంటము అని ఏమీ లేనే లేవు. ఉదయాస్తమానాలూ ఇలాగ సతమత మాతూంటే, మా అమ్మవస్తే ఆయనగారు చెపుతున్నారూ: పిల్లను సముదాయించ లేనుట, ఇంటిపనులు చేయలేనుట. అష్టమానం నాకు విసుగు తప్ప మరొకటి లేదుట. బయటి ప్రపంచంలో ఏమి జరుగుచున్నది నాకు అక్కరలేదట. చూడనుట విననుట. తల కూడా తీరుబడి అయిన రోజు నేనెప్పుడో దువ్వుకుంటానుట.

ఎవరి మెప్పుకి నేను యీ యాతనంతా పడుతున్నానో, నాకు తెలియటంలేదు. నా యీడువాళ్ళకి కొందరికి పెళ్ళయినా కాలేదు. ఎంతో ఉత్సాహంగా చీకుచింత లేకుండా చదువుకుంటున్నారు. నాకు అప్పుడే నా బ్రతుకుమీద రోత పుడుతున్నది. పగవాళ్లకైనా ఒద్దే యీ యాతనా పిల్లలూనూ. పిల్లలు లేనివాళ్లు నిజంగా ఎంత అదృష్టవంతులు! కాలక్షేపానికి అనేక విధానాలున్నాయి" అంది భారతి.

* * *

నాకు ఇంటికి వెళ్తున్నప్పుడు ఆలోచన ఒకటే. "ఏది మంచి? ఏది చెడు? శారద అలా బాధపడింది. భారతి ఇలా బాధపడింది. నాకు ఏది నిజమో నిర్ణయించేందుకు శక్తి లేకపోయింది. కాని ఇద్దరూ చెరోవిధంగానూ జీవితంమీద విరక్తి పడుతూనే వున్నారు. బలవంతాన్ని కాలాన్ని నెట్టుతున్నారు. మానవునకు ముఖ్యంగా ఉండవలసిన తృప్తికి ఇద్దరూ దూరమైపోయారు. ★

బంగాళాదుంపతో-వడియాలు

ఈ వేసవిలో ప్రతియింటా వివిధ రకము లైన వడియాలు, అవకాయలు విధిగా పెట్టుకుంటారు. ఉడుకుడుకు ముద్ద, ఊరగాయబద్ద వడియాలు నంచుకుంటూ తింటే వేరే దేవేంద్ర భోజనము లేదంటారు మన వాళ్లు. సమయానికి కూరలేనప్పుడు వడియాలు వేయించుకుని ఊరగాయ కలుపుకుని తింటే ఆపూట గడిచిపోతుంది. ఇంట్లో స్థలం, వంట్లో ఓపికా ఉంటే ఎన్ని రకము లైన వడియాలైన పెట్టుకుని, నిల్వచేసుకో వచ్చు. వరుగులంటే పిల్లలకెంతో యిష్టం. పైపెచ్చు వీటివల్ల వంటికి ఏ జబ్బుచేయదు. బంగాళాదుంపతో వడియాలు ఎట్లా పెట్టుకుంటారో చెప్తాను.

కావలసిన వస్తువులు :

బియ్యపు పిండి – ఒకశేరు, బంగాళ దుంపలు – ½ శేరు, నువ్వులు – అర్ధ పావు, పచ్చిమిరపకాయలు – అర్ధ పావు, అల్లము– ¼ పావు (చటాకు) యిష్టమున్నవారు అర్ధ పావు వేసుకోవచ్చు, తగినంత ఉప్పు.

చేయువిధము :

బియ్యము, రాయీ రప్పా లేకుండా బాగుచేసి, నీళ్ళలోపోసి ఒకగంట నానబెట్టాలి, తర్వాత రెండు, మూడుసార్లు కడిగి నీరంతా ఓడ్చి, రోట్లోవేసి మెత్తగా పిండి మాదిరి దంచాలి. లేకపోతే పచ్చిబియ్యము కొస్త ఎండనిచ్చి తిరుగలిలో విసురుకోవచ్చు. నువ్వులు రాళ్లులేకుండా బాగుచేసి ఉంచుకోవాలి. పచ్చిమిరపకాయలు, అల్లము మెత్తగా నూరిపెట్టుకోవాలి.

ఒక పెద్ద స్టెయిన్‌లెస్‌స్టీలు గిన్నెలోగాని, కళాయిపాత్రలోగాని శేరున్నర నీళ్ళు పోసి, పొయ్యిమీద ఉంచి మరగనియ్యాలి. ఇప్పుడే తగినంత ఉప్పువేయవలెను. నీరు మరిగిన తర్వాత, దంచి ఉంచిన పిండి కొద్దికొద్దిగావేస్తూ గరిటెతో కలియబెట్టుతూఉండాలి. లేకపోతే పిండి ఉండలు కట్టుతుంది. పొయ్యిలో సెగ ఎక్కువ ఉండకూడదు. సన్నని సెగమీద మెల్లగా ఉడకనిస్తూ కలియబెడుతూఉండాలి. అలుగడ్డలు (బంగాళదుంపలు) పెద్దవయితే నాల్గు ముక్కలు, చిన్నవి రెండు ముక్కలుగా కోసి శుభ్రముగా కడగాలి. ఒక గిన్నెలో ముక్కలువేసి, ముక్కలు మునిగేట్లు నీళ్ళు పోసి ఇంకొక కుంపటిమీద ఉడకనివ్వాలి ఉడికినతరువాత, పైతొక్కు తీసి, రోటిలో వేసి మెత్తగా రుబ్బి తీసుకోవాలి. బంగాళదుంపలు రుబ్బటములో పిండిమాట మర్చి పోతే శుభ్రంగా అడుగంటకుండా ఉడుకుతుంది. మరీ పలుచగా కాకుండా, మరీ గట్టిముద్దలా కాకుండా పిండి ఉడికినతర్వాత దించాలి. దించేముందు నువ్వులు కడిగి పిండిలో వేయాలి, నువ్వులు అంతటా కలిసేట్లు ఒకసారి బాగా కలిపి దించాలి. ఇప్పుడు ఈ పిండిలో రుబ్బిన అలుగడ్డలు, మిర్చి, అల్లము ముద్దవేసి చేతోగాని, గరిటతోగాని బాగా కలపాలి. చేత్తో కలపమన్నానని ఉడుకు పిండిలో చెయ్యిపెట్టేరుసుమా? కొస్త చల్లా

కనకపల్లి రధ

రిన తర్వాత చేత్తో కలిపితే బాగా కలుస్తుంది. కలిపిన పిండి రుచిచూసి ఉప్పుతక్కువుంటే అప్పుడు కొస్త వేసుకోవచ్చు. కారం ఎక్కువ కావలసినవారు ఇంకా మిరపకాయలు వేసుకోవచ్చును. అసలు కారం అక్కరలేనివారు పచ్చిమిర్చి, అల్లము వేయకుండా వరుగులు పెట్టుకుంటే కమ్మగా బాగుంటాయి.

ఒక చాపమీదగాని, మంచంమీదగాని ఒక పెద్ద బట్ట తడిపి, పరచి, వరుగులు పెట్టుటకు కూర్చోవాలి. జంతికల గొట్టం శుభ్రపరచి, కొస్త పిండితీసుకుని జంతికలమాదిరి చిన్నవిగా బట్టమీద పిండాలి. జంతికల మాదిరి యిష్టంలేనివారు, పిండి ఉడికించేప్పుడు కొస్త నీరెక్కువపోసి గరిటె జారుగా చూసి దించుకోవాలి. అంతా కలిపిన తర్వాత బట్టమీద కొస్త పిండి వేసి చేత్తోగాని, స్పూన్‌తోగాని బత్తాసులమాదిరి పామాలి. ఆరోజు బాగా ఎండనిచ్చి మరునాడు బట్టవెనుకవైపు నీళ్ళుచల్లి, వడియాలు తీసి, చాటలలోపోసి, ఎండనిచ్చి డబ్బాలలో వేసి ఉంచుకోవాలి.

ప్రొద్దుటే లేచి వడియాల పిండి తయారుచేసుకుని, ఎండెక్కకమునుపే వడియాలు పెట్టుకుంటే హాయి. ఇంట్లో ఇద్దరు, ముగ్గురు ఆడవాళ్ళుంటే త్వరగా పెట్టుకోవచ్చు. ఈ వరుగులలో బంగాళాదుంపలు కలిశాయి గాబట్టి రుచిగా ఉంటాయి. ఎక్కువ నూనెలో వేయించితే బాగా పొంగుతాయి.

ఇవిగాక బంగాళాదుంపలను పలుచని గుండ్రని ముక్కలుగా తరిగి, తగినంత ఉప్పు, కారం, పసుపు, చిటికెడు సోడా, చారెడు నీళ్లుపోసి వెడల్పాటిగిన్నెలో ఉడకనివ్వాలి. పదినిమిషాలతర్వాత దించి, చాటలో విడివిడిగా పెట్టి ఎండనిచ్చి, చిప్స్ మాదిరిగా చేస్తారు. ఇవి నూనెలో వేయించితే పొంగి బాగుంటాయి.

ఇప్పుడు బంగాళాదుంపలు బాగానే వస్తున్నాయి. కాబట్టి ఇబ్బందిలేదు. ముందు కొంచెము వరుగులు చేసుకుని తర్వాత ఎక్కువ పెట్టుకోవచ్చు బావుంటే. ఏవైన గాని శ్రమ అనుకోకుండా ఓపిగ్గా చేస్తే బాగా ఉంటాయి. చెప్పటం నావంతు అయినది. ఇంక చేయటం మీవంతు. ఏమంటారు? ★

పులిహోరావకాయ

ఇపుడు ఊరగాయ రోజులుకదూ! అందువలన అన్ని ఊరగాయలతోపాటు పులిహోరావకాయకూడా పెట్టుకుంటే బాగుంటుంది. అది పెట్టే విధానము :- మామిడికాయ ముక్కలు సన్నముగా ఒక శేరు ముక్కలు తరగవలెను. ఆ ముక్కలకు ½ సోలెడు కారము, ½ సోలెడు మెత్తని ఉప్పు, ఒక గిద్దెడు శనగలు, ఒక గిద్దెడు నూనె పోసి అన్నియు కలిపి ఒక జాడీలోపెట్టి యుంచవలెను. ఆ మరునాడు ముక్కలు పిండిచి చేటలో పోసి ఎండలో పెట్టవలెను. దంపిన ఆవపిండి ½ సోలెడు ఆ ఊటలో కలిపి ఎండలో పెట్టవలెను. ఆ ముక్కలు బాగుగా ఎండిన తరువాత ఊటలో కలిపి ఆరోజు ఉంచవలెను. నాల్గవరోజున తీసి పోపువేయవలెను. పోపునకు కావలసినవి :-అర సోలెడు నువ్వుపప్పు, అర సోలెడు శనగపప్పు, ఒక గిద్దెడు మినప పప్పు, రెండు తులముల పచ్చిమిరపకాయ ముక్కలు, రెండు తులముల ఎండు మిరపకాయ ముక్కలు, 8 తులముల కరివేపాకు ఇవి అన్నియు కలిపి వేయించవలెను. తరువాత సోలెడు నూనె, కొంచెము ఇంగువ వేసి కాచి ఆ ముక్కలలో పోసి అన్నియు కలిపి ఒక జాడీలో పెట్టవలెను. అది అన్నములో వేసుకొనిన ఎంత బాగుంటుందనుకున్నారు! ఈమాదిరిగా నే సంవత్సరమునకు సరిపడునది పెట్టుకోవచ్చును. దానికి పోపు ఒక్కమాటు వెయ్యకూడదు. కొద్దికొద్దిగా ఎప్పటికప్పుడు వేసుకోవచ్చును.

మల్లాది దుర్గాంబ.

రాగులతో పానీయం

క్రిందటి వారము అనగా 15-5-57 వార పత్రికలో లీలా సీతారాంగారు రాగులతో ఏదయినా పానీయము తెలిసినవారు వ్రాయమని వ్రాసినారు. దానికి యీ కింది విధముగా ఇష్టము ఉండినవారు చేసుకొనవచ్చును. ఎట్లనగా, ఒక పడి రాగులు, రాళ్లు, పొట్టు లేకుండా శుభ్రముచేసి ఉదయము 6 గంటలకు నీళ్లలో పోయవలెను. మరుసటిరోజు నానిన రాగులు ఒక వడబుట్టలో వేయవలెను. నీరంతయూ పోయిన తరువాత శుభ్రమయిన గుడ్డ తీసుకుని, గట్టిగా మూటగట్టి, క్రిందపెట్టి దానిపైన ఒక కుండగాని, గిన్నెగాని బోర్లించవలెను. అట్లా రెండురోజులుండిన తరువాత 3వ రోజున బాగుగ మొలకలు వచ్చును. అవి ఒకటిరెండు రోజులు నీడనే ఆరవలెను. ఆరిన తరువాత ఒక చేటలో వేసుకొని కొంచము చేతితో నలిపిన మొలకలు అంతయూ రాలిపోవును. అపుడు బాగుగ చెరగవలెను. వానిని పొయ్యిమీద బాణలిపెట్టి చిన్నగా మంటవేసి, కొంచము కొంచముగా (అనగా నానవేసిన పడి రాగులు రెండుమారులు వేయవలెనన్నమాట) కొంచము ఎరుపురంగు వచ్చువరకు దోరగా వేయించవలెను. మరీ మాడిపోవువరకు వేయించకూడదు. అపుడు ఒక తట్టలో పోసుకొని తిరగలిలో కొంచము కొంచము వేస్తూ విసరవలెను. విసరిన తరువాత దానిని వస్త్రకాళితము చేయవలెను. అపుడు మెత్తనిపొడి వచ్చును. ఒక గ్లాసు నీళ్లు కుంపటిమీద పెట్టి, ఆ నీళ్లు కాగినతరువాత, రెండు టేబిలు స్పూనులు పొడరు కొంచెం నీళ్లలో కలిపి, ఆ కాగిన నీళ్లలో గరిటెలో త్రిప్పుతూ, ఈ కలిపిన దానిని పోయవలెను. అది తెర్లిన తరువాత క్రిందికి దించి చక్కెర వేసుకొని చల్లబడిన తరువాత త్రాగితే చాలా బాగుండును. మధ్యాహ్నము కాఫీకి బదులు ఇది త్రాగితే మంచిదికూడా. ఒంటిపటుకి బలము కూడా ఇచ్చును. సంవత్సరము లోపు బిడ్డలకు గ్లూకోసు వేసి పట్టవచ్చును. ఇది ఇద్దరు మనుష్యులుండిన, వారికి 10 రోజులు వచ్చును. ఈ ప్రకారము ఎంతయినా చేసుకొనవచ్చును.

అమృతపాళము లేక హల్వా

ఇది రేపు చేసెదమనగా ఈదినము తెల్లవారి, ఒక రెండు సోలలు రాగులు శుభ్రముచేసి నీళ్లలో పోయవలెను. రేపుమధ్యాహ్నము అనగా 1 గంటకు నీళ్లలోనుంచి వడబుట్టలో వేసుకొని, వానిని రోటిలో వేసి కొంచెము నీళ్లుపోస్తూ రుబ్బవలెను. రుబ్బిన తరువాత అడుగు వెడల్పుగా వున్న ఒక కళాయి గిన్నె తీసుకొని దానికి ఒక పల్చని గుడ్డకట్టి, ఈ రుబ్బిన ముద్దను, ఒక గిన్నె తీసుకొని ఆ ముద్దను గిన్నెలో గరిటెబారుగా కలుపుకొని వడపోయవలెను. ఇట్లనే మరి యొకతూరి రుబ్బి వడకట్టవలెను. అప్పటికి పాలన్నియూ వచ్చును. ఈ పాలు చిక్కగా వుండవలెను. నీరు యెక్కువ పోయకూడదు. ఆ పాలలో 1 అణా ఏలకులు తీసుకొని వొలచి, గింజలు బాగుగా పొడరుచేసి, ఆ రాగుల పాలలో వేయవలెను. ఆ పాలలో తగినంత చక్కెర వేసి చిన్న మంటమీద గరిటతో త్రిప్పుతూ ఉండవలెను. కొద్దిసేపటికి హల్వా మాదిరి తయారగును. దానిని ఒకసమమైనపళ్లెము తీసుకొని, దానికి నెయ్యిరాచి ఈ హల్వాను దానిలో వేసి సమముగా గరిటెతో పళ్లెము వెడల్పునా చేయవలెను. కొంచెం ఆరిన తరువాత ఒక చాకు తీసుకొని మనకు ఏ ఆకారములో ఇష్టమో ఆ ప్రకారము కోసుకొనవచ్చును. ఇది మెత్తగా చాలా రుచిగా వుండును. తీపి ఇష్టమున్నవారు ఎక్కువ వేసుకొనవచ్చును.

కారపు వంటకం

రాగులు రాయిరప్పా లేకుండా శుభ్రముచేసి, వానిని విసరి పొలెడుపిండిని తీసుకొని ఒక 4 లేక 5 పండుమిరపకాయలు, 2 పెద్ద వుల్లిపాయలు, తగినంత ఉప్పు వేసి, వుల్లిపాయలు తరిగి, వుల్లిపాయలు, మిరపకాయలు, ఉప్పువేసి, రోటిలో దంచి, ఆ పిండిలో వేసి, నీళ్లుపోసి ముద్దగా కలుపవలెను. ఆ ముద్దలో కొంచెం జీలకర్ర వేయవలెను. ఒక గిన్నె బోర్లించి, దానిమీద తడిగుడ్డ వేసి, నిమ్మకాయంత ఉండ తీసుకొని దానిమీద రొట్టెమాదిరి తట్టవలెను. ఈ తట్టిన రొట్టెను పొయ్యిమీద బాణలిపెట్టి కొంచెము నెయ్యి వేసి రెండుప్రక్కలా బాగుగా కాల్చవలెను. ఈకాల్చిన రొట్టెను ఉడుకుమీదనే తినవలెను. ఇష్టము ఉన్నవారు బానలో నుంచి తీస్తునే, వెన్న వుండినవారు వెన్న రాచుకొనవచ్చును. లేదా నెయ్యి ఇంకొంచెము రాచుకొని తినవచ్చును. ఇది 4 రొట్టెలకు సరిపోవును. ఈ కొలత ప్రకారం ఎన్ని రొట్టెలయినను చేసుకొనవచ్చును.

—జి. లక్ష్మీదేవమ్మ.

రాగులతో

భైరవభట్ల లీలా సీతారాంగారు వ్రాసిన ఆహారము-ఆరోగ్యవ్యాసము నాకు నచ్చినది. ప్రతిఒక్కరూ ఆటువంటి ఆహారము తినుటకు ప్రయత్నించాలి.

లీలా సీతారాంగారు రాగులతో ఏదైనా పానీయంలాంటిది 'వంటశాస్త్రజ్ఞులు' కనిపెడితే బాగుండునని అన్నారు. రాగులతో తయారుచేయునవి నాకు తెలిసినవి రెండు వ్రాయుచున్నాను. ఇవి మాయింటిలో పిల్లలకు చేసిపెడ్తాము.

రాగులు వేయించి పిండి విసిరేవరకు పైన చెప్పినట్లే చేయవచ్చును. తరువాత— మనకు త్రాగటానికి కావలసినంతవరకు నీటిని వేడిచేసుకొని దింపెయ్యాలి. అందులోనికి కొంచెము పాలు, చక్కెర వెయ్యాలి. దానిలోనికి పై విధంగా తయారుచేసిన పిండిని కొంచము వెయ్యాలి. ఒక గ్లాసు మాల్టు తయారుచేయుటకు ఒక టీ స్పూనుపిండి వెయ్యాలి. చక్కెర పాలు మన రుచిని బట్టి వేసుకోవచ్చు. ఈ మాల్టు త్రాగటానికి చాల రుచిగా వుంటుంది. ఒంటికి మంచిదికూడ. ఈ మాల్టు రెండుమూడు సంవత్సరాల పిల్లలనుంచి ముసలి వారివరకు త్రాగవచ్చు. ఎండకాలంలో మధ్యాహ్నముపూట మజ్జిగలోనికి కొస్త వుప్పువేసి ఈ మాల్టు పొడివేసి కలిపి త్రాగితే కడుపులో చల్లగా వుంటుంది. ఇది తయారుచేయటానికి ఎక్కువఖర్చు కాదు. అతి సామాన్యులుకూడ తయారుచేసుకోవచ్చును.

రాగిమాల్టు అయిందికదూ: ఇక 'చరి' చేయుట చెప్తాను. ఈ చరి ఏడెనిమిది నెలల పిల్లలనుంచి రెండు సంవత్సరముల పిల్లల వరకు పెట్టవచ్చు. ఈ 'చరి' పెడ్తే ఒంటికి చాల బలం. కడుపులో చల్లగా వుంటుంది, పిల్లలు ఆరోగ్యంగా వుంటారు.

రాగులు చక్కచేసి వేడినీటిలో నానెయ్యాలి. ఒకరోజంతా నానాక, మరుసటిరోజు వుదయము రాగులలో వున్న నీటిని వొంపేసి పలుచగా పరచి నీడపాటున బాగుగా ఆరనివ్వాలి. రాగులు ఎండాక తిరగలిలో వేసి పిండివిసరి వస్త్రకాళితము చెయ్యాలి. ఇప్పటికి 'చరి' పిండి తయారైనదన్నమాట.

'చరి'చేయువిధము: వెడల్పాటి చిన్న గిన్నెలో కాసిని నీళ్లు పోసి కుంపటి మీద

పూలమొక్కలూ-కూరగాయలూ

జూన్ నెడవ తారీఖున మృగశిర ప్రవేశిస్తుంది. ఎండలకు బీటలు వారిన నేలమీద చినుకుపడి భూమి చల్లబడుతుంది. జూన్ మొదలు ఆగస్టు వరకు పూలమొక్కలు కూరగాయ మొక్కలు పెడతారు. మొక్కలు పెరుగుటకు ముందు నేల ముఖ్యము. మొక్కలను పెంచవలెనంటే ఓర్పు నేర్పు శ్రద్ధ ఉండాలి. విత్తనములు క్రితము సంవత్సరానివి సేకరించాలి. ఇతరత్రా విత్తనములు దొరకనట్లయిన ఆయా విత్తనముల కంపెనీలకు మీయొక్క అభిరుచులనుబట్టి మీకు కావలసిన విత్తనములను తెప్పించుకొనవచ్చును. (నాకు తెలిసిన రెండుకంపెనీల అడ్రసులు వ్రాస్తున్నాను. సట్టన్ అండ్ సన్స్ 13 మెజస్టిక్ కలకత్తా, శ్రీ దుర్గా నర్సరీ బిసెంటు రోడ్డు విజయవాడ 2. పైన చెప్పిన అడ్రసుల ప్రకారం వారికి వ్రాస్తే వారు కేటలాగు పంపిస్తారు.) పువ్వులలో అనేక రకములున్నవి. స్వీట్ విలియమ్, స్వీట్ సుల్తాన్, జినియాస్, డాలియాస్, దయంతస్, హోలీ హాక్స్, మేరీగోల్డ్, కాక్స్ కూంబ్, బాల్సమ్, సన్ ఫ్లవర్, కెలెండులా వంటివి. కూరగాయలలో ముల్లంగి, బీట్ రోట్ ఇవి భూమిలో ఊరే దుంపలు, నూల్ కోల్ చెట్టు మొదట్లో ఊరుతుంది. కాలీఫ్లవర్, క్యాబేజీ, లెట్యూస్ యివి చెట్టుమధ్య కాస్తవి. పీస్, వెల్ వెట్ బీన్స్, స్కార్లెట్ బీన్స్, ఫ్రెంచి బీన్స్ తీగకు కాస్తవి. టోమెటో, సోయాబీన్స్, చెట్లకు కాస్తవి. తక్కినవి సొర, బీర, మొదలైనవి అందరకూ తెలిసినవే. ముల్లంగి మొద

కొత్తపల్లి రాజ్యలక్ష్మి

లైనవి అందరకూ తెలిసినప్పటికీ సాధారణంగా పండించరు. కాని తక్కిన కాయగూర మొక్కలవలెనే మనము యింగ్లీషు కాయగూరలు కూడ చక్కగా పండించుకొనవచ్చును.

ఒక్కసారి వర్షం పడిన తరువాత గడ్డపలుగుతో భూమిని త్రవ్వి బోలుగా చెయ్యాలి. త్రవ్వేటప్పుడు అడుగనవున్న రాళ్లు చిల్ల పెంకులు పైకివస్తవి. అవన్నీ ఏరి పారవేసి చక్కగా చదునుచేసి మడులు కట్టాలి. మళ్ళీ వర్షం పడేటప్పటికి భూమి మెత్తబడి విత్తనములు నాటుటకు వీలుగా ఉంటుంది. మొట్టమొదటసారి త్రవ్వినప్పుడే ఎరువు కూడ వెయ్యాలి. యీ ఎరువు మనమే తయారు చేసుకొనవచ్చును. బయట ఒక మూలగొయ్యి త్రవ్వి మనకు అవసరములేని పదార్థములు ఉలిపాయ పొట్టు, కాయగూర తొక్కలు పశువులు తినగా త్రొక్కగా మిగిలిన గడ్డి మేకల మలమూత్రములు మొ॥ ఆ గోతిలోవేసి కుళ్ళబెట్టిన మనం చెట్లు వేసుకునే టప్పటికి ఎరువు తయారవుతుంది. యిటువంటి ఎరువు లేని సమయమున రసాయనపు ఎరువులుకూడ తగుమాత్రం వెయ్యవచ్చును. యింటి ముందు భాగమున పూలమొక్కలు, వెనుక భాగమున కాయగూర చెట్లు వేసుకుంటే చూచుటకింపుగా వుంటుంది. పెద్ద ఆవరణలు లేనివారు ఉన్నదాంట్లోనే అతి సుందరముగా వేసుకొనవచ్చును. రెండవసారి వర్షం పడిన తరువాత ఒక్కసారి పైపైన త్రవ్వి చదును చేసి విత్తనములు వేయవలెను. సాధారణముగా యీ కాలములో పూసే పువ్వుల మొక్కలుముందు నారుపోసి మొక్క మొలిచి రెండంగుళముల మొక్క అయిన తరువాత విడివిడిగా నాటవలెను. కొన్ని ఎండిన పూరేకులే పువ్వులవిత్తనములు, ఒక మడిలో వేటికవి గుర్తుంచుకొని జల్లి చేతితో సర్ది నీళ్ళు చల్లి మొక్కలు మొలిచేవరకు ఏదయినా తాటిచాపగాని తాటియాకుగాని కప్పవలెను. వారం రోజులలో మొక్క మొలుస్తుంది. రెండంగుళములు ఎదిగిన తరువాత ఒక ప్రక్కగా అందముగా ఉండేట్లు తవ్వి రెండేసి మొక్కల చొప్పున రెండు మూడు అడుగుల దూరమునకు నాటవలెను. ఒకటి చచ్చిపోయినా రెండవది బ్రతుకుతుంది. వీటిని సాయంత్రం వేళ నాటవలెను. యివి నాటేటప్పుడు ముందు గోతిలో నీళ్ళుపోసి మొక్క అందులో పెట్టి అప్పుడు మన్ను వేసిన మొక్క చావదు. యీ చెట్లు ఎదుగుతుంటే తలలు త్రుంచివేసిన చుట్టూ గుబురుగా కొమ్మలు వేసి చెట్టునిండా పువ్వులు విరగబూస్తవి. వీటన్నిటికంటే త్వరగా ఎదిగి త్వరగా పూతకు వచ్చేది కాశీరత్నం. యీ తీగను ఒక తాడుతో యింటిమీదకో, డాబా మీదకో ఆర్చీల మీదకో ఎక్కిస్తే చక్కగా అల్లుకుని పచ్చని తివాచీ మీద రత్నాలు పరచినట్లు చక్కగా ఎఱ్ఱని పువ్వులు పూస్తవి. యివి కాక యీ కాలంపూల

రాగులతో పానీయం

పెట్టాలి. వేరే చిన్నకప్పులో $1\frac{1}{2}$ స్పూను వరి పిండి రెండుస్పూన్ల చక్కెర వేసి దాని లోనికి కొంచెము పాలువేసి ఎక్కువ మందముగా కాకుండా, పలుచగా కాకుండా కలుపుకోవాలి. పాలతో కలుపుకున్న పిండిచక్కెర మిశ్రమాన్ని కుంపటిమీద తెర్లుతున్న నీటిలో వేసి వుడుకుపట్టేవరకూ కలపాలి. వుడుకుపట్టేవరకూ కలపకుంటే వుండలుకట్టి వరి చెడిపోతుంది. బాగుగా వుడికే టప్పటికి వరి గట్టిపడుతుంది. వరి గట్టిపడుతూనేదాని లోనికి కొంచెము నెయ్యివేసి దింపెయ్యాలి. ఎక్కువ నెయ్యి వేయకండి. మందము చేస్తుంది. ఇలా వుడికినది ఎక్కువ పలుచగాకుండా మందంగా కాకుండా వుండాలి. చెంచాతో తీసి తినిపించటానికి అనువుగా వుండే లాగున చేసుకోవలెను. నీళ్లగాచేసి ఫీడింగు బాటిల్లలోనికి వేసికూడా త్రాగించవచ్చు. అయితే నీళ్ళగాచేసి పట్టడానికంటే గట్టిగా (అంటే తినిపించటానికి వీలుగా) చేసిపెట్టితే నే మంచిది. వయస్సునుబట్టి, పిల్లలు తినే ఆహారాన్నిబట్టి చేసుకోండి.

జి. యస్. సత్యవతీదేవి.

అంట్లు వస్తవి. గడిక్కిచుట్టి కొన్ని అంట్లు అమ్ముతారు. కాని తోట్టెలో అమ్మే అంట్లు అయితే తప్పక బ్రతుకుతవి. నైట్ క్వీన్, షేకింగ్, రోజ్, మల్లె, సన్నజాజి, విరజాజి, మధుమాలతి, ఆటోదిల్పహార్ మొ॥ ఒక్కసారి ఒక్క అంటు పాతితే చాలు. దానిని బట్టి ఎన్ని ముక్కలయినా చేసుకొనవచ్చును. యీ చెట్లకు ఉల్లిపొట్టు బియ్యము కడిగిన కడుగు పోస్తుండాలి. రోజ్ కు మాత్రం పుగాకు కాడలు, సిగరెట్టుపీకలు, టి డస్ట్ (వడియకట్టినటువంటిది) వేస్తే మంచి బలముగా వస్తవి. అప్పుడప్పుడు నేలను తవ్వి గించుతూ ఉండాలి. రెండు పూటలు నీళ్లు పొయ్యాలి. తోటమధ్యలో అక్కడక్కడ రైన్ తోటకూరను అంకురములతో నాటిన చక్కగా ఉంటుంది. ఇది ఎదుగుతున్న కొలదీ సమమయిన సైజులో కత్తిరించాలి. ఇవికాక క్రోటన్స్ అనేక రకములు వేసుకొనవచ్చును. కేనాస్, ఎలిఫెంట్ యియర్ మొ॥ ఇవి ఒక్క పిలక వేస్తే చాలా చెట్లు అవుతవి. ఇవి గోడలవారగా వేస్తే బాగుంటుంది.

ఇంగ్లీషు కాయగూరలు: వీటికి నేల సారవంతమైనదిగా ఉండవలెను. భూమిలో ఊరే దుంపల విత్తనములు చెట్లకు కాయలు కాసే విత్తనములు ఒక మడిలో చల్లవలెను. వారము పదిరోజులకు మొక్క మొలుస్తుంది. రెండంగుళముల మొక్క ఎదిగిన తరువాత రెండంగుళముల లోతున మూడడుగుల దూరమున కొక మొక్క నాటవలెను. రెండు నెలలకు దుంప ఊరును. ఇక తక్కినవి పాకే కాయగూర విత్తనములు రెండు అడుగుల లోతున గింజ పాతవలెను. తీగను పందిరిపై కెక్కించవలెను. పాతు సరిగా లేనియెడల కాపు సరిగా కాయదు. ఆకుకూరలు, తోటకూర, చుక్కకూర, గోంగూరచెట్టు, బచ్చలి, పుదేనా మొదలు తోటకూర, గోంగూర సంవత్సరము పొడుగునా పండించుకొనవచ్చును, ఒక మడివేసిన వారమునకు మరొక మడివేసినట్లయిన మనకు కూరకు అనువుగా వుంటుంది. అంటే ఒక మడి అయేటప్పటికి రెండవ మడి ఎదిగి కూరకు సిద్ధంగా ఉంటుంది.

చెట్లను వెయ్యడం ఒక ఎత్తు వాటిని కాపాడడం ఒక ఎత్తు. సరిగా కాచే పూచే సమయానికి తప్పకుండా చీడపడుతుంది. అప్పుడు మన్నపునీరుగాని, పసుపునీరుగాని అవుపంచతంగాని జల్లవలెను. జీవహింస అని యెంచక కనబడిన పురుగును చంపెయ్యాలి. బయటగనక పార వేస్తే తెల్లవారేటప్పటికి చెట్టుమీదకెక్కి కూర్చుంటుంది. అప్పటికీ చీడ నశించకపోతే వ్యవసాయ డిపార్టుమెంటువారి నడిగితే వారు తగిన సలహా లిస్తారు. ఒక్కమాట:— మొక్క పాతేటపుడు జాగ్రత్తగా పాతకపోతే వర్షానికి గాలికి వేళ్లు పైకిలేచి చెట్లు కుళ్ళితో సహా పడిపోతవి. కాయగూర మొక్కలు పెంచుట వలన మనకు కొంత ఆర్థికంగా లాభిస్తుంది. మన యింట్లో పండిన కూరగాయ మనం తింటున్నామనే సంతోషం ఉంటుంది. శరీరానికి కొంత పరిశ్రమ కలుగుతుంది. వర్షం కురిసినప్పుడుతప్ప మిగతా రోజుల్లో నీళ్లు పొయ్యడం డొప్పలు త్రవ్వడం కలుపు తియ్యడం విలువయిన కాలాన్ని వ్యర్థపుచ్చకుండా వీటితో కాలక్షేపం చేసినట్లు అవుతుంది. సాయంత్రే సమయమున మన పూల తోటలోనికి వెళ్లిన పూసిన పూలను చూస్తుంటే ఎంతఆహ్లాదకరముగాఉంటుందో చేసినవారికే తెలియాలి. ★

ఉత్తరాలు:

విద్యలోనే మార్పురావాలి

ఈమధ్య 'వనితాలోకం' లో డిగ్రీల మీద దుమారం లేచింది. కొంతమంది డిగ్రీలక్కర్లేదంటే మరి కొందరు అసలు వనితలకు సైన్సే అనవసరమని తేల్చారు. డిగ్రీలు నిరుపయోగమైనది ఒక్క వనితలకేనా? పురుషులమాట? తెలుగు ఆనర్సు చదివి ఎకౌంట్సు డిపార్టుమెంటులో గుమాస్తాలు అయినవారెందరు? కామర్సు చదివినవారంతా వ్యాపారం చేసే వారేనా? అందరికీ నిత్యజీవితంలో వారు డిగ్రీ చదువు వుపయోగపడ్డోందా? పాలిటిక్సు నిత్యజీవితంలో ఎందుకు పనికొస్తుందని పేపరు చదవడం మానతారా? చదువుకుంటే వంటరాదూ? ఒకరన్నారు గదా అని అందరూ అదేపాట! వంట చేయడం రాకపోవడం అనేది యింటి పరిస్థితులమీద ఆధారపడి వుంటుంది. ఎవరో పెద్దవాళ్లు, ఆచారంగలవాళ్ళుంటే ఇంట్లో చిన్న పిల్లలకు పని తగలదు. అంతేగాని చదువుకోవడంలో లేదది. చదువుకునే ఆడపిల్లలు చాలమంది మధ్య తరగతికి చెందిన వాళ్ళు. వాళ్లకు పనిచేయకపోతే ఎల్లా గడుస్తుంది? చదువుకోవంత మాత్రాన పని చేతవ్వాలని లేదు. లేకుంటే ఇల్లింబట తిరిగి చాలా నేర్చుకోవచ్చు!

పురుషుల్లో ఎంతమందికి స్త్రీలను గౌరవించడం తెలుసు? వీటికి తగిన సంస్కారం మన విద్యల్లో లేనిమాట నిజం. అంచేత అసలు విద్యల్లోనే మార్పు రావాలి. నిత్యజీవితంలో విద్య వుపయోగపడాలంటే వృత్తి విద్యలు అభివృద్ధి చెందాలి. అంతేగాని యీ ఇరవయోశతబ్దంలో సైన్సు అనవసరమనడం సబబుకాదు. బాలబాలికలకు జనిమీద అభిలాషదాన్ని అభివృద్ధిచెందనివ్వాలి. దానికి స్త్రీ పురుష భేదం అనవసరం.

వి. జానకి, (గుంటూరు).

* * *

చదువెందుకు?

15-5-57 తేదీ పత్రికలో శ్రీమతి పాకల సీతగారు వ్రాసిన అభిప్రాయం చదివాను. కానీ వారు చదువు (స్త్రీ విద్య) గురించి పొరపాటుపడ్డారేమో ననిపిస్తుంది.

ఆడదానికి యెంత చదువున్నా వంట పనికీ, పిల్లల పెంపకానికీ మాత్రమేగదా అని ఆమె అన్నమాటలతో నేను ఏకీభవిస్తాను. కానీ ఏదో సరదాకొద్దీ, తాహతుకొద్దీ, అవకాశాలను వినియోగించుకొని కొంతవరకూ చదువుకున్నంత మాత్రాన వంటా—పిల్లల పెంపకం చాతకావనుకోడం అంత సమంజసం కాదు. అదికాక చదువుకున్నవాళ్ళు పెంచినంత శ్రద్ధగానూ, శుభ్రంగానూ చదువుకోని వాళ్ళు పిల్లల్ని పెంచరనుకుంటాను.

చదువుకునే ఆడపిల్లలందరూ వుద్యోగం చేసి ధనార్జనచేద్దామనేనా అనేది యింకొక ప్రశ్న. చదువుకునేవాళ్ళందరికీ వుద్యోగం చేయాలనే వాంఛవుండదు. చదువుకొనే వాళ్ళు కొందరు కేవలం సరదాకే చదువుతున్నారు. నాలుగు సంగతులూ తెలుసుకుందామని చదువుతున్నారు. వుద్యోగం చేద్దామనే సరదా వున్నవాళ్ళందరి తల్లిదండ్రులకే ఆ సరదా వుండకపోవచ్చును కూడా.

మాకు తెలిసినాయన అన్నారు. "చదువుకునేది డబ్బుకోసమేకదమ్మా! నా పిల్లలకి బోలెడంత ఆస్తియిస్తున్నాను. వాళ్ళకింక చదువెందుకు?" అని. కాని మనం చదువుకునేది, కేవలం డబ్బుకోసమే కాదు, జ్ఞానం కోసం, 'అని గ్రహించిననాడే మనదేశంలో చదువుకునే ఆడవాళ్ళ సంఖ్య పెరుగుతుంది.

సి. నిర్మల, (ఏలూరు).

* * *

అభినందనలు

వనితాలోకం అన్న శీర్షిక్రింద ద్వివేదుల సోమనాథ శాస్త్రిగారు వ్రాసిన వ్యాసము "ఉద్యోగము-వివాహము" చాల బావుంది. వారికి నాహృదయపూర్వక అభివందనములు, వివాహము కాని ఆడపిల్లలకు ఉద్యోగాలు దొరకని పురుషులకు సంఘములోను, ఇంట్లోను కలుగు కష్టములను చాల చక్కగా విమర్శించి వ్రాశారు

ఒకసోదరి, (గణపవరం).

* * *

శ్రద్ధాంజలి

శ్రీ ప్రకాశంపంతులుగారిని మనం యీ రోజున కోల్పోయినప్పటికి ఆయనయొక్క త్యాగమునకు ఆయన చేసిన సేవకు ఆయన ఎప్పటికి సజీవులే.

ఆయన ఏవి కార్యముల కోసం త్యాగం చేసి కృషి చేశారో, ఆయా కార్యాల సత్ఫలితాలను తన జీవితకాలంలోనే చూడగల్గిన ధన్యజీవి. ఆయనయొక్క పట్టుదల, ధైర్య సాహసములు మనకు ఆదర్శప్రాయములు. ఆయనకు భక్తిపూర్వకంగా అంజలులు సమర్పించుచు వారి ఆత్మకు శాంతి నొసంగుమని దేవుని ప్రార్థించుచున్నాను.

డి. భాస్కరమ్మ,
ఒంగోలు.

(29-5-57) పత్రికలో "ఆడబిడ్డలు"ను గురించి వ్రాసారు. అది చదివేంత సేపు చాలా ఆశ్చర్యం వేసింది. ఈ మాదిరి ఆడబిడ్డలు వుంటారా? నేనింతవరకు చూడనే లేదు.

ఆర్. వి. స్వర్ణ, (తిరుపతి).

* * *

ది. 8-5-57 ఆంధ్ర వారపత్రికలో పై శీర్షికను చదివాను. స్త్రీలు ఆస్పత్రులలో పనిచేస్తున్న అవస్థలు, వారి అనుభవాలు, చాలా బాగా వివరించారు.

జి. పద్మావతిదేవి, (ఆరవల్లి).

* * *



చెల్లాయి

చెల్లాయి! చెల్లాయి! ఒకమాట
చెప్పెద వినుమా నా మాట!
ఘల్లు ఘల్లుమని ఎక్కడికే!
గంతులు వేయుచు పోయెదవో!

పూవుల పావడ గట్టుకొని,
పూవులు జడలో పెట్టుకొని,
పట్టుపరికిణీ తొడుగుకొని,
పరువిడిపోయెద వెక్కడికో!

గుజ్జనగూళ్లు వండగనా?
బొమ్మలపెండ్లి చేయగనా?
అమ్మకు తెలియక బియ్యమ్ము,
దొంగిలించితివి దొంతులను!

ఆటలు పాటలు యికేమీకా
మాటలుగట్టుమా! ఒకచోట
మాట మాట ఓమాట
నేటికో రేపో పెండ్లంట!

పండుగలన్నీ మనయింట!
నిండిఉండులే! నీవుంటే!
పిండిముగ్గులు మనయింట
నిండుగ దిద్దే దెవరంట!

కోయిలకూత విన్నంత
హాయిగ నీది ప్రతిపంత
అత్తగారితో ఆ పంతం
ఆపద తెచ్చును ఇది సత్యం!

అవ్వీ యివ్వీ చెప్పినాన్నతో
నవ్వుకొందువా నన్ను కొట్టగా!
నవ్వులు గివ్వులు నలిగిపోవునులే!
బావమీద ఇక చాడి చెబితే!

దూతలూరి జగన్నాధం

వాలిసుగ్రీవాంజనేయ జననం

అందం అనేదాన్ని బ్రహ్మదేవుడు మానవులలో కొద్దికొద్దిగా యిముడుస్తాడు. ఒకసారి బ్రహ్మదేవునికి అందాలన్నిటినీ కలిపి ఒక స్త్రీని తయారుచేయాలన్న సంకల్పం కలిగింది. అనుకోవడమే తడవుగా ఆయన ఒక బాలికను సృష్టించాడు. ఆమెకు 'అహల్య' అని పేరు పెట్టి పెంచుతున్నాడు.

ఆ బాలికకు 16 ఏండ్ల వయస్సు వచ్చింది. దేవతలందరూ ఆ పిల్ల తమకు కావాలంటే తమకు కావాలని పోట్లాడుకోసాగారు. బ్రహ్మదేవుడప్పుడు సందిగ్ధావస్థలోపడి వాళ్ళతో "అబ్బాయిలూ! మీరందరూ యిల్లాపోట్లాడుకోవడం ఏమీ బాగుల్లేదు. ఈమె మీలో ఎవరో ఒకరికే భార్యఅవాలి. కాబట్టి నేనొక పందెం పెడతాను. ఆ పందెంలో ఎవరు గెలిస్తే వాళ్ళకు యీమెనిచ్చి వివాహం చేస్తాను." అన్నాడు. వెంటనే దేవతలందరూ 'ఏమిటా పందెం?' అని ఏకగ్రీవంగా అడిగారు.

బ్రహ్మదేవుడు వారితో యిట్లా చెప్పాడు: "ఎవరైతే ముందుగా ముల్లోకాలనుచుట్టి నావద్దకువస్తారో వారి కీపిల్లతో వివాహం జరుగుతుంది."

బ్రహ్మదేవుడి నోటినుండి యీ మాటలు రావడమే తడవుగా దేవతలందరూ తమతమ వాహనాలమీద కార్యసాధనకోసమై బయలుదేరారు.

నారదుడు దేవతల సందరనూ చూచి మనసులో నవ్వుకొన్నాడు. ఆ మహానీయుడి కిదంతా నచ్చలేదు. ఆయన తిన్నగా భూలోకానికి వచ్చాడు 'మహతి' మీటుకుంటూ. ఆయన భూలోకానికి వెళ్ళి అక్కడ వనంలో తపస్సుచేసుకొంటున్న గౌతమ మహర్షివద్ద కేగాడు. గౌతముడు బ్రహ్మమానసపుత్రుని రాకను గమనించి లేచి నమస్కరించి "మహాత్మా! మీ సందర్శనమువల్ల నాజన్మతరించినది. ఊరకరారు మహాత్ములు! వచ్చినకారణం ఏమిటో..." అని అర్థోక్తిగా అన్నాడు. అప్పుడు నారదుడు అహల్యసంగతీ, బ్రహ్మ

రామచంద్ర

దేవుని షరతూ తెల్పి తర్వాత ఏదో చెవులో ఊదాడు. గౌతముడు సరేనన్నట్లు తలయూచాడు.

నారదుడు ఏమీ ఎరుగనట్లు ఆశ్రమం బయటికి వచ్చేశాడు. గౌతముడు తపోనుష్ఠానములు తీర్చుకొని తిన్నగా బ్రహ్మలోకానికి వెళ్ళాడు.

గౌతముడు బ్రహ్మచుట్టూ మూడు ప్రదక్షిణాలుచేసి, నమస్కరించి, బ్రహ్మదేవునితో "స్వామీ! లోకాలకు కర్తనయిన మీకు ప్రదక్షిణం చేశాను. కాబట్టి నేను ముల్లోకాలను చుట్టివచ్చినట్లే. అందుచే మీరు అహల్యను నా అర్థాంగిగా చేయాలి." అని విన్నవించాడు.

బ్రహ్మ గౌతముని తెలివికి మెచ్చుకున్నాడు. (కాని ఆ తెలివి నారదునిదిగాని గౌతమునిది గాదు.) వెంటనే ఆయన గౌతమునికి అహల్యకు పాణిగ్రహణం చేశాడు.

* * *

గౌతముడు అహల్యను తన ఆశ్రమానికి తీసుకొనివెళ్ళి గృహస్థాశ్రమము స్వీకరించాడు. కొన్నాళ్ళకు వారికొక పుత్రిక పుట్టింది. ఆ శిశువుకు 'అంజని'అని పేరుపెట్టి అల్లారుముద్దుగా పెంచుతున్నారు.

త్రిలోకములను చుట్టిరావటానికి వెళ్ళిన దేవతలందరూ ఒకరివెంట ఒకరువచ్చి కన్యకోసం చేయిజాపారు. బ్రహ్మదేవుడు వాళ్ళతో "బాహుబలంకన్నా బుద్ధిబలం ఎక్కువగా ఉండాలి. గౌతమునికా పిల్లనిచ్చేశాను. మొన్ననే వాళ్లకొక పిల్లకూడా పుట్టింది. ఇంక యిళ్ళకు వెళ్ళిరండి" అని చెప్పాడు. దేవతలందరూ తెల్ల మొహాలతో తమ నివాసాలకు వెళ్ళిపోయారు. ఇంద్రుడూ, సూర్యుడు మాత్రం ఎట్లాగైనా అహల్యను సాధించాలని సమయంకోసం వేచి ఉన్నారు.

గౌతముడు తెలివితక్కువవాడు మాత్రం కాదు. అహల్యమీద దేవతల కన్ను పడిందని [illegible]

తెలుసు. సంధ్యాదికార్యములకు తాను నదికి వెళ్లేటప్పుడు అహల్యా ప్రాణములను తీసుకుని వెళ్లేవాడు. అంతటితో ఊరుకోలేదు. ఆశవానికి తనకుమార్తె అయిన అంజనిని కాపుంచేవాడు.

ఇట్లా ఉండగా కొన్నాళ్ళకు సూర్యుడు, యింద్రుడు గౌతము డింట్లో లేనప్పుడు రహస్యంగా అచటికి వచ్చారు. తీరా అక్కడ చూస్తే ఏముంది!—అహల్యా శవం. ఆశక్తైను వాళ్లేం జేసుకొంటారు?

వాళ్ళిద్దరికీ అప్పుడొక ఉపాయం తోచింది. సూర్యుడు మొదట పరకాయ ప్రవేశ మంత్రప్రభావం వలన అహల్యదేహంలో చేరాడు. ఇంద్రుడప్పుడు తనకోరికను తీర్చుకొన్నాడు. అట్లాగే ఇంద్రుడు శవంలో ప్రవేశించినప్పుడు సూర్యుడు తన వాంఛ నెరవేర్చుకొన్నాడు.

ఈ సంగతి అక్కడ కాపుగా వున్న అంజని చూచింది. తండ్రితో చెపుదామనుకొంది. కాని ఎదుట నున్న వారెవరు?— దేవలోకాధిపతి ఇంద్రుడు, లోకాని కంతటికి వెలుగునిస్తూన్న సూర్యుడు. ఆమె అందుచే ఆ సంగతి తన తండ్రితో చెప్పటానికి భయపడింది.

కాలచక్రం అతివేగంగా తిరుగుతోంది. అహల్య కొంతకాలానికి యిద్దరు పుత్త్రులను ప్రసవించింది. వారిద్దరూ యింద్రసూర్యుల బిడ్డలే. ఆ విషయం అహల్యకు, అంజనికి మాత్రమే తెలుసు. గౌతమునికి తెలియదు.

ఒకరోజున గౌతముడు కుమార్తెను, యిద్దరు కొడుకులను వెంటబెట్టుకొనిసముద్రస్నానానికివెళ్లాడు అది ఎండాకాలం. సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు. తల మాడిపోతోంది. ఇసుక పాదాలను మాడ్చివేస్తోంది. అప్పుడు గౌతముడు చిన్నపిల్లల నిద్దరినీ ఎత్తుకున్నాడు. అంజని తననుకూడా ఎత్తుకోమని చేతులు చాచింది. తండ్రి ఆమెను మందలిస్తూ "నీవు పెద్దదానవు. నీవు ఈ ఎండను ఓర్చుకోగలవు. కాని వీళ్లేమి ఓర్చుకోగలరు. అందువల్ల వీళ్ళను ఎత్తుకున్నాను." అన్నాడు. అప్పుడు అంజని వారు గౌతముని సంతానము కాదన్న విషయం తండ్రితో చెపుదామనుకున్నది. కాని భయంచేత చెప్పలేకపోయింది.

ఇంకా కొంతదూరం పోయేటప్పటికి ఆమె ఆయెండల్లో నడవలేకపోయింది. అప్పుడామె తండ్రితో "నాయనా! నీ బిడ్డనైన నన్ను కష్టములు పెట్టుచు, యితరుల సంతానమును సుఖపెట్టెదవేమి, యిదిన్యాయమేనా?" అని యేడ్చింది. గౌతముని కావలుకులు ఆశ్చర్యమును కల్గించినయ్. ఆయన తన కుమార్తెను సంగతేమిటో చెప్పమన్నాడు. ఆమె జరిగిన సంగతంతా చెప్పింది. కాని చిన్నపిల్లగదా! నిజం చెప్పిందో అబద్ధం చెప్పిందో తెలుసుకోవటానికి గౌతముడు ఆపిల్లలను దూరముగా విసరివైచి, "ఈ బాలకులు నా పుత్త్రులైతే మళ్లీ నావద్దకు వస్తారు; లేకపోతే వీళ్లు కోతులై వెళ్ళిపోతారు." అని శపించాడు.

శపించినట్లే వాళ్లు కోతులై వెళ్ళిపోయారు. వాళ్లు అట్లా వెళ్ళి వెళ్ళి కిష్కింధారాజ్యం చేరారు. అక్కడ కిష్కింధనేలుతున్న రాజుకు సంతానము లేదు. అందుచే ఆయన వాళ్ళను చేరదీసి సమస్తవిద్యలూ నేర్పి యింద్రునికొడుక్కి వాలి అనీ, సూర్యునికొడుక్కి సుగ్రీవుడనీ పేర్లు పెట్టాడు. కొన్నాళ్ళకు వాలిని రాజుగాచేసి తాను తపస్సు చేసుకోటానికి వెళ్లాడు.

* * *

ఇక్కడ గౌతముడు యింటికివెళ్ళి అహల్యను ఆమె తప్పుకు శిక్షగా రాయిగా పడియుండమనిశపించాడు.

★ వాలి సుగ్రీవాంజనేయ జననం ★

శ్రీరామచంద్రుని పాదధూళి చే ఆమెకు శాపవిమోచనం కలుగుతుందనీ చెప్పాడు.

అప్పుడు అహల్య తనకుమారులు కోతులయ్యారని తెలిసికొని దానికి కారకురాలయిన అంజనిని "నా కుమారులను కోతులుగా మార్చావు. కనుక నీ కడుపున కోతియే పుట్టుగాక!" అని శపించింది. అప్పుడు అంజని "నేను యావజ్జన్మము బ్రహ్మచారిణిగానే యుంటాను. అసలు పెండ్లే చేసుకోనను." అని శపథం చేసింది.

తరువాత ఆమె పర్వతాల్లోకి పోయి అక్కడ తపస్సు చేసుకొంటూ ఉంది. ఆమెకు రోజూ వాయుదేవుడు చేతిలో ఆహారం వేసేవాడు. ఆమె దానిని తిని మళ్ళీ ధ్యాననిమగ్నురాలయ్యేది.

ఒకసారి వాయుదేవుడు ఈశ్వరుని శక్తి మోయుచు, మోయలేక దానిని అంజనిచేతిలో పడేశాడు. అంజని అది ఆహారం అనుకొని మ్రింగివేసింది. అందుచే ఆమె గర్భం దాల్చింది. కొంతకాలానికామెకు ఒక కుమారుడు కల్గాడు. అతడే ఆంజనేయుడు. పుట్టడంతోనే ఆతనికాకలయింది. అప్పుడే ఉదయిస్తూన్న బాలభానుడు అతడికి కన్పించాడు. వెంటనే ఆతడికి సూర్యుణ్ణి తినాలని బుద్ధిపుట్టింది. వెంటనే ఆకాశానికెగిరి సూర్యుడి దగ్గరకు వెళ్ళి అతన్ని మ్రింగివేశాడు. అపుడు భూమండలమంతా చీకటిమయమయిపోయింది. సమస్తప్రాణులు చీకటి యేమిటా అని తల్లడిల్లిపోయాయి. అప్పుడు యింద్రుడు హనుమంతునివద్దకువచ్చి వానినోట్లోంచి సూర్యుణ్ణి బయటికి రప్పించాలని వజ్రాయుధంతో నోటిపై ఒక దెబ్బకొట్టాడు. అప్పుడు సూర్యుడు నోట్లోంచి బయటకు పడ్డాడు. సూర్యునియొక్క వేడిమివల్ల ఆతనినోరు కాలిపోయింది. ఎఱ్ఱగా తయారయింది. వజ్రాయుధప్రహారమువల్ల పాపము ఆంజనేయుడు హనుమంతుడయ్యాడు. అంటే మూతి వంకరపోయిందన్న మాట.

తనకొడుకు మూర్ఛపడిపోవటమువల్ల వాయుదేవుడికి కోపము వచ్చింది. అప్పుడతడు తనకొడుకుతోసహా ఒక గుహలోనికి వెళ్ళి కూచున్నాడు. ఆ సమయంలో గాలిలేక చాలమంది చనిపోయారు. దేవతలందరూ వాయుదేవునివద్దకు వెళ్ళి బయటికి రమ్మని ప్రార్థించారు. కాని వాయుదేవుడు వారి ప్రార్థనను నిరాకరించాడు. అప్పుడు దేవతలందరూ హనుమంతుని బ్రతికించి వరములిచ్చారు. అప్పుడు వాయుదేవుడు బయటికి వచ్చాడు.

అట్లాగే హనుమంతుడు శుక్లపక్ష చంద్రునివలె దినదిన ప్రవర్ధమానుడై పెరుగుచున్నాడు.

అతడు బాల్యమందే పెద్దపెద్ద పర్వతములను పెల్లగించి ఋషుల మీద వేసేవాడు. మునులందరు వీని యాగడములకు కోపించి ఉత్సాహము లేకుండునట్లు శపించారు. అప్పుడు బ్రహ్మాదిదేవతలు ఆ మునులవద్దకు వచ్చి, "హనుమంతుడు ముందు ముందు చాల సాహస కార్యములను జేయవలెను గాన ఆ శాపమును తొలగింపుడని" ప్రార్థించారు.

అప్పుడా మునులు "ఈతనికి ఎవరైన ఉత్సాహమును కలుగజేస్తే ఈతడు ఉత్సాహవంతుడౌతాడు" అని చెప్పారు.

హనుమంతుడు పెరిగి పెద్దవాడై కిష్కింధకు వెళ్ళి తన మేనమామయగు సుగ్రీవునకు మంత్రిగా నున్నాడు. లంకలో విహరించిన ఘనుడీతడే! ఈయనను మించిన రామభక్తుడు లేడు. శ్రీరామునికి ఈతనియందుగల ప్రేమ చాలా గొప్పది. ★

★ బావామరదులు ★

(11-వ పేజీ తరువాయి)

ప్రసంగం రానీయండి ఆయన సుమనోహరమైన సంభాషణ నడుపగలడు.

ఆయన సంగతి అట్లా వుంచండి. తెనాలి రామకృష్ణుడు ఎంతటి ప్రతిభావంతుడు! ఎంతటి రసజ్ఞుడు! ఆయన నోటివెంట వచ్చిన హాస్యపు పలుకు ఎంత మనోజ్ఞంగా, ప్రతిభావంతంగా వుండాలి! తిమ్మన కవి తూగుటుయ్యాలపై కూర్చుని ఉన్నప్పుడు, రామకృష్ణకవి వచ్చాడు. వాళ్లిద్దరికీ బావామరదుల వరసః. "బావా ఊగుతున్నావా!" అన్నాడు. తిమ్మన అంగీకార సూచకంగా తలవూపేసరికి రామకృష్ణుడు బావగారిపై తుపుక్కున ఉమిసి శ్లేషార్థాన్ని క్రియాపూర్వకంగా సాధించాడు. ఊహ ఏమంత రసవంతంగా లేదు. రామకృష్ణుడంతటి మహాకవి ఇంతటి మోటుహాస్యం నడిపాడంటే నవ్వవలసింది పోయి ఏడ్వవలసివస్తుంది. ఇది జుగుప్సాకరంగా ఉంది; ఏహ్యంగానూ వున్నది. అసలు క్రియాజన్య హాస్య మేఉత్తమమైనది కాదు. అంగులో మరీ హీనంగా ఉంది. అంగడీను, ఆక్షేపుడూకూడా సంతోషంతో నవ్వుకోగలదిగా ఉండాలి హాస్యపు పలుకుః అప్పుడే అది ఉత్తమమైనది కూడా అవుతుంది. బావ మరదినైనా, భార్యనైనా పూలగుత్తితో తాడనం చేస్తే అందంగా ఉంటుంది గాని, బర్రె పలుపులో బాదితే, అందులో అందమూ! అది హాస్యమూ!

ఇరవయ్యో శతాబ్దం వచ్చిందాకా, ఆంధ్రుల హాస్య ప్రసంగాలు అల్లాగే ఉప్ఘుండేవి. ఇప్పటి సంగతి వేరు. బావమరదుల మధ్య మనోజ్ఞమైన హాస్యపు పలుకులు దొర్లుతూ ఉంటవి.

ఒక గృహస్థు ఇంటికి ఒక పెద్ద మనిషి వచ్చాడు. గృహస్థు ఆయనతో కాసేపు మాట్లాడాక ఆయన వెడతానని లేచినపుడు, తానుకూడా లేచి వీధి గుమ్మందాకా అతనితో నడిచి పంపించి వచ్చాడు. ఆయనవచ్చే సరికి ఆయన బావమరిది తన అక్కగారి దగ్గరకూర్చుని కాఫీతాగుతూ ఏదో మాటలు చెపుతూ నవ్వుతున్నాడు.

ఇంటాయనను చూడడముతోనే గృహిణి నవ్వుతూ అన్నది: "ఏమండీ శ్రమపడి అంత దూరం పంపించి వచ్చారే... కాఫీ చల్లారి పోతున్నది తెలియదా?" ఆయన ఏమీ సమాధానం చెప్పక వూరుకున్నాడు. ఇంతలో ఆయన బావ మరది ధ్వనివ్యంజకంగా అన్నాడు. "అక్కయ్యా, బావ సంగతి నీకు తెలియనిదా? గేటుదాకా కాదు వీధి మలుపుదాకాకూడా పంపించివస్తాడు. అవసరమని తోస్తే, ఎవరైనా ఇంటికివస్తే వారిని ఆహ్వానించడము కంటే, సాగనంపడమే బావకు ఎక్కువ ఇష్టం" బాగుంది. ఇది సుకుమారంగా వుంది. పరిహాసింపబడిన వాడు, పరిహాసకుడు కూడా కలిసి నవ్వుకోవచ్చు, ఎవ్వరికీ గుచ్చుకోదు. శరీషకుసుమపేశలత్వము కలిగివున్న హాస్యము ఇది. ఈ రోజులలో బావ మరదుల హాస్యం సంస్కృతి, విద్యగల కుటుంబాలలో మాత్రం ఇలాగ ఉంటుంది.

బావమరదులు ఒకరినొకరు హాస్యం ఆడుకోవచ్చుననే సంప్రదాయం ఒకటి వుండబట్టే ఇటువంటి హాస్య సంపద మనకు లభిస్తున్నది. దీనికి, అనగా, ఇట్టి సాంఘిక మర్యాదలను ఏర్పరచినందులకు మనము మన సంఘాన్ని అభినందించాలి.

నా స్నేహితుడు పెళ్ళిఅయిన కొత్తరోజులలో గుంటూరులో ఉంటూ వుండేవాడు. అప్పటికి చాలా చిన్నతనం ... ఇల్లు కనిపెట్టుకొనివుండి 'హర్ మెజస్టీస్ సర్వీసు'లో అహర్నిశాలు పడివుండడము అతనికి ఇంకా పట్టుబడలేదు. పాఠశాలలో పని అయిపోయినతరువాత, అటునుంచే స్నేహితుల ఇళ్లకు వెళ్ళి వాళ్ళతో చాలాసేపు ప్రొద్దుపోయినదాకా, కులాసాగా కాలక్షేపంచేసి ఇంటికి ఆలస్యంగా వస్తూవుండేవాడు.

ఈ పరిస్థితి ఆయనభార్యకూ, పెద్ద బావమరదికీ కూడా కష్టగా ఉండేది. చిన్న బావమరది ఒకాయన ఉండేవాడు. పదునాలుగు సంవత్సరముల వయస్సుగల కుర్రవాడు. వాడుమటుకు బావగారు ఆలస్యంగా రావడము మనస్సులో పెట్టుకొని, తనూ ఆలస్యంగా వస్తూవుండేవాడు. కుర్రవాడు కొంపకు వేళకురాకుండా తిరుగుతున్నాడని తెలిసికొని ఆ కుర్రవాడిని అదుపులో పెట్టాలని ఒకరోజున గట్టిగా చీవాట్లువేసి చివరకు "ఓరీ, నీవు చెడుమార్గానపడి, ఎందుకూ పనికిరాకుండా పోతున్నావు," అన్నాడు. కుర్రవాడు విచారంతో తల వంచుకొన్నాడు. అంతటితో వూరుకోక, "తెలుస్తున్నాదా నేను చెప్పేమాట?" అన్నాడు. వాడు తల వూపాడు. "ఏమి తెలిసింది?" అని తరిచి ప్రశ్నించాడు.

"నేను ఎందుకూ పనికిరాకుండా పోతున్నానని తెలిసింది," అని కుర్రాడు బుకుక్కున ఏడ్చాడు. ఆయన తృప్తిపడి, "చదువుకో పో..." అని కుర్రవాణ్ణి పంపి,

★ బావామరుదులు ★

తాను చాలామంచి పని చేసినట్లు అంతా అనుకుంటున్నారో లేదో తెలుసుకోడానికి గర్వంగా భార్యవంకా, పెద్దబావమరది వంకా చూశాడు. నిజానికి మంచిపనే చేశాడు. కోప్పట్టను మంచిదే. కాని తన సంగతి ఏమిటి? "తానూ ఆపనే చేస్తున్నాడే? ఆయనకు చెప్పేవాళ్ళు యెవరు!" అని ఆమెగారు అనుకొన్నది. పైకి మాత్రం "మంచిపనే చేశారు; నిజమే, వాడు ఎందుకూ పనికిరానివాడుగా అయిపోతున్నాడు," అన్నది.

అక్కడేవుండి, అదంతా చూస్తూ వింటూన్న పెద్దబావమరది, "నిజమేనే అక్కయ్యా! కాని మనకంటే కాస్తనయం కదూ?"...అన్నాడు, బావగారివంక చూస్తూ, "వాడికి తాను చెడిపోతున్నట్టు జ్ఞానమైనా వున్నది. బావగారికి అదీ లేదు అన్నమాట!" ఎంత నాజూకుగా అన్నాడు. మందలింపుకు మందలింపూ ఉంది; హాస్యానికి హాస్యమూవుంది. ఇటువంటి బావమరదులు, మందలింపులు జీవితానికి పన్నీటి జల్లులు.

పువ్వులోని పరిమళమువలె, మిత్రుని వాక్కులలో వుండే అమృతమువలె, ఇవి మనోజ్ఞమైన సరసాలు. ఇంకొక గృహస్థు బావమరది, మరొక తమాషా పద్ధతిలో బావగారిని మృదువుగా మందలించాడు. ఆయన ప్రతిదినమూ రాత్రి తొమ్మిదిన్నర, పదింటికి గాని ఇంటికి వచ్చేవాడు కాదు. అంతవరకు కనిపెట్టుకొని కూర్చోవడము భార్యకు కష్టంగా ఉండేది. పిల్లలు ఆయన వచ్చేసరికి నిద్రపోతూవుండేవారు. పొద్దున పిల్లలు నిద్రలేవటానికి పూర్వమే ఆయన స్నానాది కృత్యములు నెరవేర్చుకొని, కాఫీత్రాగి పనిలోకి వెళ్ళిపోయేవాడు. ఇల్లాగ సంవత్సరాలు గడచిపోయినవి. పిల్లలు తండ్రిని చూచి ఎన్నాళ్ళయిందో!

బావమరది ఒక మంచివుపాయం ఆలోచించాడు: ఆరోజు పిల్లలనుతల్లిమధ్యాహ్నం బాగా నిద్రపుచ్చి సాయంత్రం అలంకరించి మంచి దుస్తులు వేసింది.

మేనమామ వాళ్లను దగ్గర కూర్చోబెట్టుకొని కబుర్లు చెబుతూ బావగారు వచ్చిందాకా నిద్రపోనీయలేదు బావగారు రావడంతోనే పిల్లలందరినీ వరుసగా నుంచోబెట్టి వాళ్ల తండ్రిని చూపిస్తూ, "నాయనా మీ తండ్రి! చాలా యోగ్యులు. పేరు సుబ్బారావుగారు. డబ్బు కూడా చాలా సంపాదించారు" అని చెప్పి, ఎరుకపరచి, "నమస్కరించండిరా!" అని బావగారితో, "వీరుసుబ్బారావుగారి పిల్లలు" అని చెప్పాడు. సుబ్బారావుగారు కూడా హాస్యప్రియుడు కావడంచేత చాలా సంతోషించినట్లు ముఖంపెట్టి అల్లాగా! చాలా సంతోషం. వినడమేగాని ఈ పిల్లలను ఎప్పుడూ చూడలేదు. సుబ్బారావుగారు చాలా ధన్యజీవి వారిని అభినందిస్తున్నాను అని భార్యవంక తిరిగి "ఈబిడ్డల తల్లిగారు తమరేనా?" అని చిరునవ్వు నవ్వి, బావమరదివంక తిరిగి "ఈరోజు సుదినం. ఈ కుటుంబంతో పరిచయమైనందులకు నేను చాలా గర్వమునూ సంతోషమునూ పొందుతున్నాను" అన్నారు. సరదాకు బావమరది ప్రారంభించిన నాటకము చివరిదాకా లాగినాక, ఆయనకు ఆవిషయం చక్కగా అర్థమైంది. మర్నాటినుంచి చాలా పెందలాడే ఇంటికి రావడము మొదలు పెట్టాడు. భార్యగాని, బావమరిదిగాని, మరదలుపిల్లగాని వేళాకోళముచేసినా, హాస్యమాడినా ఇట్లా వుండాలి. అంతేగాని ఒకరిపై ఒకరు రాళ్ళ వంటి హాస్యపు పలుకులు విసురుకోవడము హాస్యమంటే ఏమిటో ఎరుగని అరామక్రుష్ణ కవికి, తిమ్మనకవికే సరిపోయింది.

ఈ బావమరదుల హాస్యవచన ప్రతివచనములవలన ఇంట్లోవున్న అందరూ అనురాగం కలవారు అవుతారు. ఒకరియెడల ఒకరికి సానుభూతీ, అనురక్తీ ఏర్పడుతవి.

బావమరది పరిహాసోక్తులకు ఇంటావిడ ఇసిరింతలు, మరదలుపిల్ల దిసంతులు, అత్తగారి అణకింతలు, స్నేహితుల కోడిగాలు కూడా తోడైతే గృహం నందనవనం, స్వర్గధామము కావడానికి సందేహం లేదు.

ఈ సాంసారిక హాస్యమువలన తృప్తీ, ఆనందము కలుగుతున్నవి. హాస్యవచనముల యందు అనురక్తి వృద్ధి అయినకొద్దీ, హృదయ నైర్మల్యమూ, రసగ్రహణపారీణతా, ఆరోగ్యమూ ఎక్కువ అవుతవి. ఈ సాంసారిక హాస్యమే లేకపోతే ముక్కు పొడిగించుకొని ఒకరు, మూతిముడుచుకొని ఒకరు, కోపాలతో ముడుచుకుపోయిన ముఖాలతో కుటుంబములోనివారంతా ఎడముఖము పెడముఖముగా వుంటారు.

ఈస్థితిని పోగొట్టి అందరి ముఖాలను వికసింపచేయగల శక్తి ఈ సాంసారిక హాస్యానికి వున్నది. విచ్చిన తామరపుష్పములతో భాసించే నిండైన తటాకము, వికసించిన ముఖాలతో హసించే కుటుంబము ఈ రెండూ ఈ దుఃఖభూయిష్ఠమైన ప్రపంచంలో వున్నవారికి, స్వర్గసౌఖ్యాన్ని ఊహించుకోటానికి తోడ్పడే ఆధారాలు

—విజయవాడ రేడియో సౌజన్యంతో]

నాటక రంగం

"తిరస్కృతి" నాటక సమీక్ష

అందమైన అమ్మాయిల్ని చూసి పరవశమయ్యే స్వభావం మోహనుడిది. అన్నగారు ఆరోగ్యాన్ని కోల్పోయి శానిటోరియంలో వున్నాడు. మంచంపట్టిన పెద్ద కొడుకును, పట్టపగ్గాలు లేకుండా తిరుగుతున్న చిన్న కొడుకును, చూచి మతిస్థిమితం లేకుండా వున్నాడు తండ్రి మోహన్కు యింటి వ్యవహారాలలో శ్రద్ధలేదు. అన్నగారు ఎక్కడికి వెళ్లినదీ, ఎందుకు వెళ్లినదీ కూడా అతనికి తెలియదు. మోహన్ స్నేహితుడు చంద్రశేఖరం. మంచివాడు, బుద్ధిమంతుడు. మోహన్తండ్రి రమణయ్యగారి దగ్గర సెక్రటరీగా వున్నాడు చంద్రశేఖరం. మోహన్ తన మిత్రుడు చంద్రశేఖరంతో తను సాగించిన ప్రణయకథల గురించి ఉత్సాహంతో చెప్పుకుపోతున్నాడు. ఆ సమయంలో బెగురుచూపులతో, కంపిస్తున్న దేహంతో, చేతిలో పుస్తకాలతో ఓ చక్కని చుక్క మోహన్ముందు ప్రత్యక్షమవుతుంది. ఆమెను చూసీ చూడ్డంతోనే 'ప్రణయ కథకుడు' కొయ్యబారిపోయాడు. యిక్కడికి ఎందుకు వచ్చావ్ వెళ్ళిపొమ్మన్నాడు. మానాన్న చూస్తే కొంప మునుగుతుందన్నాడు. కాని ఆ అమ్మాయి అతని మాటల్ని వినిపించుకునే స్థితిలో లేదు. పరిస్థితి శృతిమించినదనీ తనను పెళ్ళి చేసుకోకపోతే తనకు ఆత్మహత్యకంటే గత్యంతరం లేదనీ కామేశ్వరి చెప్పింది. ఉత్తరక్షణంలో మోహనుడు దుష్యంతుడిగా మారిపోయాడు. అసలు నీ ముఖమే నాకు తెలియదు పొమ్మన్నాడు యీ సమయంలో అతని మిత్రుడు చంద్రశేఖరం కలుగజేసుకున్నాడు. ఎంత చెప్పినా మోహన్ వినలేదు. నిరాశతో కామేశ్వరి నిష్క్రమించింది.

కామేశ్వరితండ్రి కుటుంబయ్య చాలా బీదవాడు. చనిపోయిన కొడుకును తలచుకొని మంచం పట్టివున్నాడు. అతనిని పూరడించడానికి అతని బంధువు, బడిపంతులు అయిన సోమనాథం వస్తాడు. సోమనాథం విచిత్రమైన వ్యక్తి ముక్కూ ముఖం తెలియని మనిషితో నయినా ఆత్మబంధువుల్లో మాట్లాడినట్లు మాట్లాడే స్వభావం కలవాడు. అక్కడ అతను చంద్రశేఖరాన్ని కలుసుకున్నాడు. తన కొడుకుకు పెళ్ళిచేసేందుకు 500 రూపాయిలు అప్పు కావాలని ఆ సొమ్ము రమణయ్యగారిచేతః యిప్పించమని చంద్రశేఖరాన్ని అడుగుతాడు. రమణయ్యగారు అప్పు యివ్వరని, లాభంలేదని చంద్రశేఖరం చెబుతాడు. అలా అంటే వీలులేదని నువ్వు తప్పకుండా సహాయం చెయ్యాలని సోమనాథం ప్రాధేయపడతాడు. గత్యంతరంలేక సరే అంటాడు చంద్రశేఖరం. మర్నాడు సోమనాథం రమణయ్యగారి యింటికి వస్తాడు. చంద్రశేఖరాన్ని కలుసుకుంటాడు. యిద్దరూ మాట్లాడుకుంటూన్న సమయంలో వికలమనస్కుడైన రమణయ్య మేడ దిగివస్తాడు. సోమనాథం ఆత్మబంధువును చూసినట్లు పలకరిస్తాడు. యితను ఎవరు? అని అడుగుతాడు రమణయ్య. పిల్లలు కలవాణ్ణి, ఐదువందల రూపాయలు అప్పు కావాలనీ అంటాడు సోమనాథం. మనస్తిమితంలేని రమణయ్యకు యీ మాట వినగానే కోపం వస్తుంది. డబ్బులేనివాడవు పిల్లల్ని ఎందుకు కన్నావ్ బయటకు పొమ్మంటాడు సోమనాథంకూడా కోపంతో రెచ్చిపోతాడు సరిగా ఆ సమయంలో రమణయ్యకు టెలిగ్రాం వచ్చింది. శానిటోరియంలో వున్న పెద్దకొడుకు జీవితాన్ని చాలించాడని. యీ వార్త తెలియగానే రమణయ్య నిలువునా కూలిపోతాడు. బద్ధవిరోధిలా పోట్లాడిన సోమనాథం రమణయ్యకు ఉపచారాలు చేస్తాడు.

సోమనాథం, చంద్రశేఖరం కలిసి కామేశ్వరిని వివాహం చేసుకోమని మోహనుడిని మర్యాదగా అడుగుతారు. అతను అంగీకరించడు. అతనిని బలవంతంగా అంగీకరింప చెయ్యడానికి ప్రయత్నిస్తారు. కామేశ్వరి ఆ సమయంలో ముందుకువచ్చి మోహనుడిని విడిచిపెట్టమని చెబుతుంది. అటువంటి మనిషిని తను ఎంతమాత్రం వివాహం చేసుకోలేనని తిరస్కరిస్తుంది.

"తిరస్కృతి" నాటకం. 12-5-57 తేదీ రాత్రి విశాఖపట్నం టౌనుహాలులో ప్రదర్శించ బడినది. సుప్రసిద్ధ రచయిత శ్రీ రాచకొండ విశ్వనాథశాస్త్రిగారి రచన. "వచ్చే కాలం" శీర్షికతో ఈ నాటకం 'భారతి'లో యిటీవల ప్రచురింపబడినది. సహజమైన హాస్యధోరణిలో సంభాషణలు నడిచినై. విశాఖ నాటక కళామండలివారు ఈ నాటకాన్ని చక్కగా ప్రదర్శించారు. కథలో ఎంత పట్టువున్నా సన్నివేశాలు కూడా తగినన్ని వుండాలి మరికొన్ని సన్నివేశాలు వుంటే యీ నాటకం రంగస్థలంమీద ఇంకా ఎక్కువ రక్తికట్టివుండేది.

రమణయ్యగా శ్రీ అచ్యుతరామరాజు, సోమనాథంగా శ్రీ సన్యాసిరాజు, చంద్రశేఖరంగా శ్రీ సోమేశ్వరరావు ప్రతిభావంతముగా నటించారు. కామేశ్వరిగా కుమారి రాజేశ్వరి, మోహన్గా శ్రీ గోపాలరాజుగార్ల నటన సంతృప్తికరంగా లేదు.

కొత్తనాటకాలు కావాలంటున్న యీ రోజులలో యిటువంటి మంచినాటకాన్ని ప్రదర్శించిన విశాఖ నాటక కళామండలి వారు అభినందనీయులు.

—సూర్యారావు.

సినిమా

మనసారగ రససాగర-

—మంచి పాటలు, చెలి పాడగ విని—
ఆనందించే ఏర్పాటు బాగుంటుంది.

పరుగులూ ఉరకలుగా జీవితాలు సాగే ఈరోజుల్లో అందరికీ ఇలాటి సదుపాయాలు కుదరడం సులభంకాదు.

తోట కొన్నాని, చెలిని కనుగొని తీసుకొచ్చి కూర్చోపెట్టి, వెన్నెలా, పిల్ల గాలి, పూలపరిమళం సమకూర్చుకున్నాక, తీరా, ఆ చెలికి పాట రాక పోవచ్చు, వచ్చినా అది బాగుండక పోవచ్చు. ఇన్నీ కుదిరిన వాళ్లకీ, తీరుబాటు లేక పోవడమో, అలా ప్రశాంతంగా కొన్ని నిముషాలు తోటలో కూర్చోవాలని మనసారగ వారికి కోరికలూ లేక పోవడమో కూడా జరుగవచ్చు.

అందువల్ల, ఈ 20 వ శతాబ్దం ఉత్తరార్ధంలో, ప్రాణాలకు హాయి అనిపించగల సంగీతం అందించగల సాధనాలలో సినిమా ముఖ్యమైనదైంది. కథలో నాయకుడు పూలతోటలో కూర్చుని ప్రేయసి పాటను వింటూ, చెట్లసైతే మధ్యలో తనూ అందుకుంటూ ఉన్నప్పుడు, సినిమాకు వెళ్ళిన వాళ్ళకీ, ఒక మంచి పాటను, ఆ పాటకు తగ్గ వాతావరణంలో కూర్చుని వింటున్న అనుభూతి కలిగి తృప్తినిస్తుంది. అప్పుడు ఆ మూడు నిముషాల కోసం మళ్లీ వెళ్లాలని కూడా మనసౌతుంది.

పదేళ్ల నాటి కథ వేరు. ఆనాటి కన్న ఈనాడు చలన చిత్రంలో సంగీతం ప్రాముఖ్యం ఎంతో పెరిగింది. కేవలం పాటల వల్లనే ఎన్నో చిత్రాలు లక్షలాది ప్రజల ఆదరణకు పాత్రము లవుతున్నాయి.

అందువల్ల ఈనాడు సినిమాకి బయల్దేరే వాళ్లు చాలామంది సంగీత దర్శకుడెవరు? పాటలు బాగున్నాయా అని కనుక్కొని మరీ వెళ్తున్నారు.

పాటలు బాగుంటాయన్న ఆశకూడా పెట్టుకునో, పాటలే బాగుంటాయనో, పాటలు బాగున్నా చాలుననో వెళ్ళే వాళ్లందరికీ ఈనాడు సినిమాలు అందిస్తున్న సంగీతం ఎలాటిది? ఏపాటిది? ఏ జాతిది? అని ఆలోచించ బుద్ధేస్తుంది.

(55-వ పేజీ చూడండి)



దర్శకుడు ప్రసాద్ బొంబాయిలో నిర్మిస్తున్న హిందీ చిత్రం "శారద" లో ఒక సన్నివేశం. రాజ్ కపూర్, మీనాకుమారి కలసి నటించే తొలిచిత్రం ఇదే. మధ్యనున్న నటుడు ఆగా.

చిత్ర సమీక్ష:

'ప్యాసా'

"చచ్చినవాడి కళ్లు చారడేసి" అన్నవాళ్లు, కేవలం యతి పొగ్గా కుదిరింది గదా అనే ఆ మాటను అనలేదు. లోకపు తీరును చూచి చూచి, తూచి తూచి మరీ ప్రపంచించారు.

లోకోక్తులలో ఎంత సత్యముంటుందో అంతటి సౌందర్యం కూడా ఉంటుంది. ఎంతటి వాడితనం ఉందో అంత పనివాడితనం ఉంటుంది. అనల్పమైన శిల్పం ఉంటుంది. దానివల్లనే ఆ ఉక్తులలో శక్తి స్థిరమై నిలుస్తుంది. అవి ఎన్నాళ్లయినా మాసిపోవు, మారిపోవు; చెరిగిపోవు.

వాటిలో కనబడే ఈ శిల్పం, పనివాడితనం తీరి కూర్చుని తీర్చిదిద్దిన కనిపించదు. కృత్రిమత్వం కనిపించదు. అవి స్వచ్ఛమైన పాలు. వాటిలో నీరుకలపలేదు. కలిపితే ఎలా తయారవుతాయో తెలుసుకోవాలంటే, "ప్యాసా" (గురుదత్ ఫిలింస్) చిత్రాన్ని చూడవచ్చు. బొంబాయి బాక్సాఫీస్ తీర్థ మాహాత్మ్యం బాగా తెలుసుకోవాలంటే మరోసారి కూడా చూడవచ్చు. (పనిలోపనిగా, "గొప్ప ప్రయత్నం చేసిన ఒక మంచి కళాకారుడి కృషిని" ప్రోత్సహించినట్లవుతుంది.)

చచ్చినవాడి కళ్లు చారెడు. అందుకనే, "నువ్వు అమాంతం గొప్పవాడివి కావాలనుకుంటే, హఠాత్తుగా చచ్చిపో" అన్నాడు— మనుషులనూ, వాళ్ల మనసులనూ తూచి చూచి, గుణగణాలను కాచివడబోసి వంటబట్టించుకున్న ఒకాయన; ఊచిపుచ్చుకు చెంపకాయకొట్టినంత గట్టిగా.

అలా ఎవరేనా పోతున్నా, అన్నాడని ఖరారుగా తెలిసినా మర్నాడు తెల్లారేసరికల్లా పలుకురూ "ఆ పోయిన ఫలానావాడు చాలా గొప్పవాడేస్మీ! ఆ పైనం వాడు బతికుండగా మనం పసిగట్టలేకపోయాము" అని పల్లీకువ ఒప్పేసుకుని, వాడి కళ్లు చారెడేసి ఉండేవని "తీర్మానాలు పెట్టేస్తారు" శక్తిమించిన మంచితనంతో.

"కాబట్టే, ఆ చచ్చినవాడు, మళ్లీ బతికొచ్చి, 'నేను చావలేదు స్వామీ, అదృష్టవశాత్తూను' అంటే, తక్షణం ఆ యొక్క లోకుల దృష్టిలో వాడి చారెడేసి కళ్లూ చింతకాయలంత చిన్నవై ఊరుకుంటాయి. వాళ్లు వాణ్ని భరించలేరు; వాడు బతికున్నాడని నిజం చెబితే సహించలేరు." అని చాటి, ఆ సత్యాన్ని నిరూపించి



"ప్యాసా" చిత్రంలో వహీదా.



చందమామా ఫిలింస్ వారి "దొంగల్లో దొర" చిత్రంలో ఎ. నాగేశ్వరరావు, నర్తకి ఇ. వి. సరోజ, జి. వరలక్ష్మి, ఆర్. నాగేశ్వరరావు.

ప్యాసా

స్థాపించడం "ప్యాసా" దర్శక నిర్మాత, గురుదత్ లక్ష్యం.

ఈ లక్ష్యం లక్షణం గురుదత్‌కు మన చలనచిత్ర కళాకారులలో అగ్రశ్రేణి స్థానాన్ని ఇస్తూంది. అయితే, దీన్ని ప్రజలకు అందచేయడంకోసం అతడు కల్పించిన కథను పరికిస్తే, అందులోమటుకు పరిణతి చెందిన కళాకారుడి ప్రతిభ తాలూకు క్రీనీడలుకూడా కనబడవు.

ఇందులో ఉన్న మంచి ముత్యంలాంటి జీవిత సత్యాన్ని, దాని చుట్టూ కథ పేరిట పూసిన బొంబాయి సినీ పాలిష్ చూసినప్పుడు, ఆ సత్యాన్ని చూచిన దృష్టికీ, దాన్ని ఈ చిత్రకథలో అమర్చడానికి చోటు వెదకిన దృష్టికీ చాలాదూరం ఉందని తోస్తుంది. అదెవరిదో ఇదెవరిదో తెలియదు గాని రెండింటిమటుకు ఏమంత అఖండమైన దనిపించదు. "లోకానికి" గట్టిగా మొహం వాచేలా చివాట్లు పెట్టేసి, సంఘాన్ని కాస్త సంస్కరించేసి, వీలైతే దేశాన్ని మరో అరంగుళం ఉద్ధరించెయ్యాలన్న ఉత్సాహం, వేడీ మాత్రం ఇందులో కనిపిస్తాయి. కాని, ఎందుకు కోప్పడుతున్నారు అవి ఎవరూ అడిగే అవసరం లేకుండా ముందు జాగ్రత్త ఉండాలన్న ఆలోచన ఉన్నట్లు కనిపించదు.

"ప్యాసా" ఒక కవి కష్టాల కథ. అతను పద్యాలు రాస్తాడు.

అతడు మంచికవిత్వమే వ్రాస్తాడు అని గురుదత్ ఫిలింస్ వారు ముందుగా సర్టిఫికెట్ ఇచ్చారు. ఆ పద్యాలను లోకం ఆదరించలేదు. అయితే 'లోకానికి', ఫలానా విజయ్ అనే వయోజనుడు కవిత్వం రాస్తున్నాడని పన్నెండు రీళ్ళు ఫిలిం తిరిగే వరకూ తెలీదు. కాబట్టి లోకంఅంటే, మొదటి రెండు రీళ్ళలోనూ చెప్పకోవలసిన అర్థం ఒకచిన్న బస్తీలోని పత్రిక సంపాదకుడు అని. దర్శకుడు గురుదత్ అతన్ని కూడా వట్టి వెర్రివెంగళాయిగా, సర్కస్ బఫూన్‌గా, కుడిఎడమలు తెలియనిఅవివేకిగా (బొంబాయి ఫిలిం వయోజనులదృష్టిఅంతకు మించి ముందుకుపోలేదు. ఇది మామూలే.) చూపించినందువల్ల, కథ ప్రకారం కాబోయే మహాకవి మనుష్యుల తత్వాలను, జీవిత సత్యాలను చక్కగా ఆకళించుకుని మరీ కవిత్వం చెప్పగలిగిన ధీశాలీఅయిన విజయ్, అటువంటి వాడిచుట్టూ తిరగడమే ఒకతప్పు. (ప్రపంచంలో ఇంక పత్రికలే లేనట్టు ఆ ఉన్న పత్రికకూడా చిన్నదనీ, కాబట్టి ఈ కవితను అచ్చువేసినా ఆటే ఇచ్చుకోలేదనీ చూస్తే తెలుస్తూనేఉంది.) ఆపైన, ఆ జడ్డి సంపాదకుడు తనను ఆదరించనందుకు ఈకవి సరాసరి పార్కుకెళ్ళి అక్కడ బెంచిమీద పడుకుని బెంగెట్టుకోవడం తప్ప మరో ప్రయత్నం చేయకపోవడం మరో తప్పు. బియ్యే గ్రాపాసైన వాడు, ఉద్యోగం లాంటి ప్రయత్నాలు చేస్తాడని అతన్ని చదివించినవాళ్లు ఆశించడం సహజం. అది చెయ్యకపోతే విసుక్కోడం కూడా సహజమే. అదీ ఒక తప్పుగానే "బొంబాయిసినిమా వైద్యులు" చూపించారు. కాగా ఐదారురీళ్లయ్యాక 'లోకం' అన్న మాటకు మరోఅర్థం ఒక ప్రచురణకర్త. తనభార్య కాలేజీరోజుల్లో ఈకవిని ప్రేమించిందని, ఇంకా మధన పడుతున్నదనీ తెలిసినందువల్లా, అతడు ఆ కవిత్వంమీద పేరూడబ్బూ గడించుకోలేకపోయినందువల్లా, తన భార్య అతని ప్రేమను ఒకప్పుడు త్రోసిరాజన్నదనీ తెలుసుకునే తెలివితేటలున్నందువల్లా ఆ ప్రచురణకర్త స్వయంగా ఈ కవి పురోభివృద్ధికి దోహదం చేయక పోవడం సహజం. ఇంతకుమించి, కవికి అన్యాయంచేసిన 'లోకం' ఏమిటో ఈ కథ ప్రకారం బోధపడదు. అసలు లోకానికేం తెలీదుగదా. ఇతడు బాధ పడుతున్నాడని!

కూడా లోకానికి తెలిసే ప్రయత్నాలు చేసినట్టు సూచన ప్రాయంగా చెప్పడం కూడా జరగలేదు.

కాని ఇదే గురుదత్ విన్యాసాలకు ఆధారం. అతనిని చూచి మనం జాలిపడాలని కోరుతూ అతడు చూపిన కారణం. ఈవిధంగా బద్ధకిష్టి అయిఉండి, పైగా లోకం తనకి అన్యాయం చేసిందని బాధపడి, అందుకోసం తనమీద అందరూ జాలిపడాలనేవాడినిచూస్తే చిరాకు కలుగుతుంది.

అయినా గోరంతలనే గురుదత్ కొండం తలుచేసి చూపించారు. ఒక విషయాన్ని కళాదృష్టితో చూచి చూపించినపుడు, భూతద్దం ఉపయోగించడం, అతిశయోక్తులు విరివిగా వాడడం పరిపాటే. కాని, దాని కైనా ప్రాతిపదిక కట్టుదిట్టగా ఉండాలి. నిజమే అని నమ్మతగ్గదిగా ఉండాలి.

పైకి ఎగిరేవాడు ముందర కాలూనడానికి కొత్త గట్టి నేల చూచుకు మరీ ఎగరడం అవసరం. ఊబి నేల మీద ఎలాగో నిలిచి ... డినించి ఎగరబోతే అది వీలుకాదు.

...యితే, ఇది సినిమా కాబట్టి, అందు లోనూ బొంబాయి సినిమా కాబట్టి, కథకి చికిత్స చేసినవారు బొంబాయి ప్రవీణులు కాబట్టి అసాధ్యాలు సుసాధ్యాలు కావడం అద్భుత విషయం కాదు.

సరే, ఆ కవి ఓరోజున రైలుకిందపడి చనిపోయాడని పుకారు పుడుతుంది. అతన్ని ప్రేమించిన ఒక పతితస్త్రీ, తనదగ్గర ఉన్న కొద్దిడబ్బూ పెట్టి, అతని అముద్రిత కావ్య ఖండాలను అచ్చువేయిస్తుంది. గురుదత్ కోపానికి గురి అయిన 'లోకమే,' తక్షణం ఆ పుస్తకాలు చదివి కవి ప్రతిభ గ్రహించి అతన్ని గౌరవిస్తుంది.

...రా సంతాపసభలు జరిగే వేళకు, కవి స్వయంగా వచ్చి ఒక పాటపాడి, నేను చనిపోలేదని చెప్పిచూస్తాడు. కాని సహజంగానే అతని పూర్వకథ తెలియని ప్రజలు ముందర నమ్మరు; తెలిసిన ప్రచురణకర్త, అన్నదమ్ములూ స్వార్థపరులై, అతనికి అన్యాయం తలపెడతారు.

కవికి లోకంమీద కోపం, ఆ తరవాత వీవ గింపు, కలుగుతాయి. తను చనిపోయాడన్న అబద్ధమే నిజమని ఖాయపరచి, వహీదా రెహమాన్‌తో కలిసి అలా దిగంతాలవేపు షికారెళ్లిపోతాడు సాయంసంధ్యలోకి.

అక్కడ ఇల్లూ వాకిలీ తిండీ గుడ్డా దొరి ...లేదో మనకి తెలియదు.

...అదీ కథ.

అతి సహజం అయినా అద్భుతంగా గోచరించగల ఈ జగతిరీతి గురించిన సత్యాన్ని తెలియచెప్పడానికి పైవిధంగా కట్టిన ఈ కథలో, "బొంబాయి నిపుణుల చికిత్స" ఫలితంగా, ఆ రెండు లక్షణాలు కూడా శూన్యం అయిపోయాయి.



సొహ్రాబ్ మోడీ భారీఎత్తున నిర్మిస్తున్న "నౌషర్వాన్"లో నసీం- సొహ్రాబ్ మోడీ

అయినా అనేకవిధాల "ప్యాసా" చిత్రం ప్రశంసనీయమైన కృషి ఫలితం అనాలి. 1956 బాక్సాఫీసు సూత్రాలు, పెకిలీ నృత్యాలూ లేవు. కథ చిత్రణ, నటన, సంగీతం, కథాంశం (కథ కాదు) స్థాయికి తగ్గట్టు ఒప్పాయి. ఛాయగ్రహణం (వి. కె. మూర్తి) కూడా కథ తత్వాన్ని, చూసేవాడికి తెలియ చెప్పగలిగే శక్తితో, చైతన్యంతో సాగింది.

కథతో ప్రత్యక్షసంబంధం లేకపోయినా, చాలారోజులు మనసులో మెదిలి ఆలోచనలు రేకెత్తించి, తోటి మానవుల మీద జాలి పడడానికి కాస్తంత తీరుబాటు చేసుకునే సత్సంకల్పం కలిగించేటంత గొప్ప సన్నివేశాలు ఉన్నాయి. వీటిలో దర్శకుడి ప్రతిభ మెచ్చతగినది.

గురుదత్ దర్శకత్వంతోపాటు ముఖ్య భూమికనుకూడా నిర్వహించాడు. అతన్ని ప్రేమించిన పతితగా వహీదా రెహమాన్, వంచించిన వనితగా మాలా సిన్హా, ఆమె భర్తగా రెహమాన్. ("రాజ్ రాణి") నటించారు. జానీవాకర్, మహమూద్ కుంకుం, ప్రభృతులు పాల్గొన్నారు.

నర్తకిగా పేరు గడించుకున్న వహీదా ఈచిత్రంలో ఉత్తమశ్రేణినటిగా తన ప్రతిభను నిరూపించింది. నటులలో అత్యుత్తమంగా పాత్రను పోషించినవాడు రెహమాన్.

కృత్రిమంగా, అసహజంగా కనిపించే కథవల్ల, సానుభూతి బదులు చిరాకు కలిగించే తరహాలో రూపకల్పనచేసిన భూమిక వల్ల, కవిగా గురుదత్ ప్రదర్శించిన నటన రాణించలేదు. భ్రుకుటి ముడిచి, దిగులుగా ప్రేక్షకులవంక చూడడంతప్ప అతను చేసిన దాట్టే కనపడదు. పాటలు పాడిన సన్నివేశాలుమటుకు బాగున్నాయి. పాటలకు శచిన్ దేవ్ బర్మన్ కూర్చిన సంగీతమూ చాలా హాయిగా ఉంది. ఉన్నవాటిలో రఫీ పాడిన 'కహాఁ హై' అనేపాట చాలా బాగుంది.

మొత్తానికి, ఉన్న లోపాలన్నీ లెక్కకు తీసుకున్నా, 'ప్యాసా' మంచిచిత్రం; గురుదత్ మంచిదర్శకుడు. ఎటొచ్చి బెంగాలీ, మహారాష్ట్ర, తెలుగు కళాకారుల శక్తిని ఈ సందర్భంలో ప్రస్తావించుకోరాదు. "ప్యాసా" బొంబాయి చిత్రాలలో మహావృక్షం. ★



దీప్ అండ్ ప్రదీప్ వారి హిందీ చిత్రం 'పోలీస్' లో మధుబాల.

★ బొంబాయి సినిమా లేఖ ★

అతురాలా న్యాయమూర్తి అనిపించుకున్న పర్షియన్ చక్రవర్తి నౌషెర్వాన్ గురించిన కథలన్నీ గుదిగుచ్చి, ఒక ప్రేమకథలో వాటిని అమర్చి, బ్రహ్మాండమైన సెట్స్‌తో హంగులతో, దర్శక నిర్మాత సొహ్రాబ్ మోడీ "నౌషెర్వాన్-ఎ-అదిల్" చిత్రాన్ని చురుకుగా నిర్మిస్తున్నారు దర్శకత్వంతోపాటు, చక్రవర్తి భూమికను కూడా ఆయనే నిర్వహిస్తున్నారు

ప్రేయసీ ప్రియులు రాజకుమార్, మాలా సిన్హా అతడు రాజకుమారుడు ఆమె సామాన్య వనిత వాళ్ళ ప్రేమకథ, రాజ్యంలో పెద్ద కల్లోలం లేవదీసినంత పనిచేస్తుంది చివరకు చక్రవర్తి తనకుమారుడికి వ్యతిరేకంగా తీర్పు చెబుతాడు న్యాయం పేరిట

ఈచిత్ర నిర్మాణంలో మరోవిశేషం పదేళ్ళనాటి వెండి తెరరాణి నసీం పునరాగమనం. ఇందులో ఆమె మహారాణిగా నటిస్తుంది

ఈచిత్రానికి సంగీత దర్శకుడు సి రామచంద్ర.

* * *

రామచంద్ర సంగీతం సమకూర్చుతున్న మరోచిత్రం వీనస్ పిక్చర్స్‌వారి తొలి హిందీచిత్రం తమిళంలో విజయవంతంగా సాగిన "అమరదీపం" ను వారు ఇపుడు హిందీలో పునర్నిర్మించ బూనుకోవడం విదితమే దేవానంద్, పద్మిని, వైజయంతిమాల నటిస్తున్నారు

* * *

అర్జనలో (ఒక్కొక్క చిత్రానికి) నౌషాద్ తరువాతి వాడనతగ్గ ఒ పి నయ్యార్ చిరకాలంగా ఎదురు చూస్తున మహదవకాశం ఇప్పుడు లభించింది బి మిత్రా గేవా కలర్‌లో నిర్మిస్తున్న "ఫణుక్" చిత్రానికి శాస్త్రీయమైన సంగీతం సమకూర్చడానికి ఏర్పాటు జరిగింది భైరవి (హిందూస్థానీ) రాగాలన్నీ ప్రధానంగా ఉపయోగించి సంగీతం కూర్చదలచినట్లు నయ్యార్ చెప్పాడు.

(విదేశీవాళ్ళ సంగీతాన్ని నయ్యార్ అనుకరిస్తాడని అందరికీ తెలుసు ఆ సంగతి అతడే చెబుతాడు కాని అతడు కొత్తల్లో దేశీయమైన సంగీతం సమకూర్చబోయినా, అతన్ని నియమించినవారు అందుమీద నమ్మకంలేక అంగీకరించలేదు ఈ రోజున నయ్యార్ బొంబాయి ఫిలిం ప్రపంచంలో అగ్రశ్రేణి సంగీతదర్శకుడు నచ్చచెప్పి ఒప్పించే శక్తి గడించి, ఒప్పించి ఇప్పుడు అందుకు పూనుకున్నాడు)

'ఫణుక్' చిత్రంలో భరత్ భూషణ్, వైజయంతిమాల నటిస్తున్నారు

* * *

నయ్యార్ సంగీత దర్శకత్వం వహించే మరో చిత్రం బి ఆర్ చోప్రా నిర్మిస్తున్న "నయాదౌర్" దిలీప్‌కుమార్, వైజయంతిమాల, అజిత్, చాంద్ ఉస్మానీ ఇందులో పాల్గొంటున్నారు కమ్యూనిటీ ప్రాజెక్టులకు ఈచిత్రం ఇతివృత్తంలో విశేష ప్రాధాన్యం ఉంది చాలా ఘట్టాలను భోపాల్, పూనా పరిసరాలలో [illegible] కార్యక్రమాలు అమలు జరిగేచోటకు వెళ్లి చిత్రించారు

* * *

'కె ఎస్ ఫిలింస్'వారి తొలి కానుక "చల్తీకా నామ్ గాడీ" నిర్మాణం గతవారం రామన్ స్టుడియోలో ప్రారంభంఅయింది

కిశోర్‌కుమార్ పాడిన రెండు పాటలను ముందు రికార్డుచేసి, ఆపైన అతడూ మధుబాల పాల్గొన్న రెండుమూడు సన్నివేశా

★ కీ|| శే|| హేమలత ★



మంచినటి అని పేరుగడించుకున్న సి హేమలతాదేవి జూన్ ఒకటో తేదీ మధ్యాహ్నం పన్నెండు గంటలకు, గుండెజబ్బువల్ల చనిపోయింది కొన్నాళ్ళుగా ఆమె అస్వస్థతతో తీసుకుంది హేమలత వయసు 88 ఏళ్ళు

1942 లో "తారుమారు" (జగన్నాథ్ ప్రొడక్షన్స్) అనేచిత్రంలో హేమలత, కీ|| శే|| పరబ్రహ్మశాస్త్రి గారితో కలసి నటించింది దానితో ఆమె మంచిపేరు తెచ్చుకుంది ఆతరవాత అనేక తెలుగుచిత్రాలలో ఆమె ప్రముఖ భూమికలు నిర్వహించింది. "మంత్రదండం" అనేచిత్రం నిర్మాణంలో కూడా పాల్గొంది

"చండీరాణి," "గృహప్రవేశం" "రోజులుమారాయి" "ఏదినిజం?" "పెద్దరికాలు" మొదలైన చిత్రాలలో ఆమెనటన సర్వత్రా ప్రశంస లందుకుంది

ఎబ్బెట్టుగా, కృత్రిమంగా తోచకుండా, మితిమీరకుండా, సౌలభ్యం ఉట్టిపడేలా నటించగల కొద్దిమందిలో హేమలత ఒకరె

"ఆమె శ్రమపడదు ఎదటివా[illegible]పెట్టదు తనపాత్ర మంచిచెడ్డలు తెలుసు కాని, పదిసార్లు చెప్పించుకోనవసరం లేకుండా నటించేది"అని ఆమెతో పనిచేసిన ఫిలింకళాకారులంతా అన్నారు ★



ప్రతిభావారి "దొంగలున్నారు జాగ్రత్త"లో గిరిజ, జగ్గయ్య.

లను షూట్ చేశారు. దర్శకుడు సత్యేన్ ('బందిష్') బోస్.

ఈ చిత్రంలో గంగూలీ సోదరులు-అశోక్, కిశోర్, అనూప్‌కుమార్ లు ముగ్గురూ పాల్గొంటున్నారు. ఇతర నటులు కె. ఎన్. సింగ్, అచలాసచ్‌దేవ్.

దీనికి కథ స్క్రిన్‌ప్లే సుప్రేంద్ కర్ [illegible]శారు. సంభాషణలు రమేష్‌పంత్. పాటలు మజ్రూసుల్తాన్‌పురీ.

సంగీతదర్శకుడు సచిన్ దేవ్ బర్మన్. నిర్మాత అనూప్‌శర్మ.

మద్రాస్ టాకీస్ వారి "పాయల్"

మే ఆఖరువారంలో ఇక్కడ విడుదలయిన చిత్రం మద్రాసు టాకీస్ వారి 'పాయల్' ఒకటే. మద్రాసు సిటాడెల్ స్టుడియోలో జోసెఫ్‌తామస్ నిర్మించిన ఈ చిత్రానికి కథ నేరపరిశోధన ప్రాతిపదికగా అల్లినది. పాటలూ, నృత్యాలూ పుష్కలంగా ఉన్నాయి. పద్మినీ, సునీల్ దత్ ముఖ్య నటీనటులు. రాగిణి, బిపిన్‌గుప్త, బేబీనాజ్ పాల్గొన్నారు. దర్శకులు జోసెఫ్ తైలాత్ జూనియర్. సంగీతం హేమంతకుమార్.

ఈచిత్రంలో చాలా బాగున్నవి పద్మిని బృందం నృత్యాలు. వాటికి హేమంతకుమార్ కూర్చిన సంగీతం.

బోలే కథ చెప్పినపద్ధతి, వివిధ సన్నివేశాల చిత్రణ అతిసామాన్యంగా చప్పగా ఉన్న సంభాషణలూ, ప్రతిభలేని దర్శకత్వం కలిసి ఈచిత్రం రాణించకుండా ఉండడానికి చాలా దోహదంచేశాయి. అనేక ఘట్టాలను నిష్కారణంగా సాగదీసినందువల్ల విసుగు కలుగుతుంది.

బేబీనాజ్, బిపిన్‌గుప్త, డేవిడ్, ఉన్నవారిలో ఉత్తమంగా నటించారు. నాయకీనాయకులు పద్మినీ, సునిల్‌దత్‌ల నటన అతిసామాన్యంగా ఉంది. సెక్స్ అపీల్ ఏర్పాట్లు చాలాఉన్నాయి. కాగా, రాగిణి నర్తకిగాతప్ప నటిగా రాణించదన్న భావం ఇప్పుడు ఋజువైందనిపిస్తుంది.

(ఆంధ్ర వారపత్రిక బొంబాయి విలేఖరి.)

మనసారగ...

(50-వ పేజీ తరువాయి)

"మనసారగ చెలిపాడగ" విని, కథలో నాయకుడు ఆనందిస్తే, అది కనీ వినీ తనూ అందులో పాలుపంచుకోవాలనుకున్న ప్రేక్షకుడికి "ఈ చెలి పాడిన ఈ పాట మొన్న ఇంకో హిందీ సినిమాలో విన్నది గాదా" అనిపిస్తుంది.

హాలీవుడ్ చిత్రాలు చూసే వాడికి, ఇంగ్లీషు, స్పానిష్ ప్రభృతి దేశాల సంగీతం విన్నవాడికీ, హిందీ సినిమాలో పాటలు వింటున్నప్పుడు "ఇవి పచ్చికాపీ" అని అనిపిస్తుంది.

ఇంగ్లీషు లాటిన్ అమెరికన్ సంగీతపు మట్లను బొంబాయివాళ్లు దింపేస్తున్నారు. వాటిని క్రమంగా మద్రాసు చలనచిత్ర కారులు భరవడిగా శిరసావహిస్తున్నారు.

చివరకేమౌతోంది?

మనమటుకు మనం ఆలోచించుకుంటే, మన సంగీతం అనేదినామరూపాలు లేకుండా పోయే ప్రమాదం ఏర్పడుతోంది. గావుకేకలు, పిల్లికూతలూ, ఎక్కిళ్లూ సంగీతంలో జమఅయిపోతున్నాయి.

కళాకారుడి వ్యక్తిత్వానికి అవమానకరం అనర్గ అనుకరణ, చివరకు ఫాషన్‌గా, ప్రతిభగా చెలామణీ అవుతోంది. తియ్యటి తెలుగు సంగీతం వినే అలవాటు, మెచ్చుకునే ధోరణీ కూడా క్రమంగా అంతరించిపోయేటంత ప్రమాదం ఏర్పడుతోంది; ఈనాటి తరహాలుచూస్తే. విదేశీవాళీ సంగీత ప్రభావం అంత ముమ్మరం అయిపోతోంది.

ఇంతకీ తేలికగా హాయిగా ఉండే పాటలు తగవనీ, శాస్త్రీయ సంగీతాన్నే సినిమాలలో వినిపించాలనీ ఎవరూ అనరు. మనకు గల స్వరార్ణవాన్ని మథించి వినియోగిస్తే, ఏ దేశానికీ ఏ ప్రాంతానికీ తీసిపోని లలిత సంగీతాన్ని సృష్టించుకోవచ్చు. మన సరసనే మరొకరు ఎరువు పట్టికెళ్లే పరిస్థితులు తీసుకురావచ్చు. కాని, అలాటి పనులు మనం తప్ప మరెవరూ చేసేలా లేరు.

పాశ్చాత్యులు మన సంగీతం విని బాగుందన్నారు, తలలూపారు తప్ప అనుకరించలేదు. మంచి గుణాలను ఎక్కడేనా చూచి నేర్చుకోవచ్చుగాని, మరీ ముందు వెనకలు లేకుండా, బాణీలనే అనుకరించడం మంచిది కాదు.

ఈనాడు మన చిత్రాలన్నీ మరొకరి పాటల మట్లతో నిండిపోతున్నాయన్నా, ప్రజల అభిరుచిని కలుషితం చేస్తున్నాయన్నా, అందుకు కారణం సంగీత దర్శకులు చేస్తున్న పనికాదు. వారిలో ఆధోరణి ప్రోత్సహించి, అనుకరణలు అలవాటు చేస్తున్న చలనచిత్రకారులే అని ఆశాలి.



"సువర్ణ సుందరి" చిత్రంలో పాల్గొన్న బృందానికి నిర్మాతలు విందుచేశారు ఎడమనుండి బాలకృష్ణ, పుష్పలత, అతిథిగావచ్చిన సావిత్రి, 'సువర్ణసుందరి' తమిళ్‌చిత్రంలో నాయకుడు జెమినీ ఆర్ గణేష్, వీనస్ స్టుడియో సౌండ్ ఇంజనీరు జె సూర్యనారాయణ, ఎ నాగేశ్వరరావు, సముద్రాల రాఘవాచార్య, దర్శకుడు వేదాంతం రాఘవయ్య, చమేరియా అధిపతి సుందర్‌లాల్ నహాతా, అంజలీదేవి, ఆమె కుమారుడు అంజి. వెనకనున్నవారు నిర్మాత, సంగీతదర్శకుడు అయిన ఆదినారాయణ.

'సువర్ణసుందరి' బృందానికి విందు

అంజలీ పిక్చర్స్ వారి 'సువర్ణసుందరి' చిత్రం విజయవంతంగా సాగుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని, నిర్మాతలు శ్రీ ఆదినారాయణరావు, శ్రీమతి అంజలీదేవి తమ చిత్రాన్ని విజయవంతంగా, నిర్ణీత కాలంలో పూర్తిచేసి విడుదలచేయడానికి సహకరించిన, సాంకేతికజ్ఞులు, నటీనటులు, స్టూడియో కార్మికులు, యితర శాఖలలోని వ్యక్తులు, శ్రేయోభిలాషులు అందర్నీ ఆహ్వానించి, మే 26 వ తేదీ ఆదివారం రాత్రి 9 గంటలకు వీనస్ స్టూడియో ఆవరణలో విందుభోజనం ఏర్పాటు చేశారు మూడు వందలమంది పాల్గొన్నారు నిర్మాత దంపతులు శ్రీమతి అంజలీదేవి, ఆదినారాయణ రావులు, అతిథులందరికీ పూలమాలలు వేసి స్వాగతమిచ్చారు భోజనానంతరం, హీరో శ్రీ నాగేశ్వరరావు మాట్లాడుతూ "చిత్రనిర్మాణం ఏ ఒక్క వ్యక్తి స్వశక్తిమీద ఆధారపడి పూర్తవదు నిర్మాణదశలో వివిధశాఖల మధ్య సంపూర్ణసహకారం వున్నప్పుడే అది సంభవము సువర్ణసుందరి చిత్రం విజయవంతంగా పూర్తవడానికి సహకరించిన స్టూడియో యాజమాన్య వర్గానికి, స్టూడియోలో పనిచేసిన ఇతర సాంకేతిక, కార్మికవర్గానికి నటీనటులకు నిర్మాతల తరపున కృతజ్ఞతాభివందనాలర్పిస్తున్నాను నేటి కార్యక్రమంలో పాల్గొన్న యావన్మందికీ నిర్మాతల తరపున అభివందనలు తెలుపుతున్నాను అన్నారు తర్వాత శ్రీ సముద్రాల రాఘవాచార్య మాట్లాడుతూ, చిత్రనిర్మాణంలో ప్రతిచిన్న కార్మికుడూ దాని విజయానికి కారణభూతుడనీ, నిర్మాత, సాంకేతికజ్ఞులు, నటీనటులు ఇతర కార్మిక వర్గాలమధ్య సంపూర్ణసహకారం, సమిష్టి కృషి వున్నప్పుడే విజయం లభిస్తుందనీ, ఈ విషయంలో అంజలీపిక్చర్స్‌వారు పూర్తిగా కృతకృత్యులయ్యారనీ అన్నారు స్టుడియో తరఫున శ్రీ చిన్నారావుగారు మాట్లాడారు తర్వాత స్టూడియో సిబ్బంది యావన్మందిని శ్రీమతి అంజలీదేవి నూతనవస్త్రాలు బహూకరించి తగువిధంగా గౌరవించారు

29 తేదీ బుధవారం సాయంత్రం 6 గంటలకు అంజలీ పిక్చర్స్ ఆఫీసులో, 'సువర్ణ సుందరి' చిత్రానికి పనిచేసిన అంజలీ పిక్చర్స్ ప్రొడక్షన్ స్టాఫ్ యావన్మందికీ, నిర్మాతలు తేనీటివిందు చేశారు ★

మనసారగ

ఎందుకంటే, సృజనాత్మక శక్తి గలవాడికి స్వయంకృషిమీదనే అభిమానం ఉంటుంది తప్ప అనుకరణమీద కాదు రెండో పద్ధతిలో పాటలు కట్టి సెభాషనిపించుకున్నా తృప్తి ఉండదు ఎదటి మనిషికి ఇతగాడిమీద గౌరవమూ, విశ్వాసమూ క్రమంగా తగ్గుతాయి దాని పర్యవసానం, ఈ వ్యక్తిలోకూడా ఆత్మవిశ్వాసం నశించడం

ఇంత భారీ ఎత్తున అటువంటి కార్యక్రమం అమలు జరగడం, సంగీత నిలయమైన మన సీమకు ఏ విధంగానూ శుభప్రదం కాదు ★

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd, by S Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras 1 Editor S. Sambhu Prasad



లంబాడీవనిత ఉదయాలంకరణం

ఫొటో: వి. కేశవశర్మ.


త్వరలో!
దొంగా పుట్టాడతను!
విధి-మానవులు-పరిస్థితులు
ఏకమై అతన్ని దొంగను చేశాయి.
దుర్విధిని ధిక్కరించి
న్యాయానికి దూరమైనాడు.
న్యాయరక్షకుడు - తండ్రి!
నేరస్థుడు-ఒక్కగానొక్క
కొడుకు!!!
చందమామ వారి
దొంగల్లో దొర
నవయుగ
రిలీజ్
దర్శకత్వము... పి. చంగయ్య, బి.ఎ.